ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 06-10- 2026 | సంపుటి: 17, సంచిక: 185, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను

తీర్చిదిద్దుతాం

భూ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నిర్మల్ అక్టోబర్ 05 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించి, తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 72 వేల నుంచి 73 వేల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టగా, రెండో దశలో మరో రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...

తెలంగాణ ప్రాజెక్టులకు

కేంద్రం సహకరించాలి

చింతన్ శివిర్‌లో నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక భేటీ

ఎల్‌బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ వెంటనే మంజూరు చేయాలని కోరిన మంత్రి

హైదరాబాద్-శ్రీశైలం NH-765పై ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రత్యేక విజ్ఞప్తి

ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ ఇన్ఫ్రా పై ప్రత్యేక దృష్టి సారించిందని వివరించిన మంత్రి

మంత్రి కోమటి రెడ్డి విజ్ఞప్తి చేసిన రాష్ట్ర ప్రాజెక్టుల అంశంపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



గుజరాత్(ఎక్తానగర్): గుజరాత్ రాష్ట్రం నర్మదజిల్లా లోని ఎక్తానగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న చింతన్ శివిర్-2026 రెండు రోజుల కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి అట్టహాసంగా ప్రారంభించారు.

మొదటి రోజు సమావేశంలో పలు రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టుల్లో కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం వంటి వివిధ అంశాలపై జరిగిన చర్చ అనంతరం..కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటి రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

తరువాయి 2వ పేజీలో...



గోదావరి పుష్కరాలకు పకడ్బందీ

ఏర్పాట్లు చేపట్టాలి

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలి
రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 5 (ప్రజాకలం)

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అధికారులకు సూచించారు.జిల్లా కలెక్టరేట్ లో కాన్ఫరెన్స్ హాల్ లో గోదావరి పుష్కరాలు-2027 పై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి సమీక్ష సమావేశంను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు-2027ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి, కోటిలింగాల తదితర పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. జగిత్యాల జిల్లాలో గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తుల రాక భారీగా ఉండే అవకాశం ఉన్నందున రహదారులు, ఘాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, పార్కింగ్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురి పుష్కర ప్రాంతంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి పలు శాఖలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, మొత్తం రూ. 226.41 కోట్ల మేర వివిధ శాఖల పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఎండోమెంట్స్, ఇరిగేషన్, పీఆర్ఈడీ, ప్రజారోగ్యం, నీటి సరఫరా--పారిశుధ్యం, టూరిజం, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖలకు సంబంధించిన పనులు వివరాలు సంబంధిత అధికారులు వివరించారు.జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం లో బోర్నపెల్లి, కమ్మునూరు, చిత్రవేణి గూడెం మరియు గోదావరి పరివాహక ప్రాంతంలో కూడా గోదావరి పుష్కర స్నానాలకు వచ్చే ప్రజలకు, భక్తులకు కావలసిన వసతులు,

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



భయం పుట్టించాలి


నేరం జరిగాక ఏం చేశామన్నది కాదు.. అది జరగకుండా నివారించడం ముఖ్యం: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 5: దేశ రాజధాని ఢిల్లీలో.. ముఖ్యంగా కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లో మహిళలకు భద్రత లేదన్న భావన నెలకొందని సుప్రీంకోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. మహిళలపై నేరాలకు పాల్పడే గూండాల గుండెల్లో భయం పుట్టించాల్సిన అవసరం ఉందని.. తప్పుచేస్తే చస్తామన్న భయం పుట్టాలని స్పష్టంచేసింది. రాజధాని ప్రాంతంలో ఇటీవల జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం.. పై వ్యాఖ్యలు చేసింది. 'ఢిల్లీ రోడ్లపైన, మెట్రోలో అర్ధరాత్రి 11గంటలకు ప్రయాణించేటప్పుడు కూడా సురక్షితమేనన్న భరోసా ప్రతి మహిళకూ ఇవ్వాల్సిన అవసరం ఉంది. నేరం జరిగిన తర్వాత ఏం చేశామన్నది కాదు.. అసలు నేరం జరుగకుండా నివారించడం ముఖ్యం' అని తెలిపింది. 2012 నిర్భయ గ్యాంగ్‌రేప్ కేసును ఈ సందర్భంగా ప్రస్తావించింది. '2012లో ఏం జరిగిందో మీకు తెలుసు. నిందితులు మద్యం తాగి బస్సెక్కి.. దారుణ అత్యాచారానికి పాల్పడ్డారని కేసు రికార్డు చెబుతోంది. పోలీసులు బీట్ పెట్రోలింగ్ కూడా పెంచాల్సిన అవసరం ఉంది. ప్రజలతో నిత్యం సంభాషిస్తూ ఉండాలి. మిమ్మల్ని చూసి ప్రజలు పారిపోకూడదు. నిందితుల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలి.

వైద్యరంగంలో

బిగ్ బ్రేక్‌థ్రూ!

ముగ్గురికి నోబెల్! - 2026 వైద్యశాస్త్ర నోబెల్ పురస్కారం
మెదడు, నాడీకణాలపై పరిశోధనలో కీలక పురోగతికి గుర్తింపు



హైదరాబాద్, అక్టోబరు 5 (ప్రజాకలం) : వైద్యశాస్త్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026 Nobel Prize in Physiology or Medicineను ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా అందుకున్నారు. కార్ల్ డిసెరోత్ (Karl Deisseroth), పీటర్ హెగెమన్ (Peter Hegemann), జార్జ్ నాగెల్ (Georg Nagel)లకు ఈ ఏడాది నోబెల్ పురస్కారం ప్రకటించారు. వీరు చేసిన కీలక పరిశోధనలు light-gated ion channels మరియు optogenetics రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీశాయి. అసలు Optogenetics అంటే ఏంటి? మెదడులోని నాడీకణాలు ఎలా పనిచేస్తాయి? అవి ఒకదానితో ఒకటి

తరువాయి 2వ పేజీలో...

పాఠశాల భవనం.. పార్కింగ్ కు అడ్డాగా..!

మందుబాబులకు కూడా అడ్డాగా మారిందన్న ఆరోపణలు - పట్టించుకోని అధికారులు
విద్యార్థుల భద్రతపై ఆందోళన.. భవనాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికుల డిమాండ్







మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 5 (ప్రజా కలం) విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాల భవనం ప్రస్తుతం వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. మెట్‌పల్లి పట్టణంలోని మున్సిపల్ భవనం వద్ద ఉన్న ఈ భవనం వినియోగంలో లేకపోవడంతో పరిసర ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం కింద ద్విచక్ర వాహనాలతో పాటు కార్లను కూడా నిలిపివేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. భవనం చుట్టూ పరిశుభ్రత లోపించడంతో పాటు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయిన పరిస్థితి నెలకొంది. భవనం ఖాళీగా ఉండటంతో రాత్రి వేళల్లో కొందరు మందుబాబులకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడాల్సిన పాఠశాల భవనం ఇలా నిరుపయోగంగా ఉండటం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భవనాన్ని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి విద్యా అవసరాలకు వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.అలాగే పాఠశాల పరిసరాల్లో వాహనాల పార్కింగ్‌ను నియంత్రించి, రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు స్పందించి భవనం ప్రస్తుత పరిస్థితిపై సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారా.. లేదా.. వేచి చూడాల్సిందే.

ప్రైవేటుకు ధీటుగా

ప్రభుత్వ పాఠశాలలు

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు
రూ.200 కోట్లతో రాములపల్లిలో ఇంటర్నేషనల్ లెవల్ స్కూల్

పెద్దపల్లి,అక్టోబర్ 05:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రాష్ట్రంలోని పేద,మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్లకు ధీటుగా నాణ్యమైన విద్యా సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు.ఎలిగేడు మండలం రాములపల్లి వద్ద రూ. 200 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను సోమవారం రోజున అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు కులమతాల బేధం లేకుండా విద్యార్థులందరూ ఒకే వేదికపై చదువుకునేలా ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్



పాఠశాలలను మంజూరు చేశారని పేర్కొన్నారు.రాములపల్లిలో ఏర్పాటు చేస్తున్న ఈ పాఠశాలలో 2,560 మంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు హాస్టల్,విశాలమైన ప్లే గ్రౌండ్, అత్యాధునిక డైనింగ్ హాల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన గత రెండున్నర సంవత్సరాలలోనే పెద్దపల్లి నియోజకవర్గం లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి

తరువాయి 2వ పేజీలో...

తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు, కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు, నిధుల మంజూరీలు, జాతీయ రహదారుల అభివృద్ధి అంశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ ఇన్ఫ్రా పై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వివరించారు.

తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధి, సేతు బంధన్,CRIF పనులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేలా పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సహకారం అందించాలని నితిన్ గడ్కరీని కోరారు.

ఎల్‌బీనగర్–హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్

హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మీ. మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని మంత్రి కోరారు.

ఇప్పటికే ఎన్‌హెచ్–65లో ఎల్‌బీనగర్–మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లతో సహా ఆరు(6+2) లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ. 545 కోట్లతో కేంద్రం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఎక్కువగా నిర్మాణాలు ఉన్న ప్రాంతాల్లో ఆర్ఈ వాల్‌కు బదులుగా వయాడక్ట్ విధానంలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని వివరించారు.

మియాపూర్–ఎల్‌బీనగర్ మెట్రో రైలు కారిడార్‌ను రెండో దశలో హయత్‌నగర్ వరకు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, మెట్రోతో సమన్వయం ఉండేలా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు 2026–27 వార్షిక ప్రణాళికలో చోటు కల్పించి మంజూరు చేయాలని కోరారు.

పార్వతమాల కింద 5 రోప్‌వే ప్రాజెక్టులు

తెలంగాణలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు పార్వతమాల పథకం కింద రూ. 1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జునసాగర్–నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో ఈ రోప్‌వేలను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇవి భక్తులు, పర్యాటకులు, స్థానిక ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంతో పాటు పర్యావరణహిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి దోహదపడతాయని వివరించారు.

మూడు కీలక ROB/RUBలకు మంజూరు

2026–27 ఆర్థిక సంవత్సరానికి సేతు బంధన్ పథకం కింద మూడు కీలక ROB/RUB ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని మంత్రి కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం బైపాస్ వద్ద నాలుగు లేన్ల ROB, పెద్దపల్లి జిల్లాలో సుల్తానాబాద్ వద్ద రెండు లేన్ల ROB, నల్గొండ జిల్లాలో పగిడిపల్లి–నడికుడి రైల్వే సెక్షన్‌లో నాలుగు లేన్ల ROB నిర్మాణ ప్రతిపాదనలను కేంద్రం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

NH-65 ఆరు లేన్ల విస్తరణకు వేగంగా ఆమోదాలు

తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్–విజయవాడ–మచిలీపట్నం చీఎ–65ను ఆరు(6o2) లేన్లుగా విస్తరించే ప్రాజెక్టును వేగవంతం చేయాలని మంత్రి కోమటి రెడ్డి,నితిన్ గడ్కరీని కోరారు. ప్రస్తుతం ఈ రహదారిపై ట్రాఫిక్ 1.20 లక్షలకు పైగా వాహనాలకు చేరిందని, అనేక ప్రమాదకర ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్లు ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా రహదారిని విస్తరించడంతో పాటు రోడ్డు భద్రతను మెరుగుపరచడం అత్యవసరమని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు అలైన్‌మెంట్ ఆమోదం, PATSC, PPPAC ఆమోదాలు ఇప్పటికే లభించాయని, CCEA ఆమోదం కోసం సిఫారసు చేసిన నేపథ్యంలో త్వరగా తుది ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చీఎ–765పై ఎలివేటెడ్ కారిడార్

హైదరాబాద్–శ్రీశైలం NH–765లో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మంజూరు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతంలో రహదారి విస్తరణకు ఎదురవుతున్న సమస్యలకు ఎలివేటెడ్ కారిడార్ పరిష్కారంగా నిలుస్తుందని, శ్రీశైలం వెళ్లే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడంతో పాటు నల్లమల అటవీ ప్రాంత పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు.

CRIF కింద 33 పనులకు రూ.1,227.75 కోట్ల మంజూరు కోరిన మంత్రి

2026–27 ఆర్థిక సంవత్సరానికి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో 33 రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. మొత్తం 511.68 కి.మీ. పొడవుతో చేపట్టనున్న ఈ పనులకు రూ. 1,227.75 కోట్ల అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. గౌరవ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన ఈ పనులు రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని, వీటిని పరిశీలించి 2026–27 CRIF పథకం కింద మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు.

RRR ఉత్తర భాగానికి ఆర్థిక, కేబినెట్ ఆమోదం కోరిన మంత్రి

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డులోని ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదం త్వరగా ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. సంగారెడ్డి–నర్సాపూర్–తూప్రాన్–గజ్వేల్–జగదేవ్‌పూర్–భువనగిరి–చౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ. మేర నిర్మించనున్న RRR ఉత్తర భాగానికి భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే 90 శాతానికి పైగా భూములకు అవార్డులు ఆమోదమయ్యాయని, NHAI టెండర్లు కూడా ఆహ్వానించినందున వీలైనంత త్వరగా ఆర్థిక, కేబినెట్ ఆమోదాలు ఇవ్వాలని కోరారు. అదే సమయంలో హైదరాబాద్ చుట్టూ పూర్తి రింగ్‌ను ఏర్పాటు చేసేందుకు RRR దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతో సమానంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక పార్కులు, రేడియల్ రోడ్లు తదితర భవిష్యత్ మౌలిక వసతులకు దక్షిణ RRR కీలకంగా మారుతుందని వివరించారు.

హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య భవిష్యత్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సంబంధించి డీపీఆర్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని మంత్రి కోరారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేను తెలంగాణలోని డ్రైపోర్టుతో అనుసంధానం చేయడం ద్వారా సరుకు రవాణా సులభతరం అవుతుందని, ఆర్థిక కార్యకలాపాలు, పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. బందర్ పోర్టుకు స్పర్ కనెక్టివిటీ కల్పించే అవకాశం కూడా ఉందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులన్నింటినీ సానుకూలంగా పరిశీలించి, కేంద్ర స్థాయిలో అవసరమైన అనుమతులు, నిధుల మంజూరీలు, కేబినెట్ ఆమోదాలను త్వరితగతిన పూర్తి చేసి రాష్ట్రానికి సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. మంత్రి రాష్ట్ర ప్రాజెక్టుల కోసం చేసిన విజ్ఞప్తుల పట్ల నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. మంత్రి వెంట ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,చీఫ్ ఇంజనీర్లు బి.వి రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్ పలువురు అధికారులు ఉన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి...

పుష్కఘాట్లు, రోడ్లు, విద్యుత్ పనులను వేగవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు–2027ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని పుష్కర ఘాట్లు, రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య, పోలీస్ తదితర ఏర్పాట్లను సమగ్రంగా చేపడుతున్నామని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని ధర్మపురి, వెల్గటూర్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, బీర్‌పూర్, రాయికల్ మండలాల్లోని పుష్కర ఘాట్లకు సంబంధించి ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు.ధర్మపురి, కోటిలింగాల ప్రాంతాల్లో ఘాట్ల అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ ద్వారా పనులు చేపడుతున్నామని, ధర్మపురి వద్ద 470 మీటర్ల మేర కొత్త ఘాట్లు, కోటిలింగాల వద్ద 210 మీటర్ల మేర కొత్త ఘాట్లకు సంబంధించిన పనులు మంజూరయ్యాయని తెలిపారు. ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, కోటిలింగాల ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ పనులకు ఎండోమెంట్స్ శాఖ ద్వారా చెరో రూ.10 కోట్ల చొప్పున నిధులు మంజూరై పనులు ప్రారంభమైనట్లు తెలిపారు.భక్తుల సౌకర్యార్థం ధర్మపురి మున్సిపాలిటీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్ల మేర పనులు చేపడుతున్నామని, అదేవిధంగా నీటి సరఫరా, పారిశుధ్య సౌకర్యాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు.పుష్కరాల సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల భద్రతకు అవసరమైన పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరాలు తదితర అంశాలకు కూడా ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చేపట్టిన ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దిష్ట సమయంలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన పుష్కర అనుభవం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష లో జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, మెట్ పెల్లి ఆర్డీవో నరసింహా రావు, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, పంచాయతీ రాజ్, రోడ్డు భవనాల శాఖ అధికారులు, తహసీల్దార్ లు, ఎంపిడివోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

మొదటి పేజీ తరువాయి...

రూ. 70 కోట్లు మంజూరు చేసి నూతన భవనాలు, మరుగుదొడ్లు,ప్రహరీ గోడల నిర్మాణాలు చేపట్టినట్లు ఆయన వివరించారు.గత ప్రభుత్వంలో పదేళ్లపాటు పరిపాలించిన అప్పటి ప్రజాప్రతినిధి ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకోకుండా తన సొంత ప్రైవేటు పాఠశాలల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని తీవ్రంగా విమర్శించారు.తెలంగాణ విద్యా వ్యవస్థలో సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం పూట అల్పాహారాన్ని ప్రారంభించారని,వారంలో మూడు రోజులు పాలు,మరో మూడు రోజులు రాగి జావ అందిస్తున్నామని తెలిపారు.దేశ చరిత్రలోనే తొలిసారిగా ఇంటర్ విద్యార్థులకు హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ భాగస్వామ్యంతో ఉచిత మధ్యాహ్న భోజనం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని కొనియాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ,ఎల్కేజీలకే సంవత్సరానికి రూ. 30వెల నుంచి రూ. 40వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని, కానీ ప్రభుత్వ పాఠశాలల్లో బి.ఎడ్ పూర్తి చేసిన అత్యంత నిపుణులైన ఉపాధ్యాయుల చేత నాణ్యమైన బోధన ఉచితంగా అందుతుందన్నారు.కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్,సింగిల్ విండో చైర్మన్లు,డైరెక్టర్లు,మండల పార్టీ అధ్యక్షులు, పలు గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్యరంగంలో బిగ్ బ్రేక్‌థ్రూ!

మొదటి పేజీ తరువాయి...ఎలా సంకేతాలను పంపుకుం టాయి? ఇలాంటి కీలక ప్రశ్నలకు సమాధానాలు కనుగొనేందుకు Optogenetics research ఎంతో ఉపయోగపడుతోంది. కాంతిని ఉపయోగించి నిర్దిష్ట నాడీకణాల కార్యకలాపాలను నియంత్రించడం, వాటి పనితీరును అధ్యయనం చేయడం ఈ సాంకేతికతలో ప్రధాన అంశం. ఈ పరిశోధన ద్వారా Brain Research, Neuroscience, Neural Activity, Brain Function వంటి రంగాల్లో శాస్త్రవేత్తలకు మరింత స్పష్టమైన అవగాహన లభించింది. ముఖ్యంగా నాడీకణాల్లో కాంతి ఆధారంగా జరిగే ప్రక్రియలను అధ్యయనం చేయడానికి ఈ ఆవిష్కరణలు కీలకంగా మారాయి.

ముగ్గురు శాస్త్రవేత్తలకు ఎందుకు నోబెల్?

కాంతికి స్పందించే అయాన్ ఛానళ్లపై చేసిన ప్రాథమిక పరిశోధనలను పీటర్ హెగెమన్, జార్జ్ నాగెల్ ముందుకు తీసుకెళ్లగా.. కార్ల్ డిసెరోత్ ఆ జ్ఞానాన్ని నాడీకణాల కార్యకలాపాలను నియంత్రించే Optogenetics technology అభివృద్ధిలో కీలకంగా ఉపయోగించారు. వీరి పరిశోధనల ఫలితంగా మెదడులోని నిర్దిష్ట నాడీకణాలను లక్ష్యంగా చేసుకుని వాటి కార్యకలాపాలను అధ్యయనం చేయడం సాధ్యమైంది. అందుకే 2026 Medicine Nobel Prizeలో వీరి పరిశోధనలకు ప్రత్యేక గుర్తింపు లభించింది.వైద్యశాస్త్రం, న్యూరోసైన్స్, బ్రెయిన్ రీసెర్చ్ వంటి రంగాల్లో భవిష్యత్ పరిశోధనలకు ఈ ఆవిష్కరణలు మరింత దోహదపడే అవకాశం ఉంది.

అట్టహాసంగా కొలువుదీరిన ఖమ్మం రెడ్ క్రాస్ సొసైటీ

నూతన పాలకవర్గం



ఖమ్మం, అక్టోబర్ 05(ప్రజా కలం న్యూస్)

రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా కమిటీ చైర్మన్ గా డాక్టర్ జి వెంకటేశ్వర్లు (డా.జీవీ), వైస్ చైర్మన్ గా కమర్తపు కిరణ్ కుమార్, ట్రెజరర్ గా యార్లగడ్డ రాఘవరావు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కొల్ల రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తోలుత ఎన్నికల అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతన పాలకమండలి సమావేశం నిర్వహించి అనంతరం సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ సందర్భంగా నూతన కమిటీ చైర్మన్ డా. జీవీ, వైస్ చైర్మన్ కమర్తపు కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజల సహకారంతో రెడ్ క్రాస్ సొసైటీ ఓటర్ల నమ్మకంతో ఖమ్మం జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ కి జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించినందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు మూడేళ్లపాటు ఈ నూతన కమిటీ బాధ్యతల్లో ఉంటుందని వారు తెలిపారు. కాగా మొదటి సంవత్సరం పాలకవర్గ కమిటీ చైర్మన్ గా డాక్టర్ జి వెంకటేశ్వర్లు, రెండవ సంవత్సరం కమిటీ చైర్మన్ గా డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, మూడవ సంవత్సరం కమిటీ చైర్మన్ గా డాక్టర్ ప్రదీప్ కుమార్ కూరపాటి బాధ్యతలలో ఉంటారని ఆయన స్పష్టం చేశారు.

మాది పదవుల పంపకం కాదు. బాధ్యతల పంపకం..

ఎంతో నమ్మకంతో మాకు ఓటు వేసి గెలిపించిన వారికి, ఈ జిల్లా ప్రజలకు మా కమిటీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని నూతన కమిటీ చైర్మన్ డా.జీవీ స్పష్టం చేశారు. మాది పదవులు పంపకాల కోసం చేసే ఆరాటం కాదని, రెడ్ క్రాస్ సొసైటీని తమ సేవలతో అత్యున్నత శిఖరం వైపు నడిచేందుకు బాధ్యతలను మాత్రం పంచుకున్నామని వారు తెలిపారు. ఇందుకు సంబంధించి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అట్టహాసంగా కొలువుదీరిన పాలకవర్గం

ఖమ్మం రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో విజయం సాధించిన ఖమ్మం సర్వీస్ ఫ్రంట్ సోమవారం రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో లాంచనంగా కొలువుదిరింది.

ఇందుకు సంబంధించి సోమవారం సాయంత్రం ఖమ్మంలోని రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఖమ్మం జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల అధికారి గా శ్రీనివాసరావు,సమక్షంలో పాలకవర్గం మొదటి సమావేశం నిర్వహించడం తోపాటు ప్రమాణ స్వీకారాన్ని పూర్తి చేయించారు. దీనిలో భాగంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న అనంతరం ఒక్కొక్కరితో వ్యక్తిగతంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఖమ్మం రెడ్ క్రాస్ సొసైటీ నూతన చైర్మన్గా డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు వైస్ చైర్మన్ గా సమర్థపు కిరణ్ కుమార్ జిల్లా ట్రెజరర్ గా యార్లగడ్డ రాఘవ స్టేట్ కమిటీ మెంబర్ గా కొల్లా రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఫౌండర్ మెంబర్ కూరపాటి వెంకటేశ్వర్లుకు ఘనంగా సన్మానం చేశారు. ఎన్నికైన వారంతా వారి బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ప్రమాణస్వీకారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మాట్లాడుతూ మా కమిటీపై అత్యంత విశ్వాసం ఉంచి గెలిపించినటువంటి ఖమ్మం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఓటర్లకు అండగా నిలిచిన మిత్రులకు స్నేహితులకు మీడియాకు జిల్లా ప్రజలకు తమ కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు పాలకవర్గం సభ్యులను వారి శ్రేయోభిలాషులు బంధువులు స్నేహితులు అన్ని వర్గాల ప్రజలు ఘనంగా శాలువలతో పూలదండలతో సత్కరించారు.



గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను

తీర్చిదిద్దుతాం

మొదటి పేజీ తరువాయి...

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అటవీ సంబంధిత సమస్యల కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోకుండా, పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సూచించారు. అవసరమైతే ఈ అంశంపై రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి తెలిపారు. గతంలో సుమారు 125 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని, ప్రస్తుతం వచ్చే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో భూ సర్వే పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మనిషికి ఆధార్ ఎలాగో ప్రతి భూ కమతానికి భూధార్ రూపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. భూముల సమగ్ర సర్వేతో భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిం చాలని అధికారులకు సూచించారు. సర్వేను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అదనపు సామగ్రిని సమకూరుస్తామని తెలిపారు. యువ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. భూ సర్వేలో పనిచేయడం ద్వారా అధికారులకు క్షేత్రస్థాయి పరిపాలనపై మంచి అవగాహనతో పాటు భవిష్యత్తులో తమ సర్వీసులో ఉపయోగపడే అనుభవం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో భూ సర్వేను దశలవారీగా నిర్వహించి, ప్రతి భూ కమతానికి ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) నంబర్ కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలను నమోదు చేసి, భూ హక్కులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి మంత్రి జూపల్లి కృష్ణారావు

అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పరిపాలన ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి బలమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అటవీ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, సంబంధిత అధికారులు తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ సర్వే ఒక గొప్ప అవకాశమని మంత్రి పేర్కొన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించాలని, నిర్దేశిత గడువులోగా సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్టుపల్లిలో ధ్యానోత్సవం ప్రారంభం



మెట్ పల్లి టౌన్ అక్టోబర్ 5(ప్రజా కలం):

మెట్ పల్లి పట్టణంలోని వాసవి గార్డెన్‌లో మూడు రోజుల హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెట్టుపల్లి మున్సిపల్ చైర్మన్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి హాజరయ్యారు.అక్టోబర్ 5 నుంచి 7వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు ధ్యాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం ద్వారా కలిగే ప్రయోజనాలు, రిలాక్సేషన్, క్లీనింగ్, ప్రార్థన తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. కాన్హా హార్ట్‌ఫుల్‌నెస్ జోనల్ కోఆర్డినేటర్, రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ శాస్త్రి శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో కాన్హా జోనల్ కోఆర్డినేటర్ ప్రదీప్, జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్ మంచాల కృష్ణ, ప్రిసెప్టర్లు దారం గోపి, రాజగోపాల్‌తో పాటు మెట్టుపల్లి హార్ట్‌ఫుల్‌నెస్ అభ్యాసీలు అల్లకట్టు సత్యనారాయణ, పడిగేలా శ్రీనివాస్, దొంతుల పవన్, మహాజన్ నవీన్, పెండెం శివానందం, కంటాల ఆనందం, రమేష్, కన్నయ్య, లక్ష్మి, కరుణ, నీరజ, పద్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిచే మంత్రి అడ్లూరి, డీసీసీ అధ్యక్షునికి నందయ్యకు సన్మానం



ధర్మపురి ప్రతినిధి అక్టోబర్ 5 (ప్రజాకలం):

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన మెట్‌పల్లికి చెందిన మహమ్మద్ ఖుతుబోదీన్ పాషా ధర్మపురిలోని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తనకు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు దక్కేందుకు ప్రత్యేక చొరవ చూపిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్యలను పాషా ఘనంగా సన్మానించారు. మంత్రి లక్ష్మణ్ కుమార్, గాజంగి నందయ్యలకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి పాషా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాషా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కార్యదర్శి ఏలేటి వినోద్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రోడ్డ రాజకుమార్, సెక్రటరీ ఆమేర్, సెక్రటరీ జాఫర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ తుమ్మల ప్రశాంత్, నాయకులు బైండ్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

ఎండ పల్లి, అక్టోబర్ 05 : (ప్రజా కలం ప్రతినిధి) మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ సోమవారం రోజున ప్రజావాణి (ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించ బడింది.



మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన 06 దరఖాస్తులు స్వీకరించ బడ్డాయి. అధికారులు అర్జీలను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆదేశించారు. హాజరైన పలు శాఖల అధికారులు జర అయ్యారు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్, మండల తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి కామాల్ల మహేష్, పసి వైద్యాధికారి డాక్టర్ బూర మనోజ్ కుమార్,మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ, వైద్య శాఖ నుండి ఎంపిహెచ్ఏ ఎస్. శ్రీనివాస్, శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి అంగన్ వాడి సిడిపిఓ యం. ఆండాలు, ఎస్సీ సంక్షేమ శాఖ. హెచ్ డబ్ల్యూఓ ఎం డి అప్సర్, మండల హౌసింగ్ ఎఈ ఎస్. గౌతమి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ / రెంజ్ ఆఫీసర్ ఇస్లావత్ నరేష్, విద్యుత్ శాఖ నుండి లైన్ ఇన్స్పెక్టర్ సిహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు. మండల ప్రజా పరిషత్-3 తహశీల్దార్-02 ఇందిరమ్మ ఇల్లు-1 ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని ఎంపీడీవో దొండ కృపాకర్ తెలిపారు.

బెల్లంపల్లి నుంచి హైదరాబాద్ కు ఆర్టీసీ బస్సులు



మంచిర్యాల,అక్టోబర్ 5, (ప్రజాకాలం) మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నుంచి హైదరాబాద్కు ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో 12 సూపర్ లగ్జరీ, 2 లహరి ఏసీ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. మంచిర్యాల డిపో కూడా బెల్లంపల్లి నుంచి హైదరాబాదు సూపర్ లగ్జరీ బస్సును నడుపుతోందన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని నద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందస్తు టికెట్లను ఆర్టీసీ అధికారిక వెబ్సైట్లో బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఓమాన్ నుంచి యూఏఈలోకి చొరబాటు

- ఆరు నెలల జైలు, రూ.39 లక్షల జరిమానా

- శిక్షా కాలం పూర్తయినా జరిమానా చెల్లించలేక దుబాయి జైల్లో మగ్గుతున్న జగిత్యాల జిల్లావాసి

- జరిమానా మాఫీ చేయించి, క్షమాభిక్ష ఇప్పించాలని సీఎం రేవంత్ రెడ్డిని వేడుకుంటున్న కుటుంబం

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 5 (ప్రజాకలం)

పాస్‌పోర్ట్, వీసా లేకుండా ఓమాన్ నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) లోకి చొరబడి, ఎనిమిదేళ్ల పాటు దుబాయిలో అక్రమంగా నివసించిన కేసులో జగిత్యాల జిల్లా బీమారం మండలం మోత్కురావుపేట గ్రామానికి చెందిన ఏగుర్ల మల్లేశంకు దుబాయి కోర్టు ఆరు నెలల జైలు శిక్ష, లక్షా యాభై వేల యూఏఈ దిర్హాలు (సుమారు రూ.39 లక్షలు) జరిమానా, అనంతరం దేశ బహిష్కరణ (డిపోర్టేషన్) విధించింది. 2018లో ఉపాధి కోసం ఓమాన్‌లోని మస్కట్‌కు వెళ్లిన మల్లేశం, కొందరి తప్పుడు సలహాలతో ఓమాన్ దేశ అంతర్జాతీయ సరిహద్దును దాటి యూఏఈలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఇరు దేశాల భద్రతా దళాల కళ్ళు గప్పి, రహస్యంగా ఎడారిలో కొంత దూరం కారులో, మరికొంత దూరం కాలినడకన ప్రయాణించి మస్కట్ – దుబాయిల మధ్య ఇరువైపులా సరిహద్దులు దాటడం సాధారణ విషయం. కాగా భూమార్గంలో ఈ ప్రయత్నంలో చాలామంది ప్రాణాలు కోల్పోవడం, జాడ తెలియకుండా పోవడం జరుగుతున్నది. గతంలో దుబాయిలో పనిచేసిన మల్లేశానికి యూఏఈలో 'ప్రవేశ నిషేధం' (నో ఎంట్రీ) ఉండటంతో మస్కట్ మార్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. దుబాయిలో సుమారు ఎనిమిదేళ్ల పాటు నివసించిన ఆయన మార్చి 8న జరిగిన తనిఖీల్లో అక్కడ పట్టుబడ్డారు. మల్లేశంను జైలు నుంచి విడుదల చేసి స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఎనుగుల లచ్చయ్య, గ్రామ ప్రముఖుడు బూమల్ల మహేష్, మల్లేశం భార్య లత, తల్లిఎం బచ్చవ్వ ఇటీవల 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'లో



ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం స్పందించి, దుబాయిలోని భారత కాన్సులేట్ ద్వారా మల్లేశం కేసుకు సంబంధించిన వివరాలను సేకరించినట్లు తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి తెలిపారు.దుబాయిలోని అవీర్ జైలును జూలై 23న సందర్శించిన భారత కాన్సులేట్ అధికారులు మల్లేశాన్ని కలుసుకున్నారని, ఫోర్జరీ (నకిలీ పత్రాలు) కేసులో ఆరు నెలల జైలు శిక్ష, లక్షా యాభై వేల యూఏఈ దిర్హాల జరిమానా,అనంతరం దేశ బహిష్కరణ విధించబడినట్లు జైలు అధికారులు తెలిపారని దుబాయిలోని భారత కాన్సులేట్ కాన్సులర్ విభాగం అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఆశిష్ శర్మ తెలంగాణ ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగానికి ఈమెయిల్ ద్వారా తెలియజేసినట్లు భీంరెడ్డి తెలిపారు. ఈ వివరాలను ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ బిభూతి నాథ్ పాండే, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు కూడా లేఖ ద్వారా తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు కూడా కేసు వివరాలను తెలియజేశారు.మల్లేశంకు విధించిన శిక్షా కాలం పూర్తయినప్పటికీ, సుమారు రూ.39 లక్షల జరిమానా చెల్లించలేక జైలులోనే కొనసాగుతున్నట్లు భీంరెడ్డి తెలిపారు. ఆయనను విడుదల చేసి స్వదేశానికి రప్పించేందుకు జరిమానా మాఫీ, క్షమాభిక్ష లేదా ఇతర అందుబాటులో ఉన్న న్యాయపరమైన మార్గాలపై 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' ద్వారా న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

గడ్డం వెంకటస్వామి కాక 97వ జయంతి వేడుకలు

– పేదల పక్షపాతి గడ్డం వెంకటస్వామి ఆశయాలను కొనసాగిద్దాం

– కాక జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం

– పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి



ఎండపల్లి, అక్టోబర్ 05 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని రాజారాం పల్లి గ్రామం లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణ లో గడ్డం వెంకటస్వామి కాక 97వ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి ఆధ్వర్యం లో ఘనంగా కాక వెంకట స్వామి 97వ జయంతి వేడుకలు సోమవారం రోజున ఎండపల్లి మండలం లోని రాజారాంపల్లి గ్రామం లో ఉన్న మినీ క్యాంపు కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి జరిగిన ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మద్దుల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, గడ్డం వెంకటస్వామి 1929లో జన్మించి 1957 నుంచి 2009 వరకు ప్రజా జీవితం లో కొనసాగుతూ రెండుసార్లు అసెంబ్లీ సభ్యులుగా, ఒకసారి రాష్ట్ర కార్మిక, పౌర సరఫరాల శాఖ మంత్రిగా, ఏడుసార్లు పార్లమెంట్ సభ్యులుగా విశేష సేవలందించారని గుర్తు చేశారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం లో సహాయ, పునరావాస శాఖ డిప్యూటీ మంత్రిగా, పీవీ నరసింహా రావు ప్రభుత్వం లో జౌళి, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా, అనంతరం టెక్స్టైల్స్, కార్మిక శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. పేదలకు పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు అందించడం తో పాటు, పేద ప్రజలతో అత్యంత సన్ని హితంగా ఉంటూ వారికి అన్ని విధాలా అండగా నిలిచారని, నిష్పక్ష పాతంగా వ్యవహరించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. అందుకే నియోజకవర్గ ప్రజలు ప్రేమ తో ఆయనను గుడిసెల వెంకటస్వామి గా పిలుచు కునేవారని తెలిపారు. వెంకట స్వామి వారసులు కూడా ఆయన సేవా స్ఫూర్తి, ఆదర్శాలను పుణికిపుచ్చుకుని విశాఖ ట్రస్టును స్థాపించి, దాని ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని మద్దుల గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. వెంకటస్వామి ఆశయా లను ముందుకు తీసుకె ళ్లడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమం లో పాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లు చంద్రశేఖర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు సంఘ రమేష్ యాదవ్, బాలసాని శారద మల్లేశం గౌడ్, పడిదం లావణ్య-మొగిలి, కొంగల జగదీశ్వర్ రెడ్డి, కోడిపెల్లి కొమురమ్మ-శ్రీనివాస్, ఏలేటి చంద్రారెడ్డి, బుర్ర గడ్డ శ్రీనివాస్, దేవి రవీందర్, పంజా సాయి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయులు పాల్గొన్నారు.

గడ్డం "వెంకటస్వామి" సేవలు మరువలేనివి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి

వెల్గటూర్, సెప్టెంబర్ 5, ప్రజాకలం, ప్రతినిధి :

గడ్డం వెంకటస్వామి (కాకా) సేవలు మరువ లేనివని కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి అన్నారు. సోమవారం వెల్గటూర్ లో గడ్డం వెంకటస్వామి (కాక) 97వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాక చిత్ర పటాన్ని ఆవిష్కరించి, పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వెల్గటూర్ మాజీ ఎంపీపీ ఎండీ.రజియా బషీర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి మాట్లాడుతూ, గడ్డం వెంకటస్వామి ప్రజా జీవితంలో కొనసాగుతూ రెండుసార్లు శాసన సభ్యులుగా, ఒకసారి రాష్ట్ర కార్మిక, పౌర సరఫరాల శాఖ మంత్రిగా, ఏడుసార్లు పార్లమెంట్ సభ్యులుగా విశేష సేవలందించారని అన్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వంలో సహాయ, పునరావాస శాఖ డిప్యూటీ మంత్రిగా,పీవీనరసింహారావు ప్రభుత్వంలో జౌళి, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా, అనంతరం టెక్స్టైల్స్, కార్మిక శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. సింగరేణి బొగ్గు గని కార్మికుల హక్కుల కోసం, కార్మిక కుటుంబాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడి, లక్షలాది కార్మిక కుటుంబాలకు అండగా



నిలిచారు అని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వెల్గటూర్ మాజీ సర్పంచ్ మెరుగు మురళీ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గుండాటి సందీప్ రెడ్డి , బిసి సెల్ మండల అధ్యక్షుడు బందెల ఉదయ్ గౌడ్, కోటిలింగాల ఆలయ డైరెక్టర్లు గుమ్ముల వెంకటేష్ , బుద్దె రవి , రాపాక రాయకోటయ్య, ఎఎంసి డైరెక్టర్ జూపాక ప్రవీణ్, పాసిగామ మాజీ సర్పంచ్ బొప్పు తిరుపతి, నాయకులు దావుల శశి, రామిల్ల లక్ష్మణ్ , గోపతి నరేష్ , గుమ్ముల అజయ్ , వెలగందుల సంతోష్ , బరుపటి జనార్ధన్, మన్నే జితేందర్, పాకాల నరేష్, రత్నాకర్ , బరుపటి మహేష్ , కొత్త రవి, నలమళ్ల సురేష్ కంటెం ప్రవీణ్ , కంటెం మధు, కంటెం రాజు,అల్లం సంతోష్ , తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో ఘనంగా మాజీ కేంద్రమంత్రి కాకా జయంతి వేడుకలు...



బెల్లంపల్లి, అక్టోబర్ 5, (ప్రజాకలం) ప్రతినిధి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో మాజీ కేంద్రం మంత్రి దివంగత గడ్డం కాకా వెంకటస్వామి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏఎంసీ ఏరియాలోని వెంకటస్వామి విగ్రహానికి పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్,మున్సిపల్ వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గెల్లి రాజలింగు,నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి జయంతి నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు ,నిరుపేదల హక్కుల కోసం వారీ సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి కాక వెంకట స్వామి అని అన్నారు. కాకా వెంకటస్వామి ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు....

బెల్లంపల్లి బిజెపి ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్..



బెల్లంపల్లి, అక్టోబర్ 5, (ప్రజాకలం) ప్రతినిధి..

ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలన, అంకిత భావం సందర్భంగా బెల్లంపల్లి బిజెపి పట్టణ అధ్యక్షురాలు ధారా కళ్యాణి ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు .ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, నాయకులు పట్టి వెంకట కృష్ణ పాల్గొన్నారు..అంగన్వాడీ టీచర్లను,ఆయాలను సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవకు ప్రతీకగా జరుగుతున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా... సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 7 వరకు దేశవ్యాప్తంగా 'అంగన్వాడీ ఉత్సవాలు' ఘనంగా నిర్వహించబడుతున్నాయన్నారు. సమాజంలో పసిపిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ, గర్భిణీలు,బాలింతల ఆరోగ్యాన్ని కాపాడడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయనీ. దేశ భవిష్యత్తు ఆ దేశ బాలల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. ఆ బాలలకు సరైన పోషకాహారం, ప్రాథమిక విద్యను అందించి వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కార్యకర్తలు (టీచర్లు), ఆయాలు అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు..

ప్రజావాణి ని సద్వినియోగం చేసుకోవాలి



మెట్ పల్లి రూరల్ , అక్టోబర్ 5:(ప్రజా కలం);మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన 17 మంది అధికారులు కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 7 పిటిషన్లు అందగా, వాటిలో మున్సిపల్ శాఖకు సంబంధించి 3, పోలీస్ శాఖకు 1, విద్యుత్ శాఖకు 3 పిటిషన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. పిటిషన్లను సంబంధిత శాఖల అధికారులకు అందజేసిన ఎంపీడీఓ, ప్రజా సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని మహేందర్ రెడ్డి సూచించారు.

కోటిలింగాలలో ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

-2027 పుష్కరాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి మద్దుల

ఎండపల్లి, అక్టోబర్ 05 : (ప్రజా కలం ప్రతినిధి) కోటిలింగాల గ్రామంలోని శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయం లో కొనసాగు తున్న ఆలయ అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి సోమవారం రోజున పరిశీలించారు. అలాగే 2027 పుష్కరాలను పురస్కరించుకుని ఆలయ పరిసరాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి, పనుల పురోగతిని సంబంధిత వారిని అడిగి తెలుసు కున్నారు. పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చే అవ కాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా అవసరమైన సౌక ర్యాలను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధితో పాటు భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని మద్దుల గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్య క్రమం లో పాక్స్ చైర్మెన్ గూడ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎండపల్లి మండల ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, ఎండపల్లి మండల సర్పంచు ల ఫోరం అధ్యక్షులు సంఘ రమేష్ యాదవ్, కొంగల జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజా కలం
మంగళవారం, అక్టోబర్ 6, 2026

ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికంగా సాగాలి

(ఎన్నికల వ్యవస్థపై విశ్వాసాన్ని కాపాడుకోవడం దేశం ముందున్న ప్రధాన బాధ్యత)

ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారానికి అసలైన మూలం ప్రజలు. ఆ ప్రజల సంకల్పాన్ని పాలనా వ్యవస్థకు చేరవేసే ఏకైక రాజ్యాంగబద్ధమైన సాధనం ఓటు. అందుకే ఓటు హక్కును ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువుగా అభివర్ణిస్తారు. ఎన్నికలు కేవలం ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రక్రియ కాదు; ప్రజల విశ్వాసం, రాజ్యాంగ విలువలు, సంస్థాగత నిష్పాక్షికతకు అద్దం పట్టే వ్యవస్థ. ఎన్నికల ఫలితాల కంటే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న నమ్మకమే ప్రజాస్వామ్య ఆరోగ్యానికి నిజమైన కొలమానం. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశం దాదాపు 96 కోట్ల మంది ఓటర్లతో ఎన్నికలను నిర్వహిస్తోంది. భాషలు, సంస్కృతులు, ప్రాంతాలు, సామాజిక వర్గాల పరంగా అపార వైవిధ్యం ఉన్న దేశంలో శాంతియుత అధికార మార్పిడి సాధ్యమవుతుండటం భారత ప్రజాస్వామ్య బలానికి నిదర్శనం. స్వాతంత్ర్యం తరువాత అనేక సాధారణ ఎన్నికలు, వందలాది రాష్ట్ర ఎన్నికలు నిర్వహించినప్పటికీ వ్యవస్థపై ప్రజల్లో ప్రాథమిక విశ్వాసం కొనసాగడం మన ప్రజాస్వామ్య విజయగాథలో ఒక కీలక అధ్యాయం. అయితే ప్రజాస్వామ్యం నిరంతర ప్రక్రియ. విశ్వాసం ఒకసారి సంపాదించుకున్నాక శాశ్వతంగా నిలిచిపోదు. దానిని ప్రతిరోజూ పునరుద్ధరించుకోవాల్సిందే. ఇటీవల ఓటరు జాబితాల ప్రత్యేక సవరణలు, ఓటర్ల చేరికలు మరియు తొలగింపులపై వ్యక్తమైన వివాదాలు, ఎన్నికల సంఘం నిర్ణయాలపై రాజకీయ పార్టీల మధ్య నెలకొన్న భిన్నాభిప్రాయాలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఈ చర్చలను ప్రజాస్వామ్య బలహీనతగా కాకుండా వ్యవస్థ మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయాలనే సామాజిక ఆకాంక్షగా చూడాలి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం కూడా అవసరమే; అదే సమయంలో సంస్థలపై ఆధారరహిత అనుమానాలు పెంచడం మాత్రం ఎవరికీ మేలు చేయదు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థల అత్యంత విలువైన ఆస్తి అధికారాలు కాదు, ప్రజల విశ్వాసం. అందుకే ఎన్నికల నిర్వహణలో పారదర్శకత మరింత పెరగాలి. ఓటరు జాబితాల మార్పులు తక్షణమే ప్రజలకు అందుబాటులో ఉండాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి ఓటరికి సమాచారం చేరే విధానాలను బలోపేతం చేయాలి. ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలను మరింత సులభతరం చేయాలి. ఎన్నికల ప్రక్రియ ఎంత నిష్పాక్షికంగా ఉంటుందో, అంతే నిష్పాక్షికంగా కనిపించడమూ ముఖ్యమే. ఇక రాజకీయ పార్టీల బాధ్యత కూడా తక్కువ కాదు. ఎన్నికల్లో గెలుపు ప్రజాస్వామ్య విజయానికి ఒక భాగమైతే, ఓటమిని హుందాగా అంగీకరించడం మరో భాగం. తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల వ్యవస్థనే లక్ష్యంగా చేసుకోవడం చివరికి ప్రజాస్వామ్య మూలాలను బలహీనపరుస్తుంది. విమర్శలు అవసరమే, కానీ అవి వాస్తవాలు, ఆధారాలు, రాజ్యాంగబద్ధ ప్రక్రియల ఆధారంగా ఉండాలి. అదే ప్రజాస్వామ్య పరిపక్వతకు సంకేతం. భారత్ నేడు ప్రపంచంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటి. రేపటి ప్రపంచ శక్తిగా నిలవాలంటే ఆర్థిక పురోగతితో పాటు ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసం కూడా అంతే బలంగా ఉండాలి. ఓటు హక్కు కేవలం పౌరుని అధికారం కాదు; దేశ భవిష్యత్తును నిర్దేశించే పవిత్ర బాధ్యత. ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం నిలకడగా ఉన్నప్పుడే ప్రజల తీర్పు గౌరవం పొందుతుంది, ప్రజాస్వామ్యం జీవం పోసుకుంటుంది. చివరకు ఎన్నికల్లో ఎవరు గెలిచారన్నది ఒక రాజకీయ సంఘటన మాత్రమే. కానీ ప్రజలు ఎన్నికల వ్యవస్థను ఎంత విశ్వసిస్తున్నారన్నదే దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్ణయించే అసలు ప్రమాణం. అందుకే ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడుకోవడం ఎన్నికల సంఘం బాధ్యత మాత్రమే కాదు; రాజకీయ పార్టీలు, మీడియా, పౌర సమాజం, ప్రతి ఓటరి ఉమ్మడి కర్తవ్యం. ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఓటు విలువను కాపాడటమే భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలంగా, మరింత ఆదర్శప్రాయంగా నిలబెట్టే మార్గం.

మహనీయుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష – ఘనంగా జి.వెంకటస్వామి జయంతి వేడుకలు



పెద్దపల్లి,అక్టోబర్ 05:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

మహనీయుల స్ఫూర్తిని మనమంతా ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన గడ్డం.వెంకట స్వామి జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,మారుమూల ప్రాంతంలో జన్మించినప్పటికీ జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగిన మహనీయులు గడ్డం.వెంకట స్వామి కేంద్ర మంత్రిగా,వివిధ పదవులు చేపట్టి, ప్రజలకు సేవ చేశారని, అటువంటి మహనీయులు మన ప్రాంతంలో జన్మించడం మనందరికీ గర్వ కారణమని అన్నారు.జి.వెంకట స్వామి అందించిన స్ఫూర్తితో మనందరం పని చేయాలని, విధులు నిర్వహించే సమయంలో అట్టడుగు వర్గాల వారికి మన వంతు సహకారం అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు. మన ప్రాంతంలోని పేదలకు వెంకటస్వామి అనేక సేవలు అందించారని, ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు.కేంద్ర,రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలలో కీలక పాత్ర పోషించి,పేదల అభ్యున్నతి కోసం,తెలంగాణ రాష్ట్రం కోసం నిరంతరం తపించి పని చేశారని, తెలంగాణ సమాజం పడే బాధలను అర్థం చేసుకున్నారని,ప్రజల కష్టాల నివారణకు కృషి చేశారని అన్నారు.కోల్ బెల్ట్ ఏరియాలో కార్మికుల గుండెల్లో చిరస్థాయి స్థానం పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్,సిపిఓ రవీందర్,ఇంటర్మీడియట్ అధికారిణి కల్పన,యువజన,క్రీడా శాఖ అధికారి సురేష్,కలెక్టరేట్ సిబ్బంది,జిల్లా అధికారులు,తదితరులు,పాల్గొన్నారు.

ఓటర్ల సందేహాలు నివృత్తి చేయాలి

ఎలక్టోరోల్ అబ్జర్వర్ బాల మాయ దేవి

బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పరిశీలన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్,అక్టోబర్ 05:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హెల్ప్‌డెస్క్‌ల ద్వారా అవసరమైన సమాచారం, సహకారం అందించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయ దేవి సూచించారు.సోమవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ హెల్ప్‌డెస్క్‌ను ఎన్నికల రోల్ అబ్జర్వర్ బాల మాయ దేవి,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్ప్‌డెస్క్‌లో ఓటర్లకు అందిస్తున్న సేవలు, స్వీకరిస్తున్న దరఖాస్తులు,నోటీసుల పరిశీలన,అవసరమైన పత్రాల వివరాలను వారు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎలక్టోరోల్ అబ్జర్వర్ బాల మాయ దేవి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. హెల్ప్‌డెస్క్‌ల వద్దకు వచ్చే ఓటర్లకు దరఖాస్తుల విధానం,అవసరమైన పత్రాలు,నోటీసులకు సంబంధించిన అంశాలపై స్పష్టమైన సమాచారం అందించాలని తెలిపారు.ఓటర్ల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

హెల్ప్‌డెస్క్‌ల వద్ద ప్రజలకు స్పష్టమైన సమాచారం

హెల్ప్‌డెస్క్‌ల వద్ద ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఫారం-6, ఫారం-7,ఫారం-8 దరఖాస్తుల స్వీకరణ,అవసరమైన పత్రాలు,దరఖాస్తుల స్థితిగతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. హెల్ప్‌డెస్క్‌కు వచ్చే ప్రతి ఓటరుకు సిబ్బంది సహకారం అందించి, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

దరఖాస్తుల పెండెన్సీని తగ్గించాలి

ఓటర్ల జాబితా నవరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం పూర్తి చేస్తూ,ఓటర్ల హక్కులకు ఎలాంటి



ఇబ్బంది కలగకుండా అధికారులు,బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా,నిబంధనలకు అనుగుణంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పరిశీలన,సంబంధిత పత్రాల స్వీకరణ,దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఫారం-6, ఫారం-7,ఫారం-8 ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిశీలించి పరిష్కరించాలని, ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు.నోటీసులు జారీ చేసిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,అవసరమైన పత్రాలను సేకరించి నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు.

బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పరిశీలన పూర్తి చేయాలి

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులపై బీఎల్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లను కార్యాలయాలకు పిలిపించకుండా సాధ్యమైనంత వరకు వారి ఇళ్ల వద్దనే వివరాలను పరిశీలించి, అవసరమైన పత్రాలను సేకరించాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న నోటీసుల పరిష్కారంపై ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీఓ బి.గంగయ్య, సుల్తానాబాద్ తహసీల్దార్ బషీరుద్దీన్, సంబంధిత ఎన్నికల అధికారులు, బీఎల్ఓలు,ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానసిక అనారోగ్యంతో ఉన్న తండ్రితో భూదాన పత్రమా?

– కుటుంబ సభ్యుల సంతకాలు లేకుండానే భూమి స్వాధీనం చేసుకున్నారంటూ యజమాని ఆరోపణ

– సీసీ రోడ్డు పనులపై ప్రశ్నించగా మున్సిపల్ చైర్మన్ దురుసుగా మాట్లాడారంటూ ఆవేదన

– బెదిరింపులు, అసభ్య పదజాలంతో భయభ్రాంతులకు గురిచేశారంటూ ఫిర్యాదు -విచారణకు డిమాండ్

వర్ధన్నపేట, అక్టోబర్ 5 (ప్రజాకలం ప్రతినిధి):

వర్ధన్నపేట పట్టణంలోని రామాలయం పరిసరాల్లో ఉన్న భూమిపై వివాదం ముదురుతోంది. తమ తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని భూ యజమాని గురిజాల ప్రశాంత్ ఆరోపించారు. ముఖ్యంగా తన తండ్రి మానసిక అనారోగ్యంతో ఉన్న సమయంలో ఆయనతో భూదాన పత్రం రాయించుకున్నారని, అందులో తన తల్లి, తనతో పాటు కుటుంబ సభ్యులెవరూ సంతకాలు చేయలేదని ప్రశాంత్ పేర్కొన్నారు.



కుటుంబ సభ్యుల అంగీకారం లేకుండానే ఎలా?

తమ కుటుంబానికి చెందిన భూమిని దానం చేయడం, విక్రయించడం లేదా ఇతర ప్రయోజనాలకు బదలాయించడం జరిగితే కుటుంబ సభ్యుల హక్కులు, అంగీకారం తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని ప్రశాంత్ తెలిపారు. అలాంటిది కుటుంబ సభ్యులెవరికీ సమాచారం ఇవ్వకుండా, తన తండ్రితో మాత్రమే భూదాన పత్రం రాయించుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. భూదాన పత్రం చట్టబద్ధత, ఆ సమయంలో తన తండ్రి పరిస్థితి, సంబంధిత పత్రాలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు.

తమ భూమిలో పనులు.. తమకే సమాచారం లేదా?

గత కొంతకాలంగా తాము మరో ప్రాంతంలో నివసిస్తున్న సమయంలో తమ భూమిని క్రీడా ప్రాంగణంగా మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయని ప్రశాంత్ ఆరోపించారు. విషయం తెలిసి తాను ప్రశ్నించడంతో అప్పట్లో పనులు నిలిపివేశారని తెలిపారు. తాజాగా అదే స్థలంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శాశ్వత సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సమాచారం అందడంతో తాను సంబంధిత మున్సిపల్ అధికారులను ప్రశ్నించినట్లు చెప్పారు.

ప్రశ్నించగానే దురుసు ప్రవర్తన?

ఈ విషయంపై మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణికి ఫోన్ చేసి సమాచారం అడిగానని ప్రశాంత్ తెలిపారు. అయితే చైర్మన్ తనతో దురుసుగా మాట్లాడారని, “నీవెవరు.. నీకెందుకు చెప్పాలి” అంటూ అసభ్య పదజాలంతో మాట్లాడటంతో పాటు పోలీసులతో కొట్టిస్తానని, జైలుకు పంపిస్తానని బెదిరించినట్లు ఆయన ఆరోపించారు. తాను ఎమ్మెల్యే, ఎంపీలను తిట్టినట్లు తన మాటలను వక్రీకరించారని పేర్కొన్నారు.

అధికారులు విచారణ జరపాలి

తమ స్వాధీన భూమిలో జరుగుతున్న నిర్మాణ పనులపై పూర్తి వివరాలు వెల్లడించాలని, భూదాన పత్రం ఎలా రూపొందింది? ఆ సమయంలో తన తండ్రి పరిస్థితి ఏమిటి? కుటుంబ సభ్యుల అంగీకారం ఎందుకు తీసుకోలేదు? అనే అంశాలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రశాంత్ డిమాండ్ చేశారు. తనను బెదిరించినట్లు ఆరోపిస్తున్న మున్సిపల్ చైర్మన్ వ్యవహారంపైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.తనతో జరిగిన ఫోన్ సంభాషణకు సంబంధించిన వీడియో/ఆడియో ఆధారాలను మీడియా దృష్టికి తీసుకువస్తున్నట్లు ప్రశాంత్ తెలిపారు. భూమి హక్కులు, పత్రాల చట్టబద్ధత, నిర్మాణ పనులకు అనుమతులు తదితర అంశాలపై అధికారికంగా విచారణ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన అన్నారు.

భూ యజమాని చేసిన ఆరోపణలపై మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి వివరణ వెల్లడించాల్సి ఉంది

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

-అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి,అక్టోబర్ 05:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని,ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్



లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామానికి చెందిన బండ్రి అజయ్ కుమార్ తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన గౌడ అశోక్ తన కుమార్తె గౌడ శ్రీవల్లికు 100శాతం వికలాంగత్వం ఉందని తనకు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన తంగెళ అనిత తాను బిఎస్సి నర్సింగ్ పూర్తి చేశానని తనకు జిల్లాలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టర్లో ఏదైనా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారిది సొసైటీ కి రాస్తూ ఔట్సోర్సింగ్ కింద అవకాశాలు వచ్చినప్పుడు పరిశీలించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.రామగిరి మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరి తన ఇంటికి సింగరేణి ప్రాజెక్టు వారు ప్రాజెక్టు నెంబర్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 9న ఉద్యోగ మేళా

- జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్

పెద్దపల్లి,అక్టోబర్ 05:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 9న ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ తెలిపారు.కేకే ఎంటర్ప్రైజెస్ లో 10 సోలార్ ఫిట్టింగ్ టెక్నీషియన్ మెకానికల్-ఎలక్ట్రికల్ అర్హత కలిగిన పురుషులు,వేతనం రూ.15వేలు, 30 సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఆఫీసర్స్ 10వ తరగతి, ఇంటర్,డిగ్రీ,ఎంబీఏ అర్హత కలిగిన పురుషులు, మహిళలు,వేతనం రూ.20 వేలు పోస్టులతో మొత్తం 40 ఖాళీలు ఉన్నాయని,



ఎంపికైన వారు పెద్దపల్లి ప్రాంతంలోనే పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అర్హత,ఆసక్తి ఉన్న అభ్యర్థులు అక్టోబర్ 9న ఉదయం 10 గంటలకు తమ రెజ్యూమ్,విద్యార్హతలు,ఆధార్ కార్డ్ జిరాక్స్,అనుభవ ధ్రువీకరణ పత్రాలతో పెద్దకల్వలలోని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తు,గది సంఖ్య 233లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలని,ఇతర వివరాలకు 8985336347, 8121252443 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరం

- ఎఫ్.ఆర్.ఓ టి. సతీష్ కుమార్

- కేజీబీవీలో ఘనంగా వన్యప్రాణి వారోత్సవాలు



పెద్దపల్లి,అక్టోబర్ 05:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) చెట్లను నరికివేయడం,అడవి జంతువులను అక్రమంగా వేటాడడం చట్టప్రకారం తీవ్రమైన నేరం.వన్యప్రాణుల వేటకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం అని పెద్దపల్లి అటవీ క్షేత్రాధికారి టి.సతీష్ కుమార్ హెచ్చరించారు.అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.పెద్దపల్లి జిల్లా రామగుండంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన,చిత్రలేఖనం, ప్రశ్నోత్తరి పోటీలు నిర్వహించి, అడవులు, జీవ వైవిధ్యం,పర్యావరణ సమతుల్యత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులందరితో వన్యప్రాణి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల్లో ప్రకృతి ప్రత్యక్ష పరిరక్షణపై బాధ్యతాయుతమైన భావనను పెంపొందించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,ఉపాధ్యాయులు, విద్యార్థినులతో పాటు అటవీ శాఖ ఉప క్షేత్రాధికారి జి.కొమురయ్య,విభాగాధికారి ఎస్.డి.రహమతుల్లా,బీట్ అధికారులు ఎస్.మేఘరాజ్,ప్రదీప్,శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ మద్రాస్‌లో గాయత్రి విద్యార్థినికి సీటు

పెద్దపల్లి,అక్టోబర్ 05:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పట్టణంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థిని కోలేటి కనిష్క ఐఐటీ మద్రాస్ నిర్వహించిన ప్రత్యేక ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి,బీఎస్సీ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ కోర్సులో సీటు సంపాదించింది. ఈ సందర్భంగా విద్యార్థిని కనిష్క మాట్లాడుతూ కళాశాల అధ్యాపక బృందం అందించిన ప్రత్యేక శ్రద్ధ,నాణ్యమైన బోధన,నిరంతర మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొంటూ అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపింది.అనంతరం కళాశాల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ విద్యార్థిని కనిష్కను ఘనంగా అభినందించారు.విద్యార్థిని విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి,తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ,కనిష్క భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.



వరికి ప్రత్యామ్నాయంగా పూల సాగు చేపట్టాలి

- జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్



పెద్దపల్లి,అక్టోబర్ 05:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు,రానున్న పండుగలు మరియు సుదీర్ఘ వివాహాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో అధిక లాభాలనిచ్చే పూల పంటలపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు.జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామంలో రైతు కుంట రాజిరెడ్డి సాగు చేస్తున్న రెండు ఎకరాల బంతి తోటను సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. దసరా,దీపావళి,సంక్రాంతి పండుగలతో పాటు మే-జూన్ వరకు పెళ్లిళ్ల సీజన్ కొనసాగనున్న నేపథ్యంలో బంతి,చామంతి,గులాబీ,మల్లె పూలకు మార్కెట్‌లో తీవ్ర డిమాండ్ ఉంటుందని, చిన్న,సన్నకారు రైతులు పూల సాగు ద్వారా విడతల వారీగా విక్రయాలు జరిపి నిరంతర ఆదాయం పొందవచ్చని వివరించారు.ఉద్యానశాఖ ద్వారా పూల సాగుకు ఎకరానికి రూ.8వేల రాయితీతో పాటు డ్రిప్ ఇరిగేషన్‌కు కూడా ప్రభుత్వ సబ్సిడీలు లభిస్తున్నాయని,ఆసక్తి గల రైతులు సమీప ఉద్యాన అధికారుల సలహాలతో శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి ఆర్థికంగా పరిపుష్టి చెందాలని కోరారు.

చెరుకు రైతుల సమస్యను పరిష్కరించాలి..

మల్లాపూర్, అక్టోబర్ 5 (ప్రజా కలం ప్రతినిధి)మల్లాపూర్ మండలం లోని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ ప్రాంత చెరుకు రైతులకు రావాల్సిన అదనపు రవాణా చార్జీలను చెల్లించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు, చెరుకు ప్రతినిధుల బృందం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు నేతృత్వంలో ప్రతినిధి బృందం మంత్రిని కలిసి గత ఏడాది ముత్యంపేట ప్రాంతం నుంచి కామారెడ్డి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు తరలించిన సమయంలో రైతులపై పడిన అదనపు రవాణా భారాన్ని వివరించారు . ఒక్కో టన్నుకు రూ. 350 చొప్పున అదనపు రవాణా ఛార్జీలు రైతులకు నష్టం కలిగించాయని, ఆ మొత్తాన్ని ఇప్పించాలని కోరారు.రైతుల సమస్యపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించి, త్వరలోనే అదనపు రవాణా ఛార్జీలను రైతులకు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, బద్దం సోమిరెడ్డి, ఇట్టెడి నారాయణరెడ్డి, సుంకట జీవన్‌రెడ్డి, ఖ్యాతం లింగారెడ్డి, ఎలేటి రాజారెడ్డి, పడాల గంగారెడ్డి, జాల రెడ్డి, ఎల్లేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రైతు రణభేరి వాయిదా..

మల్లాపూర్, అక్టోబర్ 5 (ప్రజా కలం ప్రతినిధి): మల్లాపూర్ మండలం లోని ముత్యంపేట్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఈ నెల 6న నిర్వహించాల్సిన బీజేపీ రైతు రణభేరి కార్యక్రమం వాయిదా పడింది.అనివార్య కారణాల వల్ల కార్యక్రమాన్ని ప్రస్తుతానికి రద్దు చేస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.రైతుల సమస్యలు, మూతపడిన షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభం తదితర అంశాలపై నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించిన నూతన తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రోగులను పరామర్శించిన సరిత తిరుపతయ్య

గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య



గద్వాల ప్రతినిధి, అక్టోబరు 5 (ప్రజా కలం):గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ధరూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ హరికృష్ణ తల్లి గోవిందమ్మ, గోవర్ధన్ (తండ్రి తాయ్యప్ప)తో పాటు మల్దకల్ మండలం పావనంపల్లి, సద్దలోనిపల్లి గ్రామాలకు చెందిన రోగులను పరామర్శించారు. రోగులకు మెరుగైన వైద్యం, అవసరమైన సేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆల్వాల రాజశేఖర్‌రెడ్డి, గోన్పాడు శ్రీనివాస్‌గౌడ్, గూడెందొడ్డి సర్పంచ్ నరసింహులు, పెద్దపాడు సర్పంచ్ దేవరాజు, ఉపసర్పంచ్ హరికృష్ణ, తోట రాముడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ లత్తిపురం వెంకట్రామిరెడ్డి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లి మీదుగా జగిత్యాల బస్సు నడపాలి

మల్లాపూర్, అక్టోబర్ 5 (ప్రజా కలం ప్రతినిధి):వేంపల్లి, వెంకట్రావుపేట్ మీదుగా జగిత్యాలకు బస్సు సర్వీసు నడపడంతో పాటు మెట్పల్లికి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని వెంకట్రావుపేట్ సర్పంచ్ కానుముల వెంకటేష్ కోరారు. సోమవారం మండల ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయంలో వినతివత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలైన వేంపల్లి, వెంకట్రావుపేట్ మీదుగా జగిత్యాలకు బస్సు సర్వీసు అందుబాటులోకి వస్తే విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రస్తుతం ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.మెట్పల్లి వైపు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులు నడపాలని కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ స్పందించి వెంటనే బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ వైద్యంపై 'పవిత్ర' నిఘా

-కూనారం..శ్రీరాంపూర్ పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



పెద్దపల్లి,అక్టోబర్ 05 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి): గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నాణ్యమైన,వేగవంతమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీవ్రతరం చేయాలని పెద్దపల్లి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ వై.పవిత్ర సిబ్బందిని ఆదేశించారు సోమవారం రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ అధికారిణి డాక్టర్ లక్ష్మీ భవానీతో కలిసి కూనారం,శ్రీరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవల తీరును సమగ్రంగా పరిశీలించిన డీఎంహెచ్‌ఓ,ఆసుపత్రుల్లోని చికిత్సా విభాగాలు, ఔషధ నిల్వ గదులను నిశితంగా తనిఖీ చేసి రోగులకు అవసరమైన ఔషధాలు నిరంతరం అందుబాటులో ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఆసుపత్రి ప్రాంగణాలు మరియు విభాగాల్లో ఫ్యూమిగేషన్ నిర్వహించాలని,ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల జ్వరాలు, వ్యాధులు ప్రబలే ముప్పు ఉన్నందున వైద్యారోగ్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఆసుపత్రులకు వచ్చే ప్రతి బాధితుడికి ఆలస్యం లేకుండా వెంటనే తగిన పరీక్షలు నిర్వహించి నివారణ వైద్యం అందించాలని సూచించారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వంటి తీవ్ర జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించిన ఆమె,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం,రికార్డులను ఎప్పటికప్పుడు సరిగ్గా నమోదు చేయడం, ఉద్యోగుల సమయపాలనను కచ్చితంగా పర్యవేక్షించడంతో పాటు పరిశుభ్రతను కాపాడుతూ రోగులకు అత్యుత్తమ వైద్య సంరక్షణ అందించడంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు

అపరిశుభ్రంగా ఐస్‌క్రీమ్ తయారీ

సాయి సవారియా ఐస్‌క్రీమ్ కేంద్రం లైసెన్స్ రద్దు - ఆహార భద్రతా అధికారి అరవింద్ రెడ్డి



పెద్దపల్లి,అక్టోబర్ 05:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి పట్టణ సమీపంలోని సుగ్లాంపల్లి నారాయణ్‌పూర్ చౌరస్తా వద్ద గల మెస్సర్స్ సాయి సవారియా ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రం'పై ఆహార భద్రతా అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు.స్థానికుల ఫిర్యాదుల మేరకు ఆహార భద్రతా అధికారి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలు, అత్యంత అపరిశుభ్ర వాతావరణం వెలుగుచూడటంతో సదరు తయారీ కేంద్రం ఎ ఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆహార భద్రతా అధికారి అరవింద్ రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో ప్రముఖ్య ప్రదేశంలో అనుమతి పత్రం ప్రదర్శించకపోవడం,మూతలు లేని పాలు-కోవా పాత్రలు,మసి పట్టిన పైకప్పులు,పగిలిన నేలలు,తెరిచి ఉన్న మురుగు కాలువలను గుర్తించినట్లు పేర్కొన్నారు.కీటకాలు రాకుండా జాలీలు లేకపోవడం,తుప్పు పట్టిన ఫ్రిజ్‌లు,గాలి- వెలుతురు లేని గదులతో పాటు ప్రయోగశాల నివేదికలు లేకుండానే ఉత్పత్తులపై 12 నెలల కాలపరిమితి అని ముద్రించిన ప్యాకేజింగ్ సామగ్రిని కనుగొన్నట్లు తెలిపారు.తయారీ సమయంలో ఒక సిబ్బంది పొగ తాగుతూ కనిపించడం,ఎవరూ మాస్కులు,గ్లౌజులు, హెడ్ క్యాప్‌లు ధరించకపోవడం,హెల్త్ కార్డులు లేకపోవడం తమ దృష్టికి వచ్చిందన్నారు.గడువు ముగిసిన 6 లీటర్ల పాలు,తయారీ తేదీలు లేని 5 లీటర్ల బాదం పాలు,మాడిపోయిన 3 కిలోల కోవాను స్వాధీనం చేసుకుని వెంటనే ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.ఆహార తయారీదారులు విధిగా పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రజారోగ్యంతో చెలగాటమాడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆహార భద్రతా అధికారి అరవింద్ రెడ్డి హెచ్చరించారు.

పెళ్లికి అంగీకరించేంత వరకు మౌనపోరాటం!

'మూడేళ్లుగా మోసం చేశారు.. న్యాయం చేయాలి'

బాధిత మహిళ ఆరోపణలు.. యువకుడి ఇంటి ఎదుట టెంట్ వేసి నిరసన

కుక్కలతో బెదిరించారని ఆరోపణ - చైర్మన్, కుమారుడు అందుబాటులో లేరని వెల్లడి

దళిత మహిళపై అఘాయిత్య ఆరోపణలపై మహిళా, దళిత సంఘాల ఆగ్రహం.



వర్ధన్నపేట, అక్టోబర్ 5 (ప్రజాకలం ప్రతినిధి):

వర్ధన్నపేట పట్టణంలో దళిత మహిళ చేసిన తీవ్ర ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. తనను ప్రేమిస్తున్నానని నమ్మించి, పెళ్లి చేసుకుంటానని చెప్పి, మూడేళ్లుగా లైంగికంగా వేధించి ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కుమారుడు శ్రీకాంత్‌పై ఓ మహిళ ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం శ్రీకాంత్ నివాసం ఎదుట కుటుంబ సభ్యులు, కుల పెద్దలతో కలిసి టెంట్ వేసి మౌనపోరాటానికి దిగింది.

బాధితురాలి కథనం ప్రకారం.. శ్రీకాంత్ తన సోదరి ద్వారా పరిచయమై, ప్రేమిస్తున్నానని నమ్మించాడని తెలిపింది. అనంతరం తనను అమ్మమ్మ ఇంటికి తీసుకెళ్లి, కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయానికి వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో తాను పూర్తిగా నమ్మినట్లు పేర్కొంది. ఆ తర్వాత పెళ్లి చేసుకుంటాననే నమ్మకంతో తనతో సన్నిహితంగా మెలిగాడని, ఈ క్రమంలో పలుమార్లు గర్భం దాల్చిన సందర్భాలు ఉన్నాయని ఆరోపించింది.

పెళ్లి మాట వచ్చేసరికి అసలు రూపం బయటపడిందా?

ఇటీవల మరోసారి గర్భం దాల్చిన అనంతరం తనను పెళ్లి చేసుకోవాలని శ్రీకాంత్‌ను నిలదీయగా నిరాకరించాడని బాధితురాలు ఆరోపించింది. దీంతో చేసేదేమీ లేక పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపింది. హన్మకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినట్లు వెల్లడించింది. ఎమ్మెల్యే జోక్యంతో పెళ్లి జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు బాధితురాలు చెబుతున్నప్పటికీ.. వారం రోజులు గడిచినా స్పష్టమైన పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో కుటుంబ సభ్యులు, కుల పెద్దలతో కలిసి శ్రీకాంత్ ఇంటికి వెళ్లినట్లు తెలిపింది.

కుక్కలతో బెదిరించారని ఆరోపణ

శ్రీకాంత్, ఆయన తండ్రి ఇంట్లో అందుబాటులో లేకపోవడంతో ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా శ్రీకాంత్ తల్లి తనను బెదిరించడమే కాకుండా ఇంట్లో పెంచుతున్న కుక్కలను తనపైకి పంపినట్లు బాధితురాలు ఆరోపించింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన ఆమె.. తనకు న్యాయం జరిగే వరకు ఇంటి ఎదుటే నిరసన కొనసాగిస్తానని ప్రకటించింది. 'శ్రీకాంత్ నన్ను పెళ్లి చేసుకోవాలి.. నాకు న్యాయం జరగాలి' అంటూ మీడియా ఎదుట బాధితురాలు కన్నీటి పర్యంతమైంది.

'దళిత మహిళలపై దాడులు ఇక సహించం'.. బాధిత మహిళకు మహిళా సంఘాలు, దళిత, బహుజన సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. దళిత మహిళలపై లైంగిక వేధింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని స్పష్టం చేశాయి.

మున్సిపల్ చైర్మన్ వంటి ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందిన వ్యక్తిపై ఇలాంటి తీవ్ర ఆరోపణలు రావడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారిందని సంఘాల నాయకులు పేర్కొన్నారు. పదవిలో ఉన్న ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాల్సిందే!

ఈ వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు తక్షణమే స్పందించి, బాధితురాలికి న్యాయం జరిగేలా పోలీసు అధికారులతో మాట్లాడాలని మహిళా, దళిత సంఘాలు కోరుతున్నాయి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూడాలని, రాజకీయ సంబంధాలకు అతీతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశాయి.అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి కూడా తన వాదనను వెల్లడించే అవకాశం ఇవ్వాలని, పోలీసులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు కోరారు.

ఉద్యమ కార్యాచరణకు సిద్ధం

బాధితురాలికి న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మహిళా, దళిత, బహుజన సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. తొలుత అధికారులకు వినతిపత్రాలు సమర్పించడం, అనంతరం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అవసరమైతే జిల్లా స్థాయిలో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు.

'బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు' అని సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

దళిత మహిళకు న్యాయం ఎప్పుడు?

అధికారుల నిర్లక్ష్యం కారణంగా బాధితులు న్యాయం కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఒక మహిళ తనపై జరిగిన అన్యాయంపై బహిరంగంగా పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే.. ఇక సాధారణ మహిళల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నాయి. ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు.. బాధితురాలికి రక్షణ.. నిజాలు నిగ్గుతేల్చి బాధ్యులపై చట్టపరమైన చర్యలు.. ఇదే ప్రస్తుతానికి ప్రజల డిమాండ్

యువత అన్ని రంగాల్లో సత్తా చాటాలి

-ప్రభుత్వ విప్ విజయరమణారావు



పెద్దపల్లి,అక్టోబర్ 05:(ప్రజాకాలం జిల్లాప్రతినిధి): సవాళ్లను అధిగమిస్తూ,అందివచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ యువత అన్ని రంగాల్లోనూ ముందంజలో నిలవాలని ప్రభుత్వ విప్ విజయరమణారావు పిలుపునిచ్చారు. సోమవారం పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆద్య టాక్స్ సొల్యూషన్స్ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా విప్ విజయరమణారావు మాట్లాడుతూ నవభారత నిర్మాణంలో యువశక్తి పాత్ర అత్యంత కీలకమని,కష్టపడే తత్వంతో ప్రతిఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా,స్వయం శక్తితో ఎదిగి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవడం అభినందనీయమని పేర్కొంటూ నూతన కార్యాలయ నిర్వాహకులకు,సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, వేముల రాంమూర్తి,కౌన్సిలర్ పూదరి అనూష మహేందర్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గ్రామాల్లో కొత్త నాయకత్వం..



మల్లాపూర్, అక్టోబర్ 5 (ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండలంలోని వాల్గొండ, పాత దామరాజ్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖలకు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్ల సోమయ్య ఆధ్వర్యంలో ఈ నియామకాలు జరిగాయి.వాల్గొండ గ్రామ శాఖ అధ్యక్షుడిగా లంబాడిపెల్లి రాజేందర్, ఉపాధ్యక్షుడిగా కటికల గంగాధర్‌ను నియమించారు. పాత దామరాజ్‌పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా గడ్డం రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆరెల్లి ఎల్లా గౌడ్‌ను నియమించారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారికి పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లాల జలపతి రెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, ఎం.డి. జమాల్, రొండ్ల రాజారెడ్డి, కిరణ్, కోటగిరి ఆనంద్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ.. దొంగ బైక్ వదిలి పరార్!

రెండు తులాల బంగారం.. రూ.90 వేల నగదు అపహరణ



గద్వాల ప్రతినిధి । అక్టోబర్ 5 । ప్రజా కలం

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం పెద్దచింతరేవుల గ్రామంలో పట్టపగలే చోరీ ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన తంబళి నాగరాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదును అపహరించినట్లు సమాచారం. ఇంట్లోకి ప్రవేశించిన దొంగ సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 90 వేల నగదును అపహరించినట్లు తెలుస్తోంది. చోరీ జరుగుతున్న సమయంలో స్థానికులు అక్కడికి రావడాన్ని గమనించిన దొంగ భయంతో అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. పారిపోయే క్రమంలో దొంగ తన వెంట తీసుకొచ్చిన బైక్‌ను ఇంటి సమీపంలోనే వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది. ఘటనపై స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇంటి పరిసరాలను పరిశీలించిన పోలీసులు చోరీకి సంబంధించిన ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు. దొంగ వదిలి వెళ్లిన బైక్ ఆధారంగా నిందితుడిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపికలు

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా

గద్వాల ప్రతినిధి । అక్టోబర్ 5 । ప్రజా కలం

జోగులాంబ గద్వాల జిల్లాలో జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ ఉద్యోగులు, క్రీడాకారులకు రాష్ట్ర స్థాయి ఎంపికల్లో పాల్గొనే అవకాశం లభించనుంది. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్టును ఎంపిక చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించనున్నారు.జిల్లా స్థాయి ఎంపికల్లో అర్హత సాధించిన ప్రభుత్వ ఉద్యోగులు, క్రీడాకారులకు అక్టోబర్ 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియం, జింఖానా గ్రౌండ్స్‌లో రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రామలింగేశ్వర్ గౌడ్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు తమ క్రీడా విభాగానికి కేటాయించిన తేదీ, సమయం, వేదికకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. రాష్ట్ర స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన వారు తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికై, ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగుల్లోని క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలో రోబోటిక్ టెక్నాలజీతో కొత్త ముందడుగు

సర్జన్ నైపుణ్యానికి ఆధునిక రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స

హనుమకొండ అక్టోబర్ 5 ప్రజా కలం ప్రతినిధి

వరంగల్ యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్, సోమాజిగూడకు చెందిన ప్రముఖ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స,ఆర్థ్రోస్కోపీ,ట్రామా నిపుణులు డా.అభిషేక్ బర్లీ మాట్లాడుతూ..రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో 15 సంవత్సరాలకు పైగా అనుభవంతో మార్పిడి చేస్తున్నామని అన్నారు.హైదరాబాద్ తో పాటు మోకాళ్ల నొప్పి ఇక వృద్ధాప్యానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదు.తీవ్రమైన మోకాలి ఆర్థరైటిస్ కారణంగా అనేక మంది నడవడం,మెట్లు ఎక్కడం,వని చేయడం,వ్యాయామం చేయడం వంటి రోజువారీ కార్యకలాపాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో వైద్య సాంకేతికతలో వచ్చిన ఆధునిక పురోగతులు మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విధానాన్ని కూడా మారుస్తున్నాయనీ రోబోటిక్ అసిస్టెడ్ టోటల్ నీ రీప్లేస్‌మెంట్ ఆధునిక జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తోంది.సర్జన్ యొక్క అనుభవం, క్లినికల్ జడ్జ్‌మెంట్‌తో పాటు కంప్యూటర్ ఆధారిత ప్లానింగ్ మరియు రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా ప్రతి రోగి మోకాలికి అనుగుణంగా శస్త్రచికిత్సను మరింత వ్యక్తిగతీకరించవచ్చు.సాధారణ పద్ధతుల్లో ఉపయోగించే ప్రామాణిక కొలతలతో పోలిస్తే,రోబోటిక్ టెక్నాలజీ ద్వారా రోగి యొక్క వ్యక్తిగత మోకాలి నిర్మాణాన్ని ఆధారంగా చేసుకుని ప్రత్యేకమైన సర్జికల్ ప్లాన్‌ను రూపొందించవచ్చు. శస్త్రచికిత్స సమయంలో రోబోటిక్ వ్యవస్థ రియల్‌టైమ్ గైడెన్స్ అందిస్తూ, ఎముకల కటింగ్, మోకాలి అలైన్‌మెంట్ మరియు లిగమెంట్ బ్యాలెన్స్ వంటి అంశాల్లో సర్జన్‌కు మరింత ఖచ్చితత్వంతో వనిచేయడానికి సహాయపడుతుంది.

రోబోట్ సర్జన్‌ను భర్తీ చేయదు

రోబోటిక్ మోకాలి మార్పిడి గురించి రోగులు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే–రోబోట్ స్వతంత్రంగా ఆపరేషన్ చేయదు.

శస్త్రచికిత్స మొత్తం సర్జన్ నియంత్రణలోనే ఉంటుంది. రోబోటిక్ వ్యవస్థ ఒక ఆధునిక శస్త్రచికిత్స సాధనంగా పనిచేస్తూ, సర్జన్‌కు మరింత ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తుంది మరియు ఆపరేషన్ సమయంలో అవసరమైన సున్నితమైన మార్పులు చేసుకునేఅవకాశం కల్పిస్తుంది.“రోబోటిక్ టెక్నాలజీ సర్జన్‌ను భర్తీ చేయడానికి కాదు; సర్జన్‌కు మరింత మెరుగైన సమాచారం, ఖచ్చితత్వం అందించడానికి ఉపయోగపడుతుంది.ప్రతి రోగి మోకాలు భిన్నంగా ఉంటుంది. అందువల్ల ప్రతి మోకాలిని ఒకే విధంగా కాకుండా,వ్యక్తిగత రోగి శరీర నిర్మాణానికి అనుగుణంగా శస్త్రచికిత్సను ప్లాన్ చేసుకోవడానికిఈ టెక్నాలజీ సహాయపడుతుంది.”

ఒకే విధానం నుంచి వ్యక్తిగతీకరించిన మోకాలి మార్పిడి వరకు

రోబోటిక్ అసిస్టెడ్ TKRలో రోగి యొక్క వ్యక్తిగత శరీర నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుని శస్త్రచికిత్సను ప్లాన్ చేయవచ్చు. మోకాలి అలైన్‌మెంట్, లిగమెంట్ బ్యాలెన్స్ వంటి అంశాలను అంచనా వేయడంతో పాటు,శస్త్రచికిత్స సమయంలో అవసరమైన సూక్ష్మ మార్పులు చేయడానికి సర్జన్‌కు ఇది సహాయపడుతుంది.

సంభావ్య ప్రయోజనాలు:

రోగి శరీర నిర్మాణానికి అనుగుణంగా వ్యక్తిగతీకరించిన సర్జికల్ ప్లానింగ్
ఎముకల కటింగ్ మరియు ఇంప్లాంట్ పొజిషనింగ్‌లో అధిక ఖచ్చితత్వం
మోకాలి అలైన్‌మెంట్ మరియు సాఫ్ట్ టిష్యూ బ్యాలెన్స్‌ను రియల్‌టైమ్‌లో అంచనా వేసే అవకాశం
శస్త్రచికిత్స సమయంలో అవసరమైన సూక్ష్మ మార్పులు చేసుకునే అవకాశం
సరైన రోగులను ఎంపిక చేసిన సందర్భాల్లో ప్రారంభ దశలో మెరుగైన ఫంక్షనల్ రికవరీకి అవకాశం

అయితే, రోబోటిక్ సర్జరీ ప్రతి రోగిలోనూ మెరుగైన ఫలితానికి హామీ



కాదు. సరైన రోగి ఎంపిక, సర్జన్ అనుభవం, సరైన ఇంప్లాంట్ ఎంపిక, శస్త్రచికిత్స అనంతర ఫిజియోథెరపీ మరియు రోగి యొక్క మొత్తం ఆరోగ్యం కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

అసలు లక్ష్యం: రోగిని తిరిగి చురుకైన జీవితంలోకి తీసుకురావడం

రోబోటిక్ మోకాలి మార్పిడి వెనుక ఉన్న అసలు లక్ష్యం కేవలం ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం కాదు. రోగి నొప్పిని తగ్గించి, మళ్లీ స్వతంత్రంగా నడవడానికి మరియు రోజువారీ జీవితాన్ని సౌకర్యవంతంగా కొనసాగించడానికి సహాయపడటమే అసలు లక్ష్యం. వృద్ధ రోగికి ఇది స్వతంత్రంగా నడవడం కావచ్చు. ఉద్యోగం చేసే వ్యక్తికి తిరిగి పనిలో చేరడం కావచ్చు. చురుకైన జీవనశైలి ఉన్న వ్యక్తికి వ్యాయామం మరియు తనకు ఇష్టమైన కార్యకలాపాలకు తిరిగి వెళ్లడం కావచ్చు. స్థిరమైన, సమతుల్యమైన, మెరుగ్గా పనిచేసే మోకాలిని అందించడం–అదే ఆధునిక మోకాలి మార్పిడి శస్త్రచికిత్స యొక్క ప్రధాన లక్ష్యం. రోబోటిక్ టెక్నాలజీ జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో ఒక ముఖ్యమైన సాంకేతిక పురోగతి అయినప్పటికీ, విజయవంతమైన మోకాలి మార్పిడి శస్త్రచికిత్సకు సర్జన్ యొక్క అనుభవం మరియు క్లినికల్ నిర్ణయ సామర్థ్యం ఇప్పటికీ అత్యంత కీలకం.
ప్రతి రోగిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే మోకాలి మార్పిడి అవసరమా, రోబోటిక్ విధానం అనుకూలమా అనే విషయాన్ని నిర్ణయించాలి.
రోగి యొక్క పూర్తి చికిత్సా ప్రయాణం–సరైన నిర్ధారణ,శస్త్రచికిత్స ప్రణాళిక,ఇన్ఫెక్షన్ నివారణ,నొప్పి నియంత్రణ,ఫిజియోథెరపీ మరియు రిహాబిలిటేషన్–రికవరీలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో కొత్త అధ్యాయం

టెక్నాలజీ మరింత అభివృద్ధి చెందుతున్న కొద్దీ, రోబోటిక్ అసిస్టెడ్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స వ్యక్తిగతీకరించిన ఆర్థోపెడిక్ చికిత్సకు కొత్త అవకాశాలను అందిస్తోందనీ,ఆధునిక టెక్నాలజీ, అనుభవజ్ఞులైన సర్జన్లు మరియు రోగి–కేంద్రిత చికిత్స కలయిక ఆధునిక మోకాలి మార్పిడి శస్త్రచికిత్సకు కొత్త దిశను చూపిస్తోందనీ రోబోట్ ఖచ్చితత్వాన్ని అందించవచ్చు–కానీ శస్త్రచికిత్సకు తుది నిర్ణయం తీసుకునేది, రోగి అవసరాలను అర్థం చేసుకుని చికిత్సను నడిపించేది సర్జన్ యొక్క అనుభవం,క్లినికల్ వరంగల్ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో, ఇకపై ప్రతి నెల మొదటి ఆదివారం డా. అభిషేక్ బర్లీ అందుబాటులో ఉంటారని తెలిపారు.కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న రోగులు తదుపరి కన్సల్టేషన్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వరంగల్‌లోనే నిపుణుల వైద్య సలహాలు మరియు ఫాలో–అప్ సేవలు పొందవచ్చని డా. అభిషేక్ బర్లీ తెలిపారు.వరంగల్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డా.అభిషేక్ బర్లీతో పాటు అసిస్టెంట్ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

దళిత యువతిపై అఘాయిత్యం.. ఖండించిన పసునూరి మురళి

-ఇంకెన్నాళ్లు ఈ దాడులు..? దళిత మహిళలకు రక్షణ ఏదీ?
-బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు
-దళిత-బహుజన, మహిళా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలి
-ఎంజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి

అక్టోబర్ 5 ప్రజాకలం ప్రతినిధి:

వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఓ దళిత యువతిపై మానభంగం జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న,అఘాయిత్యాన్ని ఎంజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి తీవ్రంగా ఖండించారు. పెళ్లిచేసుకుంటానని నమ్మించి మోసం చేయడం, శారీరకంగా వాడుకుని గర్భం దాల్చిన అనంతరం అబార్షన్ చేయించారనే ఆరోపణలు అత్యంత ఆందోళనకరమని అన్నారు. మరోమారు అబార్షన్ అయిన తరువాత బాధితురాలు పెళ్లి చేసుకోవాలని కోరిన సమయంలో బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువత్తగా వాటిపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు.



అధికారం ఉందని దౌర్జన్యమా?

బాధితురాలి ఆరోపణల నేపథ్యంలో సంబంధిత మున్సిపల్ చైర్మన్ సారంగపాణి కొడుకు శ్రీకాంత్ అనే వ్యక్తికి రాజకీయ, అధికార పలుకుబడి ఉందనే ప్రచారం జరుగుతోందని మురళి అన్నారు. బాధితురాలు ప్రజాప్రతినిధులను ఆశ్రయించినప్పటికీ తగిన స్పందన లభించలేదనే ఆరోపణలు వస్తున్నాయని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.రాజకీయ సంబంధాలు, పదవులు, పలుకుబడి ఏవైనా చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. బాధితురాలి ఫిర్యాదును పూర్తిస్థాయిలో పరిశీలించి, ఆమెకు న్యాయం జరిగేలా పోలీసు, రెవెన్యూ, మహిళా సంక్షేమ శాఖ అధికారులు దళిత, ప్రతి మహిళా సంక్షేమ సంఘాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మరెప్పుడో దళిత మహిళలపై దాడులు ఆగేది ?

దళిత మహిళలపై వేధింపులు, దాడులు, వివక్షకు సంబంధించిన ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నా బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం అందకపోవడం ఆందోళన కలిగిస్తోందని మురళి అన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ వాటి అమలులో ఎలాంటి లోపాలు ఉండకూడదని, బాధితులు భయపడకుండా ఫిర్యాదు చేసే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు.

బాధితురాలికి అండగా నిలవాలి

బాధితురాలిపై సామాజిక ఒత్తిడి తీసుకురావడం, రాజీ పేరుతో కేసును నీరుగార్చడం వంటి చర్యలకు ఎవరూ పాల్పడకూడదని అన్నారు. దళిత–బహుజన సంఘాలు, మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు, అఖిలపక్ష నాయకులు బాధితురాలికి అండగా నిలిచి న్యాయం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. “బాధితురాలికి న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. దళిత మహిళలపై మరోసారి ఇలాంటి దుశ్చర్యకు పాల్పడాలంటే భయపడే విధంగా చట్టపరమైన చర్యలు ఉండాలి. రాజకీయ పలుకుబడి ఉన్నా, పదవిలో ఉన్నా చట్టానికి ఎవరూ అతీతులు కారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలి” అని పసునూరి మురళి డిమాండ్ చేశారు. దళిత మహిళల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఆయన కోరారు.

దివ్యాంగుల పింఛన్లకు పకడ్బందీ ధ్రువీకరణ!

- అదనపు కలెక్టర్ బి. నర్సింగరావు

గద్వాల ప్రతినిధి । అక్టోబర్ 5 । ప్రజా కలం

గద్వాల మండలం కొండపల్లి గ్రామంలో సర్పంచ్ ఎం. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి జిల్లా స్థాయి ధ్రువీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ బి. నర్సింగరావు వరిశీలించి, ధ్రువీకరణ ప్రక్రియను సమీక్షించారు. ఈ నందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా ధ్రువీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పింఛన్లకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎం. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా ధ్రువీకరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడానికి అధికారులకు సహకరిస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కే. నారాయణ, ఎంపీడీవో డాక్టర్ శైలజ, సీనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాశ్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ విజయభాస్కర్ రెడ్డి, గ్రామ పెద్దలు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చివరి ఆయకట్టు వరకు సాగునీరు! : ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల ప్రతినిధి । అక్టోబర్ 5 । ప్రజా కలం

రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. నవంబర్ చివరి వరకు వారబందీ పద్ధతిలో సాగునీటిని అందించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నీటిపారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. సాగునీటి సరఫరాతో పాటు రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, ఆయకట్టు పరిస్థితి, రైతుల అవసరాలపై అధికారులతో చర్చించారు. విద్యుత్, పోలీసు శాఖల అధికారులతోనూ సమన్వయంపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలు ఎండిపోకుండా రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా, పొదుపుగా వినియోగిస్తూ ప్రతి ఆయకట్టుకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

వారబందీ విధానాన్ని క్రమశిక్షణతో అమలు చేయాలని, నీరు వృథా కాకుండా అవసరమైన మేరకు మాత్రమే సాగునీటిని విడుదల చేయాలని ఆదేశించారు. నీటి వినియోగంపై రైతులకు ముందస్తుగా సమాచారం అందిస్తూ, వారితో నిరంతరం సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

రైతులు కూడా అధికారులకు సహకరించి అందుబాటులో ఉన్న నీటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రైతులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంతో పాటు పంటలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.రైతులు పండించిన పంటలకు నష్టం వాటిల్లకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కూడా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రిజర్వాయర్లలోని నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ గద్వాల పట్టణ ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, గద్వాల టౌన్ సీఐ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతుల విజ్ఞాన యాత్రకు శ్రీకారం!

- రైతులకు ఉపయోగకరంగా విజ్ఞాన యాత్రలు: కలెక్టర్



గద్వాల ప్రతినిధి । అక్టోబర్ 5 । ప్రజా కలం

జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన 100 మంది ఉద్యాన రైతులు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగు విధానాలను పరిశీలించేందుకు చేపట్టిన విజ్ఞాన యాత్రను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఈ పర్యటన కొనసాగనుంది. ఐడీఓసీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ రైతులతో కూడిన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని బారామతిలో ఉన్న జాతీయ పరిశోధనా కేంద్రంతో పాటు మహాబలేశ్వర్ తదితర ప్రాంతాల్లో రైతులు పర్యటించి, అక్కడి ఉద్యాన తోటలు, పంటల సాగు విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల్లో అమలు చేస్తున్న ఆధునిక ఉద్యాన పంటల సాగు విధానాలను రైతులు ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా ఎంతో ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. ఇలాంటి విజ్ఞాన యాత్రలు రైతులకు కొత్త సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రైతుల పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్‌కుమార్, రాజశేఖర్, మహేష్, ఇమ్రాన్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పాదయాత్ర

- ఓటు చోరీ’ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ భారీ ర్యాలీ
- అయినవోలు మండలం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

హనుమకొండ, అక్టోబర్ 5:-(ప్రజాకలం ప్రతినిధి) ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలో భారీ పాదయాత్ర, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కలిసి అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. ‘ఓటు చోరీ’ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ, ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని నాయకులు పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డిఆదేశాల మేరకు అయినవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాదయాత్రలో పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఈ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని నాయకులు తెలిపారు.



వారసత్వ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ పై ప్రజావాణిలో ఫిర్యాదు

(వరంగల్/పర్వతగిరి)అక్టోబర్ 05, ప్రజాకలం ప్రతినిధి: తమ వారసత్వ భూమిని అక్రమంగా, తప్పుడు పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకుని బ్యాంకులో రూ.40 లక్షల రుణం (లోన్) పొందిన వ్యక్తులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పర్వతగిరి మండలానికి చెందిన ఇజ్జిగిరి గణేష్, బాధితులు అధికారులను కోరారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తమకు సంప్రదాయబద్ధంగా వస్తున్న వారసత్వ భూమి సర్వే నెంబర్లు 691/బిలో ఒక ఎకరం, 688 లో 10 గుంటలు, 689 లో 29 గుంటలు,575 లో ఒక ఎకరం, 576/బిలో 6 గుంటలు, 591లో 18 గుంటలు మరియు 593 లో 12 గుంటల భూమి పహానీలో ఉంది. ఈ భూమి తమ పూర్వీకుల నుంచి తమ ఆధీనంలోనే ఉంటూ,ప్రస్తుతం తామే సాగు చేసుకుంటున్నామని బాధితుడు తెలిపారు. తమ కుటుంబ వారసులకు తెలియకుండా తమ భూమిని అక్రమంగా తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించి, మార్టిగేజ్ ద్వారా బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి 2016వ సంవత్సరంలో పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి మంజుల, గొల్లపల్లి రమేష్ అనే వ్యక్తులు రూ. 40 లక్షల లోన్ తీసుకున్నారని ఆరోపించారు. రుణం చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు సదరు భూమిని వేలం/అటాచ్ చేస్తామని 2020లో నోటీసులు ఇవ్వడానికి వచ్చినప్పుడే ఈ అక్రమం వెలుగులోకి వచ్చిందని ఆయన తెలిపారు. తప్పుడు మార్గంలో చేయించుకున్న ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దు చేసేలా సిఫారసు చేయాలని, ఘటనపై సమగ్ర పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు ఇజ్జగిరి గణేష్ గొల్లపెల్లి కనుకయ్య, బైరి వెంకటస్వామి,రాచకోండ అల్లోరు, ముక్కేర భోజరాజు లు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో తమకు న్యాయం జరపాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను వేడుకున్నారు. అధికారులు ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించి తగు విచారణ జరిపి బాధితులకు న్యాయం చేకూర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్లు భవిష్యత్తులో జరగకుండా నివారించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కూడా వారు డిమాండ్ చేశారు.



ఝరి(బి)లో ప్రమాదకర విద్యుత్ స్తంభాలను మార్చాలని ప్రజావాణిలో వినతి

తానూర్,అక్టోబర్ 5 (ప్రజా కలం): తానూర్ మండలంలోని ఝరి(బి) గ్రామంలో



శిథిలావస్థకు చేరిన పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతూ మండల ప్రజా పరిషత్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు దొంతుల రమేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అమీరుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు, చాలా ఏళ్లుగా ఉన్న ఈ స్తంభాలు కూలిపోయే ప్రమాదంలో ఉండటంతో గ్రామస్థులు, పిల్లలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని ఆయన తెలిపారు,ఏవైనా ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి, నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు,ప్రజావాణిలో నాలుగు ఆర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- ప్రజావాణికి 100 పిర్యాదుల స్వీకరణ



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 05: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 100 వినతులను అధికారులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి. ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.23.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పుష్కరాల పనులు, రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు శ్రీకారం
రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు



నిర్మల్ అక్టోబర్ 05 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు సోమవారం శంకుస్థాపనలు చేశారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి దాదాపు రూ. 23. 35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించి శంకుస్థాపనలు చేశారు.

వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన రహదారుల నిర్మాణ పనులతో పాటు రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలకు సంబంధించిన నిర్మాణ పనులకు మంత్రులు శ్రీకారం చుట్టారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందించేందుకు చేపడుతున్న ఈ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

జిల్లా పర్యటనకు సోమవారం ఉదయం నిర్మల్ చేరుకున్న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ఉన్నతాధికారులు డి.ఎస్. లోకేష్‌కుమార్, రాజీవ్‌గాంధీ హనుమంతు, వి.పి. గౌతమ్‌లకు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులు ఘన స్వాగతం పలికారు.

మంత్రులు, ఉన్నతాధికారులకు కలెక్టర్ భవేశ్ మిశ్రా పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అక్కడి నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, రాజర్షి షా, హరిత,

నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, ఆర్ ఎస్ చిత్రు, చంద్రయ్య, రాములు, డేవిడ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్,

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఉట్నూర్ ఐ టి డి ఎ పి ఓ మంద మకరందు, సబ్ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట

- ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- పశువుల శాంపిల్స్ సేకరణ, రవాణా ప్రత్యేక వాహనం ప్రారంభం
- వేగవంతమైన ల్యాబ్ పరీక్షలతో సకాలంలో వ్యాధి నిర్ధారణే లక్ష్యం: కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్
ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 05:

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలైన పాడి రైతులకు అండగా ఉంటూ, మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డ పేర్కొన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల వ్యాధి నిర్ధారణ, శాంపిల్స్ సేకరణ మరియు సురక్షిత రవాణా కోసం ప్రత్యేకంగా రూపొందించిన అత్యాధునిక వాహనాన్ని జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆయన లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సత్వర సేవలే ధ్యేయం గ్రామాల్లో పశువులకు అకస్మాత్తుగా లేదా వింత వ్యాధులు సోకినప్పుడు నిర్ధారణ ఆలస్యమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి సమస్యలకు తక్షణ పరిష్కారంగా ఈ ప్రత్యేక వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి పశువుల నుంచి రక్త, మూత్ర, ఇతర నమూనాలను శాస్త్రీయంగా సేకరించి, ఏమాత్రం పాడవకుండా ల్యాబ్‌కు చేర్చడం ద్వారా సకాలంలో వ్యాధిని గుర్తించి ప్రాణాపాయాన్ని నివారించవచ్చని తెలిపారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి రైతు కూడా ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తాలి మాట్లాడుతూ, సేకరించిన శాంపిల్స్‌ను ప్రయోగశాలలో వేగవంతంగా పరీక్షించి, ఫలితాలను వెంటనే సంబంధిత పశువైద్యులకు చేరవేసేలా సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. దీనివల్ల పశువులకు సరైన సమయంలో సరైన చికిత్స అందుతుందని, అంటువ్యాధులు ఇతర ప్రాంతాలకు ప్రబలకుండా కట్టడి చేయవచ్చని చెప్పారు. రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సిజే బెనహర్, జిల్లా గొర్రెల కాపరులు సహకార సంఘం అధ్యక్షులు శాంతన్న యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మైత్రి యాదయ్య, ఫయాజ్, పశు సంవర్ధక శాఖ ఉన్నతాధికారులు, వైద్యులు, ల్యాబ్ నిపుణులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఎలాంటి నివేదికలు పెండింగ్‌లో ఉండకూడదు

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 05: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల కింద అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనుల పురోగతి పై సమీక్షించేందుకు మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డి. కె అరుణ అధ్యక్షతన నేడు (అక్టోబర్ 6) జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో దిశ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. సోమవారం ప్రజావాణి అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల కింద అమలవుతున్న నంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతితో పాటు గత దిశ సమావేశంలో ఇచ్చిన సూచనలు, ఆదేశాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఉదయం 10.30 గంటలకు సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. గత దిశ సమావేశంలో శాఖల వారీగా ఇచ్చిన ఆదేశాలు, పెండింగ్ అంశాలు, వాటిపై తీసుకున్న చర్యలు, పనుల ప్రస్తుత స్థితి, పురోగతి, కొత్తగా మంజూరైన పనులు,



లబ్ధిదారుల వివరాలతో అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. గత సమావేశం మినిట్స్ ఆధారంగా ప్రతి శాఖకు సంబంధించిన అంశాలపై యాక్షన్ టేకన్ రిపోర్ట్ (ఏటీఆర్) సమర్పించాలని, ఎలాంటి నివేదికలు పెండింగ్‌లో ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. దిశ సమావేశానికి సంబంధించిన నోట్స్, ప్రెజెంటేషన్ల తయారీకి అవసరమైన పూర్తి వివరాలను అధికారులు ముందుగానే అందించాలని కలెక్టర్ సూచించారు. గత సమావేశంలో ఇచ్చిన సూచనలు, ఆదేశాల అమలుపై స్పష్టమైన వివరాలతో అధికారులు సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ, డి.ఆర్.ఓ ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి. ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పక్కనే చెరువున్నా ఎండిపోతున్న పొలాలు

ట్యాంకర్లతో నీళ్లు పోసి పంటను కాపాడుకుంటున్న తిమ్మాపూర్ రైతు భూమేష్ ఆవేదన

తానూర్, అక్టోబర్ 5(ప్రజా కలం): తీవ్రమైన ఎండలు, అడుగంటిన భూగర్భ జలాల కారణంగా నిర్మల్ జిల్లా భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామంలో దిగ్భ్రాంతికరమైన పరిస్థితి నెలకొంది. కంటిముందే చెరువు ఉన్నప్పటికీ, అధికారుల అనుమతులు రాక నీటి చుక్క అందక పంటలు ఎండిపోతున్నాయి.



ట్యాంకర్లతో వరి సాగు... తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతు భూమేష్ తన రెండెకరాల వరి పంటను బతికించుకోవడానికి కిలోమీటర్ల దూరం నుండి ట్రాక్టర్ ట్యాంకర్లతో నీటిని తరలిస్తూ రోజువారీ పోరాటం చేస్తున్నారు.

పెరుగుతున్న ఖర్చులు - తీరని ఆందోళన....

పంట కోసం అదనంగా రూ.వేలు ఖర్చు చేస్తున్నప్పటికీ, ఆఖరికి పంట చేతికి వస్తుందో లేదోనని భూమేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యం... పొలానికి సమీపంలోనే పెద్ద చెరువు ఉన్నా, కాలువ ద్వారా నీటిని విడుదల చేయడానికి ఇరిగేషన్ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని వాపోతున్నారు. వెంటనే స్పందించి చెరువు నుంచి నీటిని విడుదల చేసి, తిమ్మాపూర్ రైతాంగాన్ని, వారి పంటలను కాపాడాలని అధికారులు, ప్రభుత్వాన్ని కోరుతున్నారు..

వాలీబాల్ క్రీడాకారులకు న్యాయం చేయాలి

క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలి, యువతను ప్రోత్సహించాలి. రేపటి పౌరుల భవిష్యత్తుకే మా ఆరాటం - తల్లాడ వాలీబాల్ క్లబ్.



తల్లాడ ఆగస్టు 4 ప్రజా కలం న్యూస్ తల్లాడ మండల కేంద్రంలో రెవెన్యూ ఆఫీస్ ప్రక్కనగల వాలిబాల్ క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలని తల్లాడ వాలీబాల్ క్లబ్ నేతృత్వంలో నిరసనలు జరిగాయి. ఈ వాలీబాల్ క్రీడా ప్రాంగణం చరిత్ర ఇప్పటిది కాదని గత 40 సంవత్సరాల క్రితమే ఆ స్థలాన్ని వాలీబాల్ క్రీడా ప్రాంగణానికి కేటాయించారని ఆనాటి ఎస్పీ క్రాంతి రానా టాటా గారు ప్రారంభించి ఫౌండేషన్ స్టోన్ వేశారని.దాని ప్రక్కన ఉన్న స్థలాన్ని కూడా క్రీడ ప్రాంగణాలకి కేటాయించారని కానీ ఇప్పుడు ఆ ప్రదేశాన్ని ఐకెపి బిల్డింగు కు కేటాయించి అక్కడ పనులు చేపట్టారని తక్షణమే వాటిని నిలిపివేసి క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలని తద్వారా యువ క్రీడల్లో నైపుణ్యత పెరిగి అనేక ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రజలకు సేవ చేయిస్తారని,ఈ ప్రాంతంలో గతంలో రెండు మూడు సార్లు కూడా నేషనల్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్స్ జరిగాయని ఆ టోర్నమెంట్స్ కు నేషనల్ ఇండియన్ కెప్టెన్ వెంకటనారాయణ గారు కూడా హాజరయ్యారు.అలా ఎందరో మహానుభావులు ఆటలు ఆడి ప్రయోజకులైన చరిత్ర ఆ స్థలానికుందని అట్టి స్థలాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదులుకోవమని.ఇది మా స్వార్థం కోసం కాదని రేపటి పౌరుల భవిష్యత్తు కోసమేనని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

నియోజకవర్గ ఎమ్మెల్యే శంకర్ సహకారం

గ్రామ అభివృద్ధికి సోపానం - 7వ వార్డలో కాంతులు నింపిన వార్డు సభ్యుల సంఘం అధ్యక్షుడు శివగళ్ల సురేష్
గ్రామ సర్పంచ్ కొమ్ము కృష్ణ తో కలిసి పనులు ప్రారంభించిన శివగళ్ల సురేష్

(నందిగామ అక్టోబర్ 05 ప్రజా కలం):ప్రతినిధి

నందిగామ గ్రామపంచాయతీ పరిధిలోని 7వ వార్డులో ఏళ్లుగా కొనసాగుతున్న విద్యుత్ సమస్యకు పరిష్కారం కల్పిస్తూ సోమవారం సర్పంచ్ కొమ్ము కృష్ణ నేతృత్వంలో వార్డు సభ్యుడు శివగల్ల సురేష్ విద్యుత్ అధికారుల సమన్వయంతో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో వార్డులోని పలు ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం మెరుగుపడడంతో పాటు రాత్రివేళల్లో వెలుతురు సమస్యకు పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము కృష్ణ మాట్లాడుతూ.. అభివృద్ధి మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలన్నారు. గ్రామంలో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో వెలుతురు లేక ప్రజలు, ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించి విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల భద్రత, సౌకర్యమే ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం అవసరమైతే వ్యక్తిగత వనరులను సైతం వినియోగించేందుకు వెనుకాడబోమని కృష్ణ



స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న విద్యుత్ సమస్యకు నూతన స్తంభాల ఏర్పాటుతో శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల సహకారంతో నందిగామను మరింత అభివృద్ధి చెందిన గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అగ్గి ప్రసాద్,చించెట్టి లతాశివా కుమార్ గౌడ్,కలిమ్,ఎఎంసి డైరెక్టర్ చాకలి నర్సీమ్మ, ప్రవీణ్ రెడ్డి,మురళి,తదితరులు పాల్గన్నారు.

మహిళల భద్రతకు మేమున్నాం ఫ్యూచర్ సిటీ షీ టీం

సెండ్ బాయ్ సెస్ విద్యార్థుల పరిధిలో మహిళకు భద్రత పట్ల అవగాహన సదస్సు
ముఖ్య అతిథిగా సర్పంచ్ కొమ్ము కృష్ణ డిప్యూటీ సర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్



నందిగామ అక్టోబర్ 05 ప్రజా కలం ప్రతినిధి

నందిగామ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఫ్యూచర్ సిటీ షీ టీమ్ ఆధ్వర్యంలో 'మీ నమ్మకం మా భరోసా.. మీరు ఒంటరి వారు కాదు' అనే నినాదంతో యువతీ, యువకులకు షీ టీమ్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధర్మియా రాథోడ్ మాట్లాడుతూ.. ఆకతాయిల వేధింపులు, మహిళలపై అసభ్య ప్రవర్తన లేదా ఇతర వేధింపుల కారణంగా ఇబ్బందులు ఎదురైతే వెంటనే షీ టీమ్‌ను ఆశ్రయించాలని చెప్పారు.

నేరుగా పోలీసులను సంప్రదించలేని వారు అత్యవసర పరిస్థితుల్లో 112కు డయల్ చేసి సమాచారం అందించవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యంగా ఫిర్యాదు చేస్తే నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మహిళల భద్రత కోసం షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. యువకులు గంజాయి, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ సార వెంకటేష్ గౌడ్, యువసత్తా లక్ష్మణ్ కుమార్, షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుల్ గీత, వైద్యనాధం, వార్డు సభ్యులు బొమ్మగల్ల నర్సింహా, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా సాగాలి
- ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 05:

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రజల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి. స్పష్టం చేశారు. సోమవారం హన్వాడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, పరిష్కార దిశగా పనులను వేగవంతం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, సీసీ రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రతి పైసాను వృథా కాకుండా సద్వినియోగం చేయాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల ప్రగతిలో ప్రజా భాగస్వామ్యం కీలకమని అన్నారు. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని, ఆ తర్వాత కులమతాలు, పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, దేశంలోనే ఆదర్శవంతంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు జరుగుతోందని చెప్పారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందిస్తామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గంలోని ప్రతి పల్లెనూ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఎంపిడిఓ శ్రీమతి యశోద, తహసీల్దార్ కిష్ట్యానాయక్ వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మంత్రి నారాయణ ఆకస్మిక పర్యటన

విజయవాడ : మంత్రి నారాయణ విజయవాడ నగరంలో ఆకస్మికంగా పర్యటించారు. వర్షం కారణంగా నీరు నిలిచిపోయిన ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ, కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి నీటి తొలగింపు పనులను పర్యవేక్షించారు. నోవాటెల్ ఎదురుగా జాతీయ రహదారిపై ప్రతిసారి నీరు నిలిచిపోతుండడం పై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్రకు ఆదేశాలు ఇచ్చారు.

శ్రీసిటీలో ఘోర ప్రమాదం.. నలుగురు మృతి

తిరుపతి : తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో శనివారం భారీ పేలుడు సంభవించింది. టిల్ హెల్మోర్ పరిశ్రమలో బాయిలర్ ఒక్కసారిగా పేలడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పరిశ్రమలోని నిర్మాణాలు, ఇనుప సామగ్రి, పైపులు, ఇతర పరికరాలు దెబ్బతిన్నాయి. ఘటనాస్థలంలో భారీగా శిథిలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. శిథిలాల కింద పలువురు కార్మికులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మృతిచెందిన వారు, గాయపడిన వారి వివరాలు, వారి స్వస్థలాలు, క్షతగాత్రుల పరిస్థితిపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. అలాగే బాయిలర్ పేలుడుకు గల అసలు కారణం ఏమిటన్న దానిపై అధికారులు పరిశీలన చేస్తున్నారు.

అనుమానంతో ప్రియురాలిపై యువకుడి దాడి

భవనం పైనుంచి దూకి మృతి చెందిన ప్రియుడు

విజయవాడ : విజయవాడ న్యూ రాజరాజేశ్వరి పేటలో ప్రేమోన్మాది ఘాతుకం సష్టించారు. ప్రియురాలి మెడను కొడవలితో కోసాడు. స్థానికంగా వుంటున్న మహాలక్ష్మి , చిన్నారావు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. మహాలక్ష్మి పై అనుమానంతో చిన్నారావు పీక కోసి హత్యాయత్నానికి ఒడిగట్టాడు. మహాలక్ష్మి తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మహాలక్ష్మి పై దాడితరువాత చిన్నారావు డాబా పై నుంచి దూకాడు.బిల్డింగ్ పై నుంచి దూకడంతో చిన్నారావు ప్రాణాలు కోల్పోయాడు.

విజయనగరం జిల్లాలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ

విజయనగరం : జిల్లాలో వైసీపీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీ ఛైర్మన్ బడ్డుకొండ అప్పలనాయుడు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో వైసీపీ అధిష్టానం ఆయన్ను నిన్న సస్పెండ్ చేయగా, ఆ మరుసటి రోజే ఆయన పార్టీని వీడటం గమనార్హం. విజయనగరంలో మీడియా సమావేశంలో మాట్లాడిన అప్పలనాయుడు... పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. జగన్‌ను ఒక 'నియంత'గా అభివర్ణించిన ఆయన... వైసీపీ ఒక లిమిటెడ్ కంపెనీగా మారిపోయిందని ఆరోపించారు. గౌరవం లేని చోట తాను, తన అనుచరులు ఇకపై కొనసాగలేమని స్పష్టం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలు, చంద్రబాబు ఎలాగూ ఓడిపోతారన్న జగన్ అతివిశ్వాసమే పార్టీ ఘోర పరాజయానికి కారణమని విశ్లేషించారు. పార్టీలో క్రమశిక్షణ కమిటీ అనేది ఒకటుందా? అని ప్రశ్నించిన అప్పలనాయుడు... నేతలు తమ సొంత సంస్థలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌ను నమ్మి వేలాది కుటుంబాలు నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన బంధువైన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను సస్పెండ్ చేసినప్పుడు, ఆయనకు మరో బంధువైన బొత్స సత్యనారాయణపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. ఇటీవల చిన్న శ్రీను, ఆయన కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఆయనతో పాటు పలువురు స్థానిక నేతలు, జడ్పీటీసీలు కూడా వైసీపీని వీడారు. చిన్న శ్రీనుకు అత్యంత సన్నిహితుడైన బడ్డుకొండ కూడా ఇప్పుడు పార్టీ నుంచి నిష్క్రమించడంతో, ఒకప్పుడు బొత్స కుటుంబానికి కంచుకోటగా ఉన్న విజయనగరం జిల్లాలో వైసీపీ బలం గణనీయంగా క్షీణిస్తోందన్న చర్చ జరుగుతోంది.

చేనేత వస్త్రప్రదర్శనను ప్రారంభించిన సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన

హైదరాబాద్ : మన చేనేతకళలను మనమే ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాలు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా భాద్యతగా ధరించాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన అన్నారు. శ్రీనగర్ కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరుతో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. దసరా, బతుకమ్మ, దీపావళితో పాటు పలు శుభకార్యాలకు అనువుగా ఇక్కడ చేనేత కళాకారుల చీరలు కొలువుదీరాయని, చేనేత కళాకారులకు మరింత ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా చేనేత వస్త్రకళలు నిలుస్తాయని, భారతీయ వస్త్రాలకు అంతర్జాతీయంగా ప్రాచుర్యం ఉందన్నారు. చేనేతకారులకు మరింత ప్రోత్సాహం అందించడానికి, వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసిన నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్‌ల కృషిని అభినందించారు. వస్త్రప్రదర్శనలోని వస్త్రాలను తిలకించి చేనేతకారులను ప్రశంశించారు. ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలను సుమారుగా 80స్టాల్స్ ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

హ్యాండీ క్రాఫ్ట్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం

హైదరాబాద్ : దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళలను ఒకే చోటఅందుబాటులో ఉంచడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు .హైదరాబాద్ మోతీ నగర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్ లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళాను నిర్వాహకులతో కలిసి ఆయన ప్రారంభించారు. చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులు, హస్తకళాకారులు తయారు చేసిన హ్యాండీ క్రాఫ్ట్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.దసరా, బతుకమ్మ, దీపావళి పండుగలను పురస్కరించుకుని మంగళగిరి ,ఉప్పాడ, వెంకటగిరి ,భాగల్ పూర్ శారీస్ తో పాటు డిజైనర్ వేర్ ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంచామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ వచ్చే నెల ఒకటో తేదీ వరకు కొనసాగుతుంది . దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన బ్రాండెడ్ వస్త్ర ఉత్పత్తులు వీవర్స్ టు కస్టమర్ కు అందిస్తున్నట్లు నిర్వహకులు మహ్మద్ సాబేర్ అలీ ,అక్బర్ అలీ తెలిపారు. ప్రతి రోజు ఉదయం పది నుండి రాత్రి పది వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందన్నారు.

కరెంట్ కోసం రామాయంపేటలో రైతుల రాస్తారోకో

రెండు గంటలు స్తంభించిన ట్రాఫిక్

రామాయంపేట: వసాయానికి కనీసం 8 గంటల విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో రైతులు రాస్తారోకో చేపట్టారు. రామాయంపేట–ఎల్కతుర్తి జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సుమారు రెండు గంట లపాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉందని, ఈ సమయంలో నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 8 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నా.. ఎప్పుడు సరఫరా నిలిచిపోతుందో, ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ సరఫరాను నిరంతరాయం గా అందించాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాను సక్రమంగా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

ఐకెపి బిల్డింగ్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలి

- నారపోగు ప్రసాద్, షేక్ మహారాజ్ డిమాండ్

తల్లాడ అక్టోబర్ 4, ప్రజా కలం న్యూస్

తల్లాడ మండల కేంద్రంలో అంబేద్కర్ భవన్ పక్కన నిర్మించడానికి సిద్ధంగా ఉన్న ఐకెపి బిల్డింగు నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆ ప్రాంతంలో అంబేద్కర్ భవన్ మరియు వాలీబాల్ క్రీడా ప్రాంగణం ఉండడం చేత నిత్యం మండలంలో ఉన్న యువకులు వాలీబాల్ ఆడుతూ ఉంటారు, ఆ వాలీబాల్ ఏడ ప్రాంగణం పక్కనే గతంలో లాంగ్ జంప్ ఐజంపు తదితర ఆటలు కూడా ఆడేవారు జిమ్ము కోసం ఏర్పాటు చేసిన స్థలం అది ఆ స్థలంలో ఐకెపి సిబ్బంది బిల్డింగ్ భవనాన్ని ప్రారంభించడానికి ఇప్పుడు సిద్ధ పడ్డారు. కానీ అది గతంలోనే క్రీడా ప్రాంగణాలకు ఏర్పాటు చేసిన స్థలం అట్టి స్థలంలోకి మరి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకుండా ఉండాలని సూచిస్తున్నాం. ఐకెపి సిబ్బందికి నిత్యం ఏవో ఒక మీటింగులు ఉంటాయి.ఈ క్రమంలో వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందుగా గుర్తించి ఆ పనులను అక్కడ నిలిపివేసి,గతంలో ఐకెపి బిల్డింగుల నిమిత్త ం శంకుస్థాపనలు కూడా జరిగాయి.ఆ ప్రాంతంలో కానీ, ఎన్ఎస్పి స్థలాల సమీపంలో కూడా ఖాళీ స్థలాలు ఉన్నాయి.ఆ ప్రాంతాలలో ఆ పనులను ప్రారంభించడం చేత అటు ఐకెపి సిబ్బందికి,ఇటూ యువ క్రీడాకారులకు ఎటువంటి



ఇబ్బందులు కలగవని,తద్వారా యువ క్రీడాకారులకు ప్రోత్సా హం ఇచ్చినట్లు కూడా ఉంటుందని వివిధ ప్రభుత్వ సర్వీసుల్లో వారు పాల్గొని భవిష్యత్తులో రాణించేందుకు అవకాశం ఈ వాలీబాల్ క్రీడలు ఉపయోగపడతాయని గుర్తు చేస్తున్నాము, కావున మనసులో పెట్టుకొని వాటిపై విచారణ జరిపి ప్రస్తుతం జరుగుతున్న ఐకెపి పనులను నిలుపుదల చేసి ప్రజలు సూచించిన ఆయా ప్రాంతాలలో బిల్డింగ్ నిర్మాణ పనులు చేపట్టితే ఐకెపి సిబ్బందికి కూడా శ్రేయస్కరంగా ఉంటుందని తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో వాలీబాల్ క్లబ్ అధ్యక్షులు ధరావత్ కృష్ణ,ఉపేందర్, మొక్క సైదులు,పెరిక శ్రీను, రవి,యాసిన్,మోషే,నాగ, సత్యనా రాయణ, రామారావు మహారాజ్, సంపత్,విజయ్,అజయ్, హుస్సేన్,మధరా, పుల్లారావు,ముస్తఫా,నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పీవో సానుకూల స్పందన

- ఐఆర్‌సీఎస్ భద్రాద్రి కొత్తగూడెం కార్యవర్గంతో పీవో బి.రాహుల్ భేటీ



ప్రజాకలం ప్రతినిధి, భద్రాచలం, అక్టోబర్ 05:

భద్రాచలం ఐటిడిఏ పరిధిలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రాజెక్టు ఆఫీసర్ ఐటిడిఏ బి.రాహుల్ సానుకూలంగా స్పందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం పీవో బి.రాహుల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి వినతిపత్రాన్ని సమర్పించారు. భద్రాచలం ఐటిడిఏ పరిధిలోని 63 ఆశ్రమ పాఠశాలలు, 32 గురుకుల కళాశాలల్లో చదువుతున్న సుమారు 25 వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించే కార్యక్రమాన్ని అక్టోబర్ 9, 2026 నుంచి చేపట్టేందుకు పీవో ఆమోదం తెలిపినట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. అలాగే కంటి చూపు తక్కువగా ఉన్న వారికి కంటి శస్త్రచికిత్స శిబిరాలు నిర్వహించేందుకు కూడా సహకారం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఐఆర్‌సీఎస్ ఆసుపత్రికి బయోకెమిస్ట్రీ ఎనలైజర్ అందించడం, తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు సహాయం అందించడం వంటి కార్యక్రమాలపై కూడా చర్చించారు. పాల్వంచలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం, మూత్రపిండాల వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ కేంద్రం, రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు అవసరమైన నిధుల సమీకరణకు చర్యలు చేపడతామని పీవో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీవో బి.రాహుల్‌కు ఐఆర్‌సీఎస్ కార్యవర్గ సభ్యులు ధన్యవాదాలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో డా. ఎస్.ఎల్. కాంతారావు (చైర్మన్), చల్లగుళ్ల నాగేశ్వరరావు (వైస్ చైర్మన్), టి.వి. బాలయోగి (ట్రెజరర్), వై. సూర్యనారాయణ (స్టేట్ కమిటీ మెంబర్), జిల్లా కమిటీ సభ్యులు పల్లంటి దేశప్ప,హరిశ్చంద్ర నాయక్, బిబిజి తిలక్, యం.బి. సర్సారెడ్డి, కండెలవాల సతీష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తపట్నం రైతులకు నిరంతర విద్యుత్ అందించాలి

- ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, అక్టోబర్ 05:

పురుషోత్తపట్నం గ్రామంలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామ రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోక తరచూ లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో పాటు విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యల కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, పంటలకు సకాలంలో నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న రైతులకు నష్టం జరగకుండా తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని (లోడ్) పెంచేలా సంబంధిత ఏపీ ఎంపీడీసీఎల్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు



వారు తెలిపారు. వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ అప్‌గ్రేడేషన్, లోడ్ పెంపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తపట్నం గ్రామ రైతులు, సారెడ్డి ఏడుకొండలు రెడ్డి, సింగిరెడ్డి గోపిరెడ్డి, భోగాల వెంకటరామిరెడ్డి, గొంగడి వెంకటరామిరెడ్డి, ఎల్లారెడ్డి ఏడుకొండలు రెడ్డి, చేకూరి రామమోహన్‌రావుతో పాటు పలువురు వ్యవసాయదారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు సీపీఐ, సీపీఎం పిలుపు



నాగర్‌కర్నూల్ అక్టోబర్ 5 (ప్రజా కలం): కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ గుప్తాను వెంటనే తొలగించి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 6న జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, టీజేఎస్ పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వి. పర్వతాలు తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది పౌరుల ఓట్లను అక్రమంగా తొలగించారని విమర్శించారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు హుందాతనంతో, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్‌తో పాటు దేశంలోని పలు నగరాల్లో విద్యార్థులు, యువత చేపడుతున్న ఉద్యమాలకు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా, నిరసన కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఆనంద్‌జీ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్ పక్కన ఎటువంటి భవనాలు నిర్మించొద్దు

- కాంగ్రెస్ తల్లాడ మండల ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్..



తల్లాడ ఆగస్టు 5 ప్రజా కలం న్యూస్ తల్లాడ పట్టణంలోని అంబేద్కర్ భవన్ పక్కన ఎటువంటి భవనాలు నిర్మించొద్దని కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ భవన్ సమీపంలో వేరే ఇతర భవనాలు నిర్మించడం ద్వారా కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపారు. అంబేద్కర్ భవన్ కు వచ్చే వారు సమావేశాలు నిర్వహించుకునే సమయంలో అవస్థలు పడే అవకాశం ఉందని అన్నారు. ఇరుకుగా భవనాలు ఉండటం వల్ల నూతనంగా కట్టే భవనాలకు కూడా గందరగోళం అయ్యే పరిస్థితి ఉందని అన్నారు. అంబేద్కర్ భవనం పక్కన కాకుండా ప్రభుత్వ స్థలాలు ఇంకా అనేక చోట్ల ఉన్నాయని, ఆ స్థలాల్లో ఇతర భవనాలు నిర్మించుకోవాలని సూచించారు. అంతేకాకుండా నిత్యం ప్రధాన కార్యాలయాలైనా మండల పరిషత్, తహశీల్దార్, గ్రామపంచాయతీ కార్యాలయాలు ఆ సమీపంలో ఉండటంతో ప్రజలు భారీగా వచ్చే అవకాశం ఉందని ఈ కార్యాలయాలు నిర్మించడం ద్వారా పూర్తిగా ఇరుకుగా మారి ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై దృష్టి సారించి ఎటువంటి భవనాలు నిర్మించకుండా ఉండాలని సూచించారు.



తిరుమలకు రాపిడో, ఓలా, ఉబర్ బైక్‌లు నిషేధం!

తిరుమల:శ్రీవారి భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తిరుమల ఘాట్ రోడ్లలో రాపిడో, ఓలా, ఉబర్ వంటి బైక్ ట్యాక్సీ సర్వీసులను టీటీడీ పూర్తిగా నిషేధించింది.ఇటీవల హైదరాబాద్‌కు చెందిన సునీల్ అనే భక్తుడు శ్రీవారి దర్శనానంతరం తిరుపతి విమానాశ్రయానికి వెళ్లేందుకు రాపిడో బైక్‌ను బుక్ చేసుకున్నారు. ఈ క్రమంలో తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని 26వ మలుపు వద్ద ద్విచక్రవాహనం క్రాష్ బారియర్‌ను బలంగా ఢీకొనడంతో బైకర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, భక్తుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని టీటీడీ యాజమాన్యం అత్యంత తీవ్రంగా పరిగణించింది.

అమెరికాలో విషాదం.. అనారోగ్యంతో నల్గొండ యువతి మృతి

మిర్యాలగూడ : ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు యువతి తీవ్ర అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి కన్నుమూసింది. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఏసీఎస్ సల్కునూరు మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కందిమల్ల లక్ష్మిరెడ్డి, పద్మ దంపతుల చిన్న కుమార్తె మాన్వితా రెడ్డి (26) హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లింది. స్నేహితులతో కలిసి ఉంటూ ఎంఎస్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురైంది. సెప్టెంబర్ 4న అకస్మాత్తుగా తీవ్ర గొంతు నొప్పితో అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులు ఆమెను బాల్టిమోర్‌లోని దవాఖానలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు నాలుగో దశ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. సెప్టెంబర్ 13న చికిత్స కోసం దవాఖానలో ఇన్ పేషెంట్‌గా చేర్చుకున్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్టోబర్ 1న మాన్వితారెడ్డి మృతిచెందింది.

ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య

వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో విషాద ఘటన

వికారాబాద్ : మాటుగూడలో కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం భర్త రాజుతో గొడవ పడి కూతురు జనశ్రీ (8), కుమారుడు సాకేత్ (4)లను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయి సోమనుర్తి శివారులోని వ్యవసాయ బావిలో దూకి శవమై భార్య మమత (30) కనిపించింది. ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, సాకేత్ కోసం పోలీసులు గాలిస్తుననారు.

ఇద్దరు పిల్లలతో బావిలో దూకి తల్లి ఆత్మహత్య

పరిగి : వికారాబాద్ జిల్లా పూడూరు మండలం సోమన్‌గుర్తిలో విషాదం చోటు చేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య చేసుకుంది. తల్లి మమత, కూతురు జనశ్రీ మృతదేహాలు ఇప్పటికే లభ్యం అయ్యాయి. కుమారుడు సాకేత్ మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఊర్లోని ఓ బావిలో మమత ఇద్దరు పిల్లలతో సహా దూకేసింది. బావిలో నీళ్లు ఎక్కువగా ఉండటంతో సాకేత్ మృతదేహం ఇంకా కనిపించలేదు. భర్త తో గొడవ కారణంగానే మమత ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకినట్టు తెలుస్తోంది. శుక్రవారం భర్తతో గొడవ కాగా ఉదయం ఇద్దరు పిల్లలతో బయటకు వెళ్లింది. రాత్రైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తెలిసిన వ్యక్తులు , బంధువులు వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో సమీప పొలాల వద్ద వెతకడం ప్రారంభించారు. సోమనుర్తి గ్రామ శివారులో ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు, ఒక బ్యాగు ఉండటంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో బావిలో వెతకగా తల్లి, కూతురు మృత దేహాలు లభించాయి. ఆ మృతదేహాలు మమత, జనశ్రీవిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. సాకేత్ మృతదేహం కోసం పోలీసులు బావిలో వెతుకుతున్నారు.

చిత్రలేఖనంలో జీవన్ దుర్గేంద్రకు తృతీయ బహుమతి

రాజమౌమ్మంగి : సేవా సంకల్ప్ అభియాన్ ఆధ్వర్యంలో రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అక్టోబర్ 1న జిల్లా స్థాయి చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాజమౌమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు.8వ తరగతి విద్యార్థిని సత్య వరలక్ష్మి వక్తృత్వ పోటీలో ప్రథమ బహుమతి సాధించింది. 7వ తరగతి విద్యార్థి బి. జీవన్ దుర్గేంద్ర చిత్రలేఖన పోటీలో తృతీయ బహుమతి సాధించాడు. జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలో బహుమతి సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థులను పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సీహెచ్ శివకృష్ణ, పీఎంసీ చైర్మన్ బి. శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండబాబు, సత్యబాబు, స్వామి, జయలక్ష్మి పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు 'సుంకెట్' ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు ఎంపిక

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 04:

జిల్లా పరిధిలో 2026 సంవత్సరానికి అందజేసే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జెడ్పీహెచ్ఎస్ సుంకెట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది సంతోష్ కుమార్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు జి. రవి ఎంపికయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారి సమగ్ర అభివృద్ధికి, పాఠశాల విద్యా ప్రమాణాల పెంపునకు వీరు చేసిన విశేష కృషికి గానూ ఈ గౌరవం దక్కింది.బోధనలో నూతన పద్ధతులను అమలు చేస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో వీరి సేవలు ఎంతో ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ.. ఈ పురస్కారం తమపై బాధ్యతను మరింత పెంచిందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. సుంకెట్ పాఠశాల ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి ఘనంగా అభినందనలు తెలియజేశారు.



మోర్తాడ్‌లో బౌద్ధుల దీక్షకు బీఎస్ఐ మద్దతు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 5:

బీహార్‌లోని బుద్ధగయ బౌద్ధ విహార్ కో ఆందోళన నేటికి 600 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మోర్తాడ్ మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద బౌద్ధులకు మద్దతుగా ఒక్కరోజు దీక్ష నిర్వహించారు. సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) మోర్తాడ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బుద్ధగయలోని పవిత్ర స్థలం పూర్తిగా బౌద్ధులకే చెందాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం 1949 నాటి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని, బ్రాహ్మణిజం నశించాలని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఈ దీక్షలో మండల బీఎస్ఐ ఉపాధ్యక్షులు యం. గంగాధర్, కార్యదర్శి ఎం. రాజు, సలహాదారులు ఎం. రాజారాం, ఎం. భూమన్న, ప్రచార కార్యదర్శి ఎస్. నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



భూ భారతి లీ-సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం - సర్పంచ్ నవ్య శృతి అరవింద్

బీబీనగర్, అక్టోబర్ 05,(ప్రజాకలం) భూ రికార్డుల ప్రక్షాళన, భూ సమస్యలకు పరిష్కారం చూపే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూభారతి రీ-సర్వే బీబీనగర్ మండలం రహీం ఖాన్ గూడెం గ్రామంలో సోమవారం ప్రారంభమైంది.



మండల సర్వేయర్ ఆధ్వర్యంలో గ్రామంలోని భూముల వివరాలను పరిశీలిస్తూ సర్వే ప్రక్రియను చేపట్టారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నవ్య శృతి అరవింద్ మాట్లాడుతూ.. రైతులంతా రీ-సర్వే ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకుని, ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే సర్వే సమయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంచాల ప్రభాకర్, జీపీఓ రమేష్, రికార్డు అసిస్టెంట్ ఎస్. జ్యోతి, మండల లైసెన్స్‌డ్ సర్వేయర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి... బండి శ్రీరాములు గౌడ్

మేడిపల్లి అక్టోబర్ 5(ప్రజాకలం న్యూస్)

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బండి శ్రీరాములు గౌడ్ పేర్కొన్నారు. మేడిపల్లి మండల ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీరాములు గౌడ్ హాజరయ్యారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరంలో వందలాది మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు.ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు అనిల్ కుమార్, బాలకృష్ణ,ఇమ్రాన్ కాజ్మీ, స్పందన, అనూష పటేల్, సుష్మ,మధు తదితర వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించారు.సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తపోటు,మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరం నిర్వహణలో ఆనువత్రి సిబ్బంది అనూష,భరత్, సురేష్,సంగీత,స్వప్న,నవ్య,వాసు,శ్రీహరి, సుస్మితలు కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను తరచూ నిర్వహించాలని కోరగా నిర్వాహకులు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.



చట్టబద్ధత లేని గ్రామ అభివృద్ధి కమిటీలను రద్దు చేయాలి

: విద్యార్థి సంఘాల ఐక్య వేదిక డిమాండ్



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 5:

గ్రామాల్లో చట్టబద్ధత లేకుండా సమాంతర ప్రభుత్వాలు నడుపుతున్న గ్రామ అభివృద్ధి కమిటీలను (వీడీసీ) తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, బీవీఎం, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో వీడీసీ బాధితులకు మద్దతుగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కర్క గణేష్, బీవీఎం రాష్ట్ర కో-ఆర్డినేటర్ శ్రీధర్ మాట్లాడుతూ.. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, నిర్మల్ ప్రాంతాల్లో వీడీసీలు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నా అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు చూస్తూ ఊరుకోవడం సరికాదన్నారు. తాళ్లరాంపూర్ గ్రామంలో వీడీసీల అకృత్యాలకు గురవుతున్న బాధితుల ఆర్తనాదాలు ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు వినబడడం లేదా అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వీడీసీలపై నమోదైన కేసుల్లో పోలీసులు ఇప్పటివరకు ఛార్జ్‌షీట్లు దాఖలు చేయకపోవడం వారి వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. తాళ్లరాంపూర్‌లో పోలీస్, న్యాయ వ్యవస్థలను కాపాడి గ్రామ స్వరాజ్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితుల మానవ హక్కులను కాపాడాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల్ చారికి విద్యార్థి నాయకులు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, ఈ విషయాన్ని రాష్ట్ర డీజీపీ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోతు రఘురామ్ నాయక్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు శ్రీదీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుబోధ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, నాగరాజు మరియు వీడీసీ బాధితులు నారాయణ గౌడ్, సుదర్శన్, నర్సాగౌడ్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి పోటెత్తిన అర్జీదారులు

: 43 ఫిర్యాదులు స్వీకరించిన నిజామాబాద్ సీపీ



నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 05:

ప్రజలు దళారులు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సీపీ స్వయంగా బాధితుల వద్దకు వెళ్లి, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ మొత్తం 43 ఫిర్యాదులను స్వీకరించారు.

బాధితుల నుంచి అందిన అర్జీలను పరిశీలించిన సీపీ.. వాటి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో ఫోన్ ద్వారా మాట్లాడారు. సమస్యల స్థితిగతులపై ఆరా తీస్తూ, చట్టప్రకారం బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. ఎలాంటి పైరవీలకు తావులేకుండా శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, ప్రజలకు మరింత దగ్గరగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తోందని స్పష్టం చేశారు.

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా నేరుగా సమస్యలను స్వీకరించి పరిష్కరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

అక్లూర్ మహిళా భవన్‌కు రూ. 1.50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు

-అదనపు అభివృద్ధి పనులకు శ్రీకారం

-పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రంగు అనిల్ గౌడ్



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 05:

వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలోని మహిళా భవన సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు అనిల్ గౌడ్ అన్నారు. సోమవారం అక్లూర్ గ్రామంలోని మహిళా భవనానికి రూ. 1.50 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధుల తో చేపట్టనున్న అదనపు, మిగిలిన అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కొబ్బరికాయ కొట్టి పనులను అధికారికంగా ప్రారంభించారు.


ఈ సందర్భంగా అనిల్ గౌడ్ మాట్లాడుతూ.. మహిళా భవనాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించి, గ్రామంలోని మహిళలకు అన్ని రకాలుగా ఉపయోగపడేలా అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించడమే ఈ పనుల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాల బలోపేతానికి, వారి సమావేశాల నిర్వహణకు ఈ భవనం ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. నిర్దేశిత గడువులోగా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టరును కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిన్నా జనార్ధన్, ఉప సర్పంచ్ సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్, కరోబార్ జిన్నా స్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు పుర్రె మౌనిక, కాంగ్రెస్ పార్టీ నాయకులు చరణ్ జాగిరాల, మొహమ్మద్ అబ్దుల్ మజీద్, డిష్ శేఖర్ మరియు స్థానిక నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైలు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.50 వేల చేయూత

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

బీబీనగర్, అక్టోబర్ 05(ప్రజాకలం) రైలు ప్రమాదంలో సుమారు 400 గొర్రెలను కోల్పోయిన బాలబోయిన కిష్టయ్య యాదవ్ కుటుంబానికి ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేయూతనందించారు. బీబీనగర్--కొండమడుగు మెట్టు--ఘట్కేసర్ సరిహద్దు ప్రాంతంలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో గొర్రెలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కిష్టయ్య యాదవ్‌తో పాటు ఆయన ముగ్గురు కుమారుల కుటుంబాలు సుమారు రూ.40--50 లక్షల విలువైన గొర్రెలను కోల్పోయాయి.

ఈ విషయం తెలుసుకున్న బీర్ల ఐలయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి, బీర్ల అనిత--ఐలయ్య ఫౌండేషన్ తరఫున రూ.50 వేల ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. బాధితులకు ధైర్యం చెప్పి, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య యాదవ్, జిల్లా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ, సింగిల్‌విండో చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, పాక వెంకటేష్ యాదవ్, పాక జంగయ్య యాదవ్, జాల జగదీశ్, మెట్టు ఇలయ్య, కొత్తపల్లి జంగయ్య, ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





బాధితురాలికి అండగా ఎమ్మెల్యే వేముల

- మోకాలి శస్త్రచికిత్సకు రూ.1.10 లక్షల ఎల్ఓసీ మంజూరు

- కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 5:

ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న ఓ కుటుంబానికి బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అండగా నిలిచారు. నియోజకవర్గ పరిధిలోని వేల్పూర్ గ్రామానికి చెందిన జమ్మలగిరి వనీత మోకాలి సమస్యతో బాధపడుతూ, శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు.

చికిత్సకు అయ్యే ఖర్చు భరించలేని స్థితిలో ఉండటంతో, బాధితురాలి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వేములను కలిసి తమ ఆవేదనను వివరించారు. వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. తక్షణమే ప్రభుత్వం నుంచి రూ. 1,10,000 విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించారు.

హైదరాబాద్‌లోని తన నివాసంలో వనీత కుటుంబ సభ్యులకు ఈ ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. కష్టసమయంలో స్పందించి, వైద్య ఖర్చుల నిమిత్తం పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందించినందుకు బాధితురాలి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

భీంగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యా యత్నం

పోలీసుల తప్పిదం లేదు-కమిషనర్ వెల్లడి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 05:

నిజామాబాద్ జిల్లా భీంగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం ఒక వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై స్పందించిన పోలీస్ కమిషనర్.. ఇందులో పోలీసుల తప్పిదం ఏమీ లేదని స్పష్టం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీంగల్ నివాసి అయిన పి. సుధాకర్ పాత బస్టాండ్ సమీపంలో టీ స్టాల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం సుమారు 9:45 గంటల సమయంలో సుధాకర్ పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టెతో పోలీస్ స్టేషన్ ఆవరణలోకి వచ్చాడు. అందరూ చూస్తుండగానే అకస్మాత్తుగా తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన పోలీస్ సిబ్బంది, స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులు వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. అనంతరం బాధితుడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




బెదిరింపులే కారణం?

ప్రాథమిక విచారణ నివేదిక ప్రకారం.. సుధాకర్ టీ షాప్‌నకు ఎదురుగా ఉన్న ఒక కిరాణా షాప్ యజమాని, తన వద్ద సిగరెట్లు కొనడం లేదనే నెపంతో ఇద్దరు రిపోర్టర్లను సుధాకర్ వద్దకు పంపించి బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది. మరోవైపు, రాత్రి వేళల్లో ఆలస్యంగా షాప్ నడుపుతున్నందుకు గాను, పోలీసులు తమ విధుల్లో భాగంగా సుధాకర్‌పై ఒక పెట్టీ కేసు నమోదు చేశారు. రిపోర్టర్లు బెదిరించిన విషయాన్ని మనసులో పెట్టుకుని తీవ్ర మనస్తాపానికి గురైన సుధాకర్.. పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఆత్మహత్యా యత్నం ఘటనకు పోలీసు వ్యవస్థకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని పోలీస్ కమిషనర్ అధికారిక ప్రకటనలో స్పష్టం చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

భాషోపాధ్యాయుడు గంగాధర్‌కు డాక్టరేట్.. ఘన సన్మానం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 05:

ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందిన ప్రముఖ తెలుగు భాషోపాధ్యాయుడు డాక్టర్ పతాని గంగాధర్‌ను ధర్మోరా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) సిబ్బంది ఘనంగా సత్కరించారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఏ. రఘునందన చారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గతంలో ధర్మోరా ఉన్నత పాఠశాలలో ఆరు సంవత్సరాలకు పైగా తెలుగు ఉపాధ్యాయునిగా గంగాధర్ విశేష సేవలందించారు. ప్రస్తుతం ఆయన కుకునూరు ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ధర్మోరా పాఠశాలలో పనిచేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడిన గంగాధర్, ఉన్నత విద్యలో రాణించి డాక్టరేట్ సాధించడం పట్ల ప్రధానోపాధ్యాయుడు రఘునందన చారి హర్షం వ్యక్తం చేశారు. ఆయన సాధించిన విజయం తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర్‌ను శాలువాతో కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేణుకాదేవి, రవికాంత్, క్రాంతి కుమార్, హన్మాండ్లు, శ్రీనివాస్, భరత్, రమ్య తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



విస్తృత మార్కెట్ పెట్టుబడికి 'కోటక్ నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్'

ముంబయి, అక్టోబరు 5: విస్తృత ఈక్విటీ మార్కెట్‌లో పెట్టుబడికి వీలు కల్పించేలా కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (కోటక్ మ్యూచువల్ ఫండ్) కొత్తగా లి'కోటక్ నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్'లిను ప్రారంభించింది. ఇది నిఫ్టీ 500 ఇండెక్స్‌ను అనుసరించే ఓపెన్-ఎండెడ్ పథకం. ట్రాకింగ్ ఎర్రర్‌కు లోబడి ఈ ఇండెక్స్ పనితీరును అనుకరించేలా ఫండ్ నిర్వహించనున్నారు.

ఈ పథకం నూతన ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) అక్టోబరు 5న ప్రారంభమై, అక్టోబరు 19న ముగియనుంది.

ఈ సందర్భంగా కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నీలేశ్ షా మాట్లాడుతూ.. దేశంలో ఈక్విటీ పెట్టుబడులకు అవకాశాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. వివిధ రంగాలు, పరిశ్రమలు, మార్కెట్ క్యాప్ విభాగాల్లో అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో ఒకే ఇండెక్స్ ద్వారా విస్తృత మార్కెట్‌లో పెట్టుబడి పెట్టే అవకాశం ఈ పథకం కల్పిస్తుందని పేర్కొన్నారు. భారత్ ఆర్థిక వృద్ధికి పట్టణీకరణ, విధానపరమైన నంస్కరణలు, పారిశ్రామిక వృద్ధి, అనుకూల జనాభా నిర్మాణం, డిజిటల్ మార్పులు, కంపెనీల బలమైన బ్యాలెన్స్ షీట్లు, సేవల రంగం విస్తరణ వంటి అంశాలు దోహదపడుతున్నాయని నంస్థ తెలిపింది. నిఫ్టీ 500 ఇండెక్స్ ద్వారా లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడి అవకాశం లభిస్తుందని పేర్కొంది. ఇది భారత లిస్టెడ్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో సుమారు 87 శాతాన్ని ప్రతిబింబిస్తుందని వెల్లడించింది.

కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఫండ్ మేనేజర్ నతీశ్ దొండపాటి మాట్లాడుతూ.. విస్తృత ఈక్విటీ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారు సాధారణంగా వివిధ మార్కెట్ క్యాప్ విభాగాల్లో విడివిడిగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని అన్నారు. నిఫ్టీ 500లో స్థిరపడిన పెద్ద కంపెనీలతో పాటు అభివృద్ధి చెందుతున్న వ్యాపార సంస్థలు కూడా ఒకే పోర్ట్‌ఫోలియోలో ఉంటాయని తెలిపారు.

పాసివ్ పెట్టుబడి విధానం

కోటక్ నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్ పాసివ్ ఇన్వెస్ట్‌మెంట్ విధానాన్ని అనుసరిస్తుంది. నిఫ్టీ 500 ఇండెక్స్ కూర్పును అనునరించేలా పోర్ట్‌ఫోలియోను రూపొందించనున్నారు. తద్వారా ఒకే పెట్టుబడి సాధనం ద్వారా లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో విస్తృతంగా పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుంది.

కనీస పెట్టుబడి: ఎన్ఎఫ్ఓ సమయంలో రూ. 1,000. ఆపై ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. నిరంతర పెట్టుబడులకు కనీసం రూ. 1,000, ఆపై ఎంతైనా పెట్టుబడి చేయవచ్చు. ఎస్ఐపీ ద్వారా కనీనం రూ. 500తో పెట్టుబడి ప్రారంభించవచ్చు. కనీసం రెండు ఎస్ఐపీ వాయిదాలు రూ. 500 చొప్పున ఉండాలి.



యాదగిరిగుట్టలో నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డిసిసిబి) నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట,అక్టోబర్ 05 (ప్రజా కలం)

నూతన బ్యాంకు సేవల ద్వారా రైతులకు అవసరమైన రుణాలు, బ్యాంకింగ్ సేవలు మరింత సులభతరం అవుతాయని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా,యాదగిరిగుట్ట పట్టణంలో నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నూతన భవనాన్ని బీర్ల అయిలయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార రంగం బలోపేతంతో రైతులు, వ్యవసాయదారులు, గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.నూతన భవనం ద్వారా ఖాతాదారులకు సౌకర్యవంతమైన సేవలు అందించడంతో పాటు, రైతులకు అవసరమైన రుణాలు,బ్యాంకింగ్ సేవలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణం ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా బ్యాంకింగ్ మౌలిక వసతులను కూడా మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.సహకార బ్యాంకుల ద్వారా రైతులకు అండగా నిలుస్తూ,గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని నూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,రైతులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఆయిలయ్యకి జిల్లా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం

ఆలేరు నియోజకవర్గం, అక్టోబర్ 05(ప్రజా కలం)

తేదీ 01.10.2026 గురువారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం తహసీల్దార్ కార్యాలయంలో మండల గిర్దావర్ గా విధులు నిర్వర్తిస్తున్న కొండం వెంకట్ రెడ్డి పైన అకారణంగా బొమ్మలరామారం గ్రామానికి చెందిన బెజ్జంకి వెంకట్ రెడ్డి అతని కుమారుడు భౌతిక దాడి చేసిన విషయం తెలిసిందే. ఇటువంటి సంఘటనలు జిల్లాలో పునరావృతశీ కాకుండా చూడాలని జిల్లా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్,ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్యని సోమవారం రోజున కలిసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సానుకూలంగా స్పందించి వెంబడే జిల్లా ఎస్పీ తో చారవాణిలో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు హేమమైన చర్య అన్నారు ఇలాంటివి జిల్లాల్లో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ తహసిల్దార్ ల సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పి.రాధ,టిజిటిఏ జిల్లా అధ్యక్షులు పి.రవికుమార్,తెలంగాణ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండం వెంకట్ రెడ్డి,టీజీటీఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.ఆంజనేయులు, జిపిఓల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్,జిపిఓల సంఘం రాష్ట్ర కోశాధికారి గుర్రాల బాలకృష్ణ ,టీజీ ఆర్ఎస్ఏ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు వై. మల్లికార్జున్ రావు,టీజీ ఆర్ఎస్ఏ జిల్లా నాయకులు సిహెచ్ లోకేందర్ రెడ్డి,డి.నరేష్ నాయక్, రామారావు,జిపిఓల సంఘం జిల్లా నాయకులు మద్ది వెంకట్ నర్సింహా రెడ్డి,మాధవ రెడ్డి, కవిత,ఆంజనేయులు,శ్రీశైలం, జిపిఓ లు తదితరులు పాల్గొన్నారు



పేరుకే ప్రజావాణి,సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలం?

ప్రజావాణిలో వచ్చిన రెవిన్యూ ఫిర్యాదులు 73

యాదాద్రి భువనగిరి జిల్లా, అక్టోబర్ 05(ప్రజా కలం)

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్న అధికారులు మాత్రం ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ఫిర్యాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సోమవారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో,భువనగిరి ఆర్టీవో కార్యాలయంలో, జిల్లాలోని వివిధ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రోజున నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 131 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 73,సర్వే ల్యాండ్స్ 12, మున్సిపాలిటీ 10,వ్యవసాయ 6, జిల్లా పరిషత్ 5, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 4, విద్య శాఖ 3, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీరాజ్ 2,ఉపాధి కల్పన 2, అటవీ 2, పంచాయతీ 2, మైన్స్,వైద్య ఆరోగ్య, పౌరసరఫరాల, ఇరిగేషన్,లేబర్,సమాచార శాఖ,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, బీసీ వెల్ఫేర్,శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు కృతిక,సాత్విక్, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అక్టోబర్ 7న జరిగే విద్యుత్ వినియోగదారుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

- కందాల సురేష్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్

భువనగిరి పట్టణం,అక్టోబర్ 05 (ప్రజా కలం)

భువనగిరి జిల్లా కేంద్రంలోని కిసాన్ నగర్ లో గల విద్యుత్ కార్యాలయంలో ఈనెల 7 న (బుధవారం రోజున) "కస్టమర్స్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం (సీ జీ ఆర్ ఎఫ్) సభ్యుల" సమక్షంలో జరిగే విద్యుత్ వినియోగదారుల సదస్సులో సమస్యలు పరిష్కారించుకోవాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ కందాల సురేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.విద్యుత్ సమస్యలు గల విద్యుత్ వినియోగదారులు ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లుల రషీదులు వెంట తీసుకొని రావాలని ఆయన కోరారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ సెల్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జిల్లా వైద్యారోగ్య శాఖలో లంచాల పర్వం బట్టబయలు

లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కిన డిఎంహెచ్ఓ స్వర్ణ కుమారి

మహేశ్వరం , అక్టోబర్ 05 (ప్రజా కలం):

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో లంచాల పర్వం బట్టబయలైంది. రూ. లక్ష లంచం తీసుకుంటూ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (డిఎంహెచ్ఓ) స్వర్ణ కుమారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా చిక్కడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.వివరాల్లోకి వెళితే... నగరంలో నూతన ఆసుపత్రిని ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడం కోసం డిఎంహెచ్ఓ స్వర్ణ కుమారి రూ. లక్ష లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు ఈ వ్యవహారంపై ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో, వారు పక్కా వ్యూహంతో రంగంలోకి దిగారు. బాధితుడి నుంచి లంచం డబ్బులు స్వీకరిస్తుండగా ఏసీబీ బృందం దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకుంది.

శివరాంపల్లిలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో తనిఖీలు...

శివరాంపల్లిలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో స్వర్ణ కుమారితో పాటు లంచం వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన హెల్త్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ను కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నారు.ప్రస్తుతం డిఎంహెచ్ఓ స్వర్ణ కుమారి, హెల్త్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, డ్రైవర్లను ఏసీబీ అధికారులు ముమ్మరంగా విచారిస్తున్నారు. ఆసుపత్రుల అనుమతుల పేరుతో గతంలో కూడా ఇలాంటి అక్రమాలకు పాల్పడ్డారా అనే కోణంలో విచారణ జరుగుతోంది.



రావిరాల పెద్దమ్మ గుడిని సందర్శించిన యాదగిరిగుట్ట భవన స్థల దాత బండారి నారాయణ ముదిరాజ్

దాత బండారి నారాయణ ముదిరాజ్ ని సన్మానించిన రావిరాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆకుల రమేష్ ముదిరాజ్ మాజీ అధ్యక్షులు లింగం నరసింహ ముదిరాజ్ గోనమోని దేవేందర్ ముదిరాజ్



మహేశ్వరం, అక్టోబర్ 05 (ప్రజా కలం):

యాదగిరిగుట్ట ముదిరాజ్ భవన నిర్మాణానికి స్థల దానం చేసిన ప్రముఖ దాత బండారి నారాయణ ముదిరాజ్ ఆదివారం నాడు రావిరాలలోని పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా రావిరాల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికి రావిరాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆకుల రమేష్ ముదిరాజ్ మాజీ అధ్యక్షులు లింగం నరసింహ ముదిరాజ్, గోనమోని దేవేందర్ ముదిరాజ్ సన్మానించారు.యాదగిరిగుట్టలో ముదిరాజ్ భవన నిర్మాణం కోసం తన సొంత స్థలాన్ని దానంగా ఇచ్చి సమాజ సేవలో తన పెద్ద మనసును చాటుకున్న బండారి నారాయణ ముదిరాజ్ ను ఈ సందర్భంగా సంఘం నాయకులు అభినందించారు. ముదిరాజ్ ల ఐక్యతకు, భవన నిర్మాణానికి ఆయన చేసిన సహాయం చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రావిరాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆకుల రమేష్ ముదిరాజ్, మాజీ అధ్యక్షులు లింగం నరసింహ ముదిరాజ్, గోనమోని దేవేందర్ ముదిరాజ్, మీగడ రాజకుమార్ ముదిరాజ్, పిట్టల రవి ముదిరాజ్, బండ్లగూడకు చెందిన మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం: కలెక్టర్ హైమావతి

సిద్దిపేట: అక్టోబర్ 5 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకుని,నిశితంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.సోమవారం సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి కలెక్టర్ హైమావతి ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 85 దరఖాస్తులు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి,సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు.పరిష్కరించిన వివరాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. సీఎం ప్రజావాణి ద్వారా జిల్లాకు వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి,నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారం

- 'స్పెషల్ క్యాంపెయిన్-6లో జీఎం ఎన్. రాధాకృష్ణ పిలుపు

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో ప్రారంభమైన "స్పెషల్ క్యాంపెయిన్ – 6 " స్వచ్ఛ-స్వచ్ఛ భారత్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.?ఈ సందర్భంగా జీఎం గారు మాట్లాడుతూ, పూజ్య బాపూజీ కలలు కనిన స్వచ్ఛ భారత స్వప్నాన్ని సాకారం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. "గాంధీజీ కేవలం రాజకీయ స్వతంత్ర భారతమే కాకుండా, పరిశుభ్రమైన మరియు అభివృద్ధి చెందిన దేశాన్ని ఆకాంక్షించారు. ఆయన స్ఫూర్తితో 'స్వచ్ఛ తెలంగాణ' లక్ష్యాన్ని సాధిస్తూ, స్వచ్ఛ భారత్ రూపకల్పనలో సింగరేణి కుటుంబాలన్నీ భాగస్వామ్యం కావాలి అని పిలుపునిచ్చారు.పరిసరాల అపరిశుభ్రత వలన వ్యాధులు ప్రబలుతాయని, ఇది మన ఆరోగ్యంతో పాటు సమాజ ఆరోగ్యానికి కూడా హాని కలిగిస్తుందని హెచ్చరించారు. వారానికి కనీసం రెండు గంటలు శ్రమదానం చేసి మన ఇల్లు, పరిసరాలు, మరియు పని చేసే కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మనం పాటించే ఈ పరిశుభ్రత, క్రమశిక్షణ రాబోయే భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి





ఉప సర్పంచ్ ల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా వెల్దండ కృష్ణారెడ్డి నియామకం

వలిగొండ అక్టోబర్ 5 ప్రజాకలం:యాదాద్రి భువనగిరి జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరం జిల్లా అధ్యక్షులు డా.సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్నం బాలరాజు భువనగిరి పట్టణంలో జిల్లా కమిటీ సమావేశం జరిగినది. ఈ సమావేశంలో నూతన జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా వలిగొండ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన వెల్దండ కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు.వెల్దండ కృష్ణారెడ్డి వలిగొండ మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన గ్రామ ఉపసర్పంచ్ పదవి బాధ్యతలు నిర్వహిస్తూ జిల్లా కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించిన రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులకు జిల్లా ఉ పసర్పంచ్ ఫోరం కమిటీకి ధన్యవాదాలు తెలుపుతూ ఈ నా నియామకానికి సహకరించిన జిల్లాలోని ప్రతి గ్రామ ఉపసర్పంచ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఉప సర్పంచ్ గా జిల్లా కమిటీ సభ్యులుగా ఉపసర్పంచ్ లకు జిల్లాలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా నేను అందుబాటులో ఉండి వారి సమస్యలను బాధ్యతయుతంగా నెరవేరుస్తానని ఆయన అన్నారు.ఉపసర్పంచ్ ల హక్కుల కోసం పోరాటం చేసే విధంగా కార్యక్రమంలో నేను వర్కింగ్ ప్రెసిడెంట్ గా నా బాధ్యులను నిర్వహిస్తానని, తెలిపారు.

నేడు ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన కార్యక్రమం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం -- గాజులరామారం సర్కిల్ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించ తలపెట్టిన్నట్లు మేడ్చల్ డిపిఆర్ఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ముఖ్య అతిథులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర రెవెన్యూ ఁ గృహ నిర్మాణ శాఖ మంత్రి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పట్నం మహేందర్ రెడ్డి శాసనమండలి సభ్యులు ఁ ప్రభుత్వ విప్ తేదీ

06-10-2026, మంగళవారం

సమయం10 గంటలకు

వేదిక కైసర్ నగర్, గాజులరామారం సర్కిల్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అభిమానులు పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలను హనుమంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ప్రకటనలో తెలిపారు.



అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

:బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు రవి



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటును నమోదు చేసుకోవాలని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి ఓటర్లకు పిలుపునిచ్చారు. సోమవారం జగద్గిరిగుట్ట పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో సమర్థవంతంగా వినిపించేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు.. అందుకే అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

తెలంగాణ ఉద్యమకారులను విస్మరిస్తున్న ప్రభుత్వం

: టీయు జేఏసీ ఆగ్రహం
- అంబర్‌పేట్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ఒకరోజు దీక్ష
- ఎన్నికల హామీలు ఏమయ్యాయంటూ నిలదీత - దీక్షను భగ్నం చేసిన పోలీసులు; ఉద్యమకారుల అరెస్ట్



అంబర్‌పేట్ అక్టోబర్ 5 (ప్రజాకలం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అంబర్‌పేట్ మండల రెవెన్యూ కార్యాలయం ముందు టీయు జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు.అయితే,ఈ దీక్షకు పోలీసులు ఆటంకం కలిగించి, నాయకులను బలవంతంగా అరెస్ట్ చేయడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

ఎన్నికల హామీలు ఏమయ్యాయి..?

ఈ సందర్భంగా జేఏసీ నాయకులు చైర్మెన్ నుల్తాన్ యాదగిరి,బోయి వెంకటరమణలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యమకారులకు ఎన్నో ఆకర్షణీయమైన హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం,నెలకు గౌరవప్రదమైన పింఛను, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం,ఉచిత వైద్య నదుపాయాలు కల్పిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చి,ఇప్పుడు వాటిని అటకెక్కించారని మండిపడ్డారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడం తప్ప, ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న గట్టి చర్యలు శూన్యమని విమర్శించారు. “ఉద్యమకారుల త్యాగాల పునాదులపై ఏర్పడిన రాష్ట్రంలో.. ఈరోజు వారే తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చి దీక్షలు చేయాల్సి రావడం సిగ్గుచేటు” అని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

దీక్షకు ఆటంకం - పోలీసుల తీరుపై నిరసన

శాంతియుతంగా దీక్షకు కూర్చున్న ఉద్యమకారులపై పోలీసులు ప్రదర్శించిన వైఖరిని జేఏసీ నేతలు తీవ్రంగా ఖండించారు. నిరాహార దీక్ష కోసం నిబంధనల ప్రకారం ముందస్తుగానే ఏరియా పరిధి ఏసిపి,డిసిపి కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పోలీసులు అకస్మాత్తుగా వచ్చి దీక్షా శిబిరాన్ని కూల్చివేయడాన్ని టీయు జేఏసీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దీక్షా శిబిరానికి అనుమతి లేదంటూ పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. టెంట్లు వేయకుండా నిరోధించడమే కాకుండా, దీక్షలో కూర్చు న్న ముఖ్య నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే పోలీసులతో అణచివేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని నిరసనకారులు నినాదాలు చేశారు.

తక్షణమే న్యాయం చేయాలి

పోలీసుల నిర్బంధాలకు తాము భయపడేది లేదని,ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ తక్షణమే ఇళ్ల స్థలాలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. లేనివక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎమ్మార్వో కార్యాలయాల ముట్టడితో పాటు, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని టీయు జేఏసీ హెచ్చరించింది.

ఈ నిరాహార దీక్షా శిబిరానికి మద్దతుగా తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి తండ్రి వెంకటాచారి, టీయు జేఏసి రాష్ట్ర నాయకులు బి.వి. రమణ,ముఖ్య నాయకులు అన్వర్ పాషా,గాజుల యాదగిరి, మొత్కూర్ మహేష్, జి. యాదగిరి మహిళా రాష్ట్ర నాయకులు కొడిపాక సత్య, వి. అరుణ,లావణ్య, విజయలక్ష్మి, అనసూయ, లతలతో పాటు అనుముల రవీందర్, శామ్యూల్ రాజయ్య, పి. యాదగిరి, దేవానంద్,పి. నరసింహం తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

రమణేశ్వరంలో సనాతన ధర్మ సహస్ర సూత్రాలు గ్రంథావిష్కరణ



యాదాద్రి భువనగిరి అక్టోబర్ 5 ప్రజాకలం:

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలో ఆధ్యాత్మిక దివ్యక్షేత్రమైన రమణేశ్వరం సకల ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా నిలిచేదే నిజమైన సనాతన ధర్మమని, సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి అన్నారు.ఆధ్యాత్మిక దివ్యక్షేత్రమైన రమణేశ్వరంలో సోమవారం సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' గ్రంథావిష్కరణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు,మఠాధిపతులు, మహామండలేశ్వరులు, ఆశ్రమాధిపతులు విచ్చేశారు . శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్,హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ చంద్రకుమార్,ఆధ్యాత్మికవేత్త చెన్నప్ప అతిథులుగా విచ్చేశారు.ఈ సందర్భంగా సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి మాట్లాడుతూ వేద వేదాంగాలు,ఉపనిషత్తుల పరమార్థమే సనాతన ధర్మమని వివరించారు.మానవాళికి ఈ ధర్మాన్ని సులభంగా అందించేందుకే ఈ గ్రంథాన్ని సంస్కృతంలో రచించానని, సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలుగు తాత్పర్యంతో పాటు వివరమైన వివరణ కూడా జోడించినట్లు పేర్కొన్నారు.ఈ సభలో భక్తుల ప్రయోజనార్థం గ్రంథంలోని ముఖ్యమైన తొమ్మిది దివ్య సూత్రాలను మహర్షి స్వయంగా విడమరిచి బోధించారు.సనాతన ధర్మంపై సరైన అవగాహన పెంచుకోవడానికి ఈ గ్రంథం ఒక విశిష్ట మార్గదర్శకమని,ప్రతి హిందువూ అధ్యయనం చేయదగిన దివ్య గ్రంథమని సభకు విచ్చేసిన జగద్గురువులు కొనియాడారు. సనాతన ధర్మం అనాది అయినదని,దానికి ఆరంభం లేదని వివరించిన వారు.ప్రతి ఒక్కరూ అంతర్ముఖ సాధన, ఆత్మజ్ఞానం దైవానుభూతి ద్వారా తమ ఆత్మలోని దైవాన్ని దర్శించడమే ధర్మపు అసలైన సారమని ప్రవచించారు. సనాతన ధర్మం అనాది, విశ్వవ్యాప్తం,సర్వధర్మాలకు మూలం దీనికి మూల దైవం శివుడు,మూల శాస్త్రం వేదం, మూల సిద్ధాంతం అద్వైతం, మూల గురువు నదాశివుడు, మూల సాధనం ధ్యానం,లక్ష్యం ఆత్మసాక్షాత్కారం, ఆరాధించాల్సిన గురువు సిద్ధగురువు అనే సూత్రాలను శ్రీ రమణానంద మహర్షి గ్రంథం లోని ముఖ్యమైన అంశాలను వివరించారు.ఆధ్యాత్మిక ప్రముఖులకు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.కార్యక్రమంలో భాగంగా బంగారు శివలింగానికి విశేష అభిషేకం నిర్వహించిన అనంతరం అతిథులు జ్యోతిర్మండల ఆలయంలోని నక్షత్ర,నవగ్రహ,రాశ్యాత్మక దేవతలను దర్శించుకున్నారు. ఆ తర్వాత వేదికపై జగద్గురువులు,పీఠాధిపతుల సమక్షంలో సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి సంస్కృతంలో రచించిన సనాతన ధర్మ సహస్ర సూత్రాలు గ్రంథాన్ని దివ్యంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సిద్ధగురువులు ఆధ్యాత్మిక ప్రముఖులను పేరుపేరునా సత్కరించగా, వచించిన 1008 సంస్కృత సూత్రాల రచనను అతిథులు ఆశీర్వదించారు.రచయిత సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షికి అతిథులు, పీఠాధిపతులు ప్రత్యేక అభినందనలు దివ్య ఆశీస్సులు అందజేశారు.వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తజన సందోహానికి మహోత్సవంలో ఘనంగా అన్నదానం నిర్వహించారు.ధర్మబోధలు, ఆధ్యాత్మిక సందేశాలు, సంప్రదాయ సత్కారాల నడుమ ఈ గ్రంథావిష్కరణ మహోత్సవం అత్యంత ఆధ్యాత్మిక శోభతో ముగిసింది.



బీర్ల అంటేనే భరోసా..

మానవత్వం చాటుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య..
-ఆసుపత్రి ఖర్చుల కోసం రూ.50 వేల ఆర్థిక సాయం

హైదరాబాద్,అక్టోబర్ 05(ప్రజా కలం)

నాగార్జునసాగర్ గురుకుల పాఠశాలలోని మూడో అంతస్తు నుంచి మిర్యాలగూడ పట్టణానికి చెందిన గురుకుల విద్యార్థి ఆవుల నరేందర్ ప్రమాదవశాత్తు కిందపడిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఎల్‌బీనగర్‌లోని వెల్‌నాక్స్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు.ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే, బీర్ల ఐలయ్య ఆసుపత్రికి వెళ్లి



నరేందర్‌ను పరామర్శించారు.నరేందర్ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, వైద్యులను అడిగి చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను బీర్ల ఐలయ్య ఓదార్చారు నరేందర్ పూర్తిగా కోలుకునే వరకు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ.50,000/- ఆర్థిక సాయాన్ని నరేందర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. నరేందర్‌కు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహాయ సహకారాలు కొనసాగిస్తామని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు.

బతుకమ్మ వేడుకలకు జానకి శుక్లాకు ఆహ్వానం

హైదరాబాద్, అక్టోబరు 5 (ప్రజా కలం ప్రతినిధి): అలై బలై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 10న ముషీరాబాద్‌లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని తెలంగాణ గవర్నర్ సతీమణి జానకి శుక్లాను ఫౌండేషన్ ప్రతినిధులు ఆహ్వానించారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ లోక్‌భవన్‌లో జానకి శుక్లాను కలిసి ఆహ్వాన పత్రికను అందజేసింది.

అక్టోబరు 10న సాయంత్రం 6.30 గంటలకు ముషీరాబాద్‌లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకల వివరాలను ప్రతినిధులు ఆమెకు వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు మహిళల ఐక్యత, సామాజిక సామరస్యాన్ని చాటిచెప్పడమే వేడుకల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆహ్వానంపై జానకి శుక్లా సానుకూలంగా స్పందించినట్లు బండారు విజయలక్ష్మి తెలిపారు. ఆమెను కలిసిన ప్రతినిధి బృందంలో కేతినేని సరళ, అమృత, ఇందిరా సింగ్, మంత్రి కళావతి, ఏ. పావని తదితరులు పాల్గొన్నారు.



బోడుప్పల్‌లో సర్కిల్ లో

నిబంధనలకు పాతర

- రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ నిర్మాణాలు!
- సెట్ బ్యాక్ లు లేవు.. నిబంధనలు అసలే లేవు!
- జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు
- పర్యవేక్షణ లేకపోవడంతో రెచ్చిపోతున్న నిర్మాణదారులు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు!
- అధికారుల నిర్లక్ష్యంతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి





మేడ్చల్/మేడిపల్లి అక్టోబర్ 5 ప్రజాకలం ప్రతినిధి

మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నిబంధనలను బేఖాతరు చేస్తూ, పట్టణ ప్రణాళికా విభాగం టౌన్ ప్లానింగ్ అధికారుల కళ్లముందే నిర్మాణ దారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా రు. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ సముదాయాలను నిర్మిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని కొందరు నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

సెట్ బ్యాక్ లు లేవు.. నిబంధనలు అసలే లేవు!

భవన నిర్మాణ నిబంధనల ప్రకారం చుట్టూ వదలాల్సిన కనీస స్థలం సెట్ బ్యాక్ లు వదలకుండానే భారీ కట్టడాలను లేపుతున్నారు. నిబంధనల ప్రకారం రోడ్డు వెడల్పును బట్టి, భవన ఎత్తును బట్టి సెట్ బ్యాక్ లు ఉండాలి.కానీ, ఇక్కడ అంగుళం స్థలం కూడా వదలకుండా రోడ్డును ఆక్రమిస్తూ పిల్లర్లు లేపుతున్నా అధి కారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.
నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి

సాధారణంగా నివాస గృహాల అనుమతుల కంటే కమర్షియల్ అనుమతులకు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఫీజులు చాలా ఎక్కువగా ఉంటాయి. అయితే, నివాస గృహాల పేరిట తక్కువ ఫీజుతో అనుమతులు పొంది, వాటిని కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు, లాడ్జీలు, వ్యాపార సంస్థలుగా మారుస్తున్నారు. దీనివల్ల మున్సిపల్ కార్పొరేష న్ రాబడికి భారీగా గండి పడుతోంది. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన లక్షలాది రూపాయల ఆదాయం పక్కదారి పడుతోంది.

అధికారుల అండదండలతోనేనా?

క్షేత్రస్థాయిలో ఇంత జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి చేతులు మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని నిర్మాణదారులు మరింత రెచ్చిపోతు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, బోడుప్పల్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మైనర్‌పై లైంగిక దాడి..

ఆస్పత్రి నిర్వాహకుడి అరెస్ట్

మల్కాజిగిరి, అక్టోబరు 5 (ప్రజా కలం ప్రతినిధి):

నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆస్పత్రి నిర్వాహకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ సంతోషిమా నగర్ కాలనీలోని ఓ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ట్రైనీ నర్సుగా చేరిన మైనర్ బాలికను ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ తార్యా నాయక్ పలుమార్లు లైంగికంగా వేధించి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై బాధితురాలి తల్లి నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు, ఇతర చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు నేరేడ్‌మెట్ పోలీసులు తెలిపారు.



ప్రజా అవసరాలకే ప్రభుత్వ భూములు..

ఉపకేంద్రాలు, పోలీస్ స్టేషన్, మార్కెట్, స్మశాన వాటికలకు స్థలాల కేటాయింపుపై విజ్ఞప్తి..

పటాన్‌చెరు, అక్టోబర్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

వేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వ భూములు కేటాయించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు.సోమవారం సంగారెడ్డిలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఘనాపూర్,ఈదుల నాగులపల్లి, కర్దనూరు చౌరస్తా,వెలిమల తండాలో విద్యుత్ ఉపకేంద్రాలకు స్థలాలు కేటాయించాలని కోరారు. ఇస్నాపూర్ నూతన పోలీస్ స్టేషన్‌కు సర్వే నంబర్ 496లో రెండు ఎకరాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కొల్లూరులో మిగిలిన సుమారు 25 ఎకరాలను స్థానిక అవసరాలకు వినియోగించాలని, మార్కెట్, హిందూ, ముస్లిం, క్రైస్తవ స్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని కోరారు..



భూములు కోల్పోయిన రైతులకు నవంబర్ చివరి వరకు

హెచ్ఎండీఏ ప్లాట్లు కేటాయించాలి

- ఆరుట్ల, ఫసల్ వాది, కంది హెచ్ ఎం డిఏ లే అవుట్ల పై సంగారెడ్డి కలెక్టర్ సమక్షం లో హెచ్ ఎం డిఏ అధికారులతో రివ్యూ సమావేశం రివ్యూ సమావేశం లో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మల



సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 05(ప్రజా కలం):

సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ లే అవుట్లపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖల అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఆరుట్ల, ఇంద్రకరణ్, ఫసల్‌వాది, కంది ప్రాంతాల్లో గతంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుని రైతులకు సర్టిఫికెట్లు ఇచ్చినా, ఇప్పటివరకు ప్లాట్ల పొజిషన్ ఇవ్వలేదని పలువురు రైతులు ఎదురుచూస్తున్న విషయాన్ని సమావేశంలో జగ్గారెడ్డి,నిర్మల ప్రస్తావించారు. ఆయా ప్రాంతాల్లో లే అవుట్ల పరిస్థితి ఏమిటి, పనులు ఎందుకు ఆలస్యమయ్యాయి, ప్రస్తుతం ఎంత మేరకు పూర్తయ్యాయనే అంశాలపై జగ్గారెడ్డి హెచ్ఎండీఏ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆరుట్ల లే అవుట్ పరిధిలో 106 ఎకరాల 14 గుంటల్లో లే అవుట్ ప్రక్రియ పూర్తయినప్పటికీ, ఇంకా లబ్ధిదారుల జాబితా అందలేదని అధికారులు తెలిపారు. ఫసల్‌వాది ప్రాంతంలో భూసేకరణ ప్రక్రియ సుమారు 60 శాతం పూర్తయిందని, కొంత ప్రాంతంలో రైతుల నుంచి అభ్యంతరాలు ఉన్నాయని హెచ్ఎండీఏ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కంది గ్రామంలో 50 ఎకరాలకు హెచ్ఎండీఏ లే అవుట్ ప్రతిపాదించగా, ప్రస్తుతం 46 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, లబ్ధిదారుల జాబితా ఇంకా పంపలేదని అధికారులు తెలిపారు. కంది లే అవుట్ పనులను ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కంది, ఫసల్‌వాది లే అవుట్లను కూడా త్వరితగతిన సిద్ధం చేస్తామని అధికారులు వెల్లడించారు. కంది, ఫసల్ వాది, ఆరుట్ల లే అవుట్‌లో నవంబర్ చివరికల్లా ప్లాట్లను కేటాయిస్తామని హెచ్ఎండీఏ అధికారులు సమావేశంలో తెలిపారు. లే అవుట్లకు సంబంధించిన మిగిలిన పనులను పూర్తి చేసి, భూములు కోల్పోయిన లబ్ధిదారులకు సాధ్యమైనంత త్వరగా ప్లాట్లు కేటాయించాలని జగ్గారెడ్డి అధికారులను కోరారు. రైతులు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నందున ప్రక్రియలో మరింత జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక వచ్చే నవంబర్ చివరికల్లా హెచ్ఎండీఏ లే అవుట్లలో భూములు కోల్పోయిన రైతులందరికీ ప్లాట్లు కేటాయించేలా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ధాన్యం బకాయిలపై అధికారుల కొరడా

నిల్వలు లేకపోవడంతో రెండు రైస్ మిల్లులు సీజ్

మెదక్ అక్టోబర్ 5 (ప్రజాకలం ప్రతినిధి)

ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధాన్యం బకాయిలకు సంబంధించి సివిల్ సప్లై అధికారులు చేపట్టిన తనిఖీల్లో రెండు రైస్ మిల్లులను సీజ్ చేశారు. రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలోని విజయదుర్గ రైస్ మిల్, నర్సాపూర్ మండలంలోని ఏకే ట్రేడర్స్ రైస్ మిల్‌ను అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఆయా మిల్లుల్లో ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం నిల్వలు అందుబాటులో లేకపోవడంతో పాటు మిల్లు యజమానులు కూడా అందుబాటులో లేకపోవడంతో అధికారులు మిల్లులకు తాళాలు వేసి సీజ్ చేశారు. 2022--23 సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.65 లక్షల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ధాన్యం బకాయిల విషయంలో నిబంధనలను పాటించకపోవడంతో మిల్లులపై కేసులు నమోదు చేసినట్లు ఏసీఎస్ఓ నిస్సార్, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్లు నర్సింహులు, నాగరాజు వెల్లడించారు. ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం బకాయిలను వసూలు చేసేందుకు నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.



ఆక్రమణకు అడ్డుకట్ట..

నల్లకుంటకు కొత్త కళ

- నల్లకుంట కట్ట తొలగించి కుంట కబ్జాకు యత్నం..
- 12 ఎకరాల 16 గుంటల కుంట రక్షణకు రంగంలోకి ఇరిగేషన్, రెవెన్యూ..
- పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలతో కట్ట పునర్నిర్మాణం..
- సర్పంచ్ విక్రమ్‌గౌడ్ పోరాటానికి ఫలితం, గ్రామస్థుల హర్షం..
-మళ్లీ కబ్జా కాకుండా నిరంతర పర్యవేక్షణ కోరిన గ్రామస్థులు..



పటాన్‌చెరు, అక్టోబర్ 5(ప్రజా కలం) ప్రతినిధి

మూడేళ్లగా గ్రామస్థులు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం, చివరకు ప్రజల ఆగ్రహానికి తలొగ్గింది. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలోని నల్లకుంట ఆక్రమణ వ్యవహారం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలతో కుంట కట్ట పునర్నిర్మాణ పనులను ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ప్రారంభించడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి..

12 ఎకరాల 16 గుంటల కుంటకే ఎసరు!..

నందిగామ గ్రామంలోని సర్వే నంబర్ 78లో 12 ఎకరాల 16 గుంటల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న నల్లకుంట, గ్రామానికి జీవనాడిగా నిలిచింది. అయితే కుంట కట్టను తొలగించి, భూమిని ఆక్రమించేందుకు పక్కా పథకం ప్రకారం ప్రయత్నాలు జరిగాయని రైతులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఇంతటితో ఆగకుండా, కుంట భూమిలోనే వరి సాగు కూడా చేశారని గ్రామస్థులు వెల్లడించడం కలకలం రేపుతోంది. చెరువు భూమిలో పంటలు పండించేంత బరితెగింపు జరుగుతున్నా అడ్డుకునే వారే లేకపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు..

మూడేళ్లుగా మొర... పట్టించుకోని అధికారులు..

కుంట అన్యాక్రాంతమవుతున్న విషయాన్ని గత మూడేళ్లుగా గ్రామస్థులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదులు చేసినా, వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో తమ గోడు అరణ్యరోదనగా మారిందని వారు వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే కబ్జాదారులు రెచ్చిపోయారనే విమర్శలు గ్రామంలో వినిపిస్తున్నాయి..

సర్వసభ్య సమావేశంలో గళమెత్తిన గ్రామస్థులు..

ఇటీవల జరిగిన పటాన్‌చెరు మండల సర్వసభ్య సమావేశం ఈ వ్యవహారంలో కీలక మలుపు తిప్పింది. నందిగామ గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, అధికారుల ముందే సమస్యను ఎండగట్టారు. గ్రామస్థుల తరపున సర్పంచ్ విక్రమ్‌గౌడ్ సమస్య తీవ్రతను వివరిస్తూ, తక్షణ పరిష్కారం చూపాలని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ సమావేశమే అధికారుల్లో కదలిక తెచ్చిందని స్థానికులు చెబుతున్నారు..

పోలీసు బందోబస్తు మధ్య రంగంలోకి అధికారులు..

సర్వసభ్య సమావేశం అనంతరం ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు నల్లకుంట వద్దకు చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా బీడీఎల్ భానూర్ పోలీసుల బందోబస్తు మధ్య జేసీబీలతో కుంట కట్ట పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. యంత్రాలు రంగంలోకి దిగడంతో కబ్జాదారుల్లో గుబులు మొదలైందనే చర్చ గ్రామంలో జోరుగా సాగుతోంది..

గ్రామస్థుల హర్షం...కానీ ఒక్కటే డిమాండ్..

అధికారుల చర్యలతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అయితే ఇది తాత్కాలిక చర్యగా మిగిలిపోకూడదని స్పష్టం చేశారు. కుంట భూములు భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలకు గురికాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను కోరారు. కబ్జాకు పాల్పడిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ గ్రామస్థుల్లో బలంగా వినిపిస్తోంది..



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

మీర్‌పేట్‌లో 'సేవా సంకల్ప్ అభియాన్'

మీర్‌పేట్ బీజేపీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి

మీర్‌పేట్, అక్టోబర్ 05 (ప్రజా కలం):

ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా క్షేత్రంలో ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాల పాటు దేశానికి, ప్రజలకు అందించిన సేవలకు కృతజ్ఞతగా రాష్ట్ర, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు మీర్‌పేట్‌లో బీజేపీ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్



అభియాన్' కార్యక్రమం నిర్వహించారు.మీర్‌పేట్ బీజేపీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి ఆధ్వర్యంలో ఈరోజు అంగన్ మిలన్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మీర్‌పేట్ క్లస్టర్-1 పరిధిలోని 7 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, వర్కింగ్ స్టాఫ్‌ను అభినందనలతో సన్మానించారు.
మీర్‌పేట్ – అరుణ టీచర్, సిర్లా హిల్స్ – కవిత టీచర్, ప్రశాంతి నగర్ – లలితా టీచర్, లెనిన్ నగర్-1 – సుకన్య టీచర్, లెనిన్ నగర్-2 – సుకన్య టీచర్, లెనిన్ నగర్-3 – స్వప్న టీచర్ జనప్రియ మహానగర్ – సరోజ టీచర్ అనంతరం అంగన్‌వాడీ విద్యార్థులకు పెన్సిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ధ్యాసని తిరుపతిరెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు చేవ్వా శ్రావణ్, జిల్లా నాయకులు కీసర హరినాథ్ రెడ్డి, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అంగన్ మిలన్ సేవా ప్రోగ్రాం ఇంచార్జ్ ల్యాగ హరిత, ఉపాధ్యక్షురాలు కుందనం లతశ్రీ, మాజీ ప్రజా ప్రతినిధులు జిల్లెల్ల అరుణ, ఏ. భీమ్‌రాజ్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, మహిళా నాయకురాలు సి. ఉమాదేవి, లిక్కి కృష్ణారెడ్డి, గోలి శ్రీనివాస్ రెడ్డి, రవీందర్, కోట్ల గోపాల్, సత్తయ్య, శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి రాష్ట్ర నాయకులు కోలన్ శంకర్ రెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 05, (ప్రజా కలం):

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ని ఈరోజు ఉదయం



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కోలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ సమస్యలు, రైతు బంధు, రుణమాఫీ, ఆరు గ్యారంటీల అమలు వంటి ప్రజా సమస్యలపై మీరు చేస్తున్న పోరాటానికి కార్యకర్తల తరపున అభినందనలు అన్నారు. భవిష్యత్తులో మరిన్ని పోరాటాలను ప్రకటించాలని, మీ పోరాటాలకు మేమంతా ముందుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత, మహేశ్వరం అసెంబ్లీ ఇంచార్జ్ కోలన్ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి ఘన సన్మానం

'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమం

గజ్వేల్: అక్టోబర్ 5 (ప్రజా కలం ప్రతినిధి):

'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14, 15వ వార్డుల అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమాన్ని నిర్వహించారు.సిద్దిపేట జిల్లా బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఆలేటి సుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో చిన్నారుల సంక్షేమం కోసం విశేష సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. అనంతరం చిన్నారులతో కొద్దిసేపు మమేకమై వారితో సరదాగా గడిపారు.పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు చూడటం ఎంతో ఆనందాన్నిచ్చిందని నాయకులు తెలిపారు.చిన్నారుల పోషణ,ప్రాథమిక విద్య,ఆరోగ్య సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బందిని గౌరవించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చేప్యాల వెంకట్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సిల్వేరు కుంకుమ రాణి, గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్‌కుమార్,పట్టణ ఉపాధ్యక్షురాలు చెన్నోజి నీరజ,జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు స్వరాజ్యలక్ష్మి, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంతూరి మమత తదితరులు పాల్గొన్నారు.



నాదర్‌గుల్‌లో అక్రమ సర్వేపై ప్లాట్ల యజమానుల ఆగ్రహం

నోటీసులు ఇవ్వకుండా ఏడీ సర్వేయర్ సర్వే చేయడం చట్ట విరుద్ధమన్న బాధితులు

సర్వే నెం. 806లో 121 నుంచి 165 వరకు ప్లాట్ల కొనుగోలుదారుల ఆవేదన



మహేశ్వరం, అక్టోబర్ 05, (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలోని సర్వే నెం. 806 మరియు పరిసర సర్వే నంబర్లలో ఏడీ సర్వేయర్ ఏకపక్షంగా, చట్ట విరుద్ధంగా సర్వే నిర్వహించారని బాధిత ప్లాట్ల యజమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నిర్వహించిన ఈ సర్వేను వెంటనే రద్దు చేయాలని నాదర్‌గుల్ లేఅవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి తోట రాం రెడ్డి, ఇతర ప్లాట్ల యజమానులు మాట్లాడుతూ.. "బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని సర్వే నంబర్లు 794, 795, 796, 803, 804, 805, 806, 807లలో ఉన్న ప్రైవేట్ లేఅవుట్‌లోని ప్లాట్ నంబర్లు 121 నుండి 165 వరకు, ప్లాట్ నంబర్ 169లను తాము 1990 నుండి 2005 మధ్య కాలంలో రిజిస్టర్డ్ సేల్ డీడ్ల ద్వారా కొనుగోలు చేశాము. అన్ని అనుమతులతో హద్దులు ఏర్పాటు చేసుకుని, ఇండ్లు, ప్రహరీ గోడలు నిర్మించుకుని దశాబ్దాలుగా ప్రశాంతంగా అనుభవిస్తున్నాము" అని పేర్కొన్నారు. గడ్డం వెంకట్ రెడ్డి, గడ్డం మన్మోహన్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి, ఇప్పటికే లేఅవుట్‌గా మారిన సర్వే నెం. 806 భూములకు అక్రమంగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందారని ఆరోపించారు. ఈ పాస్ పుస్తకాల ఆధారంగా వారు 121 నుండి 165 వరకు గల ప్లాట్లలోకి అక్రమంగా ప్రవేశించి తమను బెదిరిస్తున్నారని వాపోయారు.సరిహద్దు ప్లాట్ల యజమానులకు, తహసీల్దార్‌కు కనీసం సమాచారం ఇవ్వకుండా ఏడీ సర్వేయర్ సర్వే చేయడం తీవ్ర అభ్యంతరకరమని, ఇది బాధితుల హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు.ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ప్లాట్ నెం. 121 నుండి 165 వరకు నిర్వహించిన ఏడీ సర్వేను వెంటనే రద్దు చేయాలని కోరారు. అదే విధంగా సర్వే నెం. 806పై తప్పుడు పత్రాలతో గడ్డం వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులు పొందిన పట్టాదార్ పాస్ పుస్తకంపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి రద్దు చేయాలని, బాధితులకు తగిన భద్రత కల్పించి నిలిచిపోయిన ఎల్ఆర్ఎస్ ప్రక్రియను క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ

మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు



కందుకూరు, అక్టోబర్ 05,(ప్రజా కలం):

కందుకూరు మండల మాజీ జడ్పీటీసీ, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బొక్క జంగారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం అత్యంత ఘనంగా జరిగాయి. ఆయన స్వగ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన ఈ వేడుకలకు వివిధ పార్టీల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, యువజన సంఘాల ప్రతినిధులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జంగారెడ్డికి పుష్పగుచ్ఛాలు, గజమాలలు, శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి జంగారెడ్డిని శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేస్తూ అందరితో సన్నిహితంగా ఉండే జంగారెడ్డి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం బొక్క జంగారెడ్డి మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలకు వచ్చి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, ప్రజా సేవలో ముందుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి

- 7 గంటల విద్యుత్‌తో పంటలు ఎండిపోతున్నాయి.

- రైతులను ఆదుకోకుంటే ఉద్యమం ఉధృతం

- కరెంటు ఇవ్వకుంటే రహదారులు దిగ్బంధిస్తాం: వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అక్టోబర్ 5 (ప్రజా కలం ప్రతినిధి):

రైతుల పంటలకు 7 గంటల విద్యుత్ సరిపోవడం లేదని,విద్యుత్ కోతలు, లోవోల్టేజీ కారణంగా పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ అందించిన మాదిరిగా రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే వేలాది మంది రైతులతో కలిసి రహదారులను దిగ్బంధించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.గజ్వేల్ పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు.అనంతరం వంటేరు ప్రతాప్‌రెడ్డి పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ సరఫరా లాగ్‌బుక్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 12 గంటల విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం కేవలం 7 గంటల విద్యుత్ మాత్రమే అందిస్తోందని ఆరోపించారు. వ్యవసాయానికి 7 గంటల కరెంటు సరిపోక పంటలు ఎండిపోతున్నాయని, లోవోల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయని,ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.రైతులు ఒక్కో ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారని,సమయానికి విద్యుత్, సాగునీరు అందకపోతే ఎకరాకు రూ.30 వేల వరకు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు.రైతుల సమస్యలపై ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తున్నా, రైతులు స్వయంగా కరెంటు, సాగునీరు అందించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.మల్లన్నసాగర్,కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో కరెంటు ఎప్పుడు వస్తుందో,ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని విమర్శించారు. తెలంగాణ రైతుల పంటలను ఎండబెట్టి వారి పరిస్థితిని దయనీయంగా మారుస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతాంగానికి సాగునీటితో పాటు 24 గంటల నిరంతర విద్యుత్ అందించి పంటలను కాపాడాలని కోరారు. రాబోయే రెండు,మూడు రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే మండల, నియోజకవర్గ కేంద్రాల్లో వేలాది మంది రైతులతో ధర్నాలు,రాస్తారోకోలు నిర్వహించి రహదారులను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.కార్యక్రమంలో గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్,వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్,పట్టణ అధ్యక్షుడు నమాజ్ మీరా,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్,కొండపాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, మాజీ వైస్ చైర్మన్ జాక్కియద్దీన్,మాజీ ఎంపీపీ లతా రమేష్‌గౌడ్,కౌన్సిలర్లు మామిడి శ్రీధర్,బొగ్గుల స్వప్న సురేష్, కప్ప మమతా పోచయ్య,మార్కుంటి కనకయ్య,లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచేలిమి స్వామి,నాయకులు అహ్మద్, హనుమంత్‌రెడ్డి, స్వామిచారి,వాజిద్ తదితరులు పాల్గొన్నారు.



నేదునూరులో గైరాన్ భూములకు సర్వే చేసి పొజిషన్ చూపించాలి

కందుకూరు తహసీల్దార్ కు వినతి

బుడ్డిరపు శ్రీనివాస్ అంకగళ్ల కుమార్

కందుకూరు, అక్టోబర్ 05 (ప్రజా కలం):

కందుకూరు మండలం నేదునూరు గ్రామంలో సర్వే నంబర్లు 444, 520, 537, 592 లలో దాదాపు 520 మందికి గైరాన్ సర్టిఫికెట్లు, పాస్ బుక్కులు ఇవ్వడం జరిగిందని, అయితే అందులో కొంతమందికి మాత్రమే భూమి పొజిషన్ చూపించారని, ఇంకా 120 మంది నిరుపేదలకు భూమి చూపించలేదని బాధితులు



ఆవేదన వ్యక్తం చేశారు.భూమి చూపించాలని పలుమార్లు అధికారులను కలిసినా సర్వే చేసి భూమి చూపించడం లేదని, వెంటనే సర్వే చేసి 120 మందికి భూమి పొజిషన్ చూపించాలని కోరుతూ ఈరోజు కందుకూరు తహసీల్దార్ ని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బుడ్డిరపు శ్రీనివాస్, అంకగళ్ల కుమార్, మిదె యాదయ్య, వగూర యాదయ్య, కళ్యాణ్కర్ వరుణ్ కుమార్, ఉన్ని సాయిలు, సేరిగా రాములు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం వద్ద నేడు బీజేపీ నిరసన

మహేశ్వరం, అక్టోబర్ 5 (ప్రజా కలం):

బడంగ్‌పేట్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి రాజు తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు బడంగ్‌పేట్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్, ప్రశాంతి హిల్స్, జిల్లెలగూడ, మీర్‌పేట్, బడంగ్‌పేట్, బాలాపూర్ డివిజన్లలో రహదారుల అధ్వాన పరిస్థితి, డ్రైనేజీ సమస్యలు, మంచినీటి ఇబ్బందులు, విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆమె ఆరోపించారు. అలాగే చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌తో పాటు అధికార పార్టీ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు నిరసన చేపడుతున్నట్లు విజయలక్ష్మి రాజు వెల్లడించారు.



ఈ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు అందెల శ్రీరాములు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టరేట్ వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ నిరసన

డీసీసీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డి పిలుపు

రంగారెడ్డి, అక్టోబర్ 05(ప్రజా కలం ప్రతినిధి)

ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష ధోరణికి నిరసనగా, సర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై ఏఐసీసీ మరియు ఇండియా కూటమి పిలుపు మేరకు, అలాగే టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మరియు అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ఓటర్ల హక్కుల కోసం ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం ఈ నిరసన కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ , సేవాదళ్ మరియు అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు.



ఉచిత విద్యా సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 05.

విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడనే ఉద్దేశంతో టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత విద్యా, విజ్ఞాన సేవలు అందిస్తున్నట్లు ఫౌండేషన్ కోఆర్డినేటర్ జంగ తేజ తెలిపారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు



ఫౌండేషన్ సేవలపై అవగాహన కల్పించారు. గజ్వేల్ ప్రధాన రహదారి లోని టీవైఆర్ ప్రైడ్ భవనంలో విజ్ఞాన కేంద్రం ద్వారా పుస్తకాలు, ఈ-పుస్తకాలు, కంప్యూటర్లు, పఠన గదులు, ఉచిత ప్రతుల సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు.ఫౌండేషన్ ఆధ్వర్యంలో 32 ప్రభుత్వ పాఠశాలలు, యువజన సంఘాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అందించే ఉపకార వేతనాల సమాచారాన్ని ఉచితంగా అందించడంతో పాటు అర్హులైన విద్యార్థులకు దరఖాస్తు చేసుకునేందుకు సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని పోటీ పరీక్షలకు ప్రాథమిక శిక్షణ అందించే ఉచిత తరగతులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమి కార్యాచరణ

ఓటు హక్కు పరిరక్షణ కోసం చలో కలెక్టరేట్'కు పిలుపు

మెదక్, అక్టోబర్ 5 (ప్రజాకలం ప్రతినిధి) ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు కాపాడేందుకు ఇండియా కూటమి చేపట్టనున్న కార్యక్రమాలపై సోమవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ, పీసీసీ



అధ్యక్షుల ఆదేశాల మేరకు మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఇండియా కూటమి ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు, ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణతో పాటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రజా సమస్యలపై నాయకులు చర్చించారు. ఓటు హక్కును కాపాడేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. మంగళవారం అక్టోబర్ 6న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు గంగాధర్, సీపీఐ కార్యదర్శి మల్లేశం, కౌన్సిలర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గజ్వేల్ రైల్వే స్టేషన్ ఏర్పాటుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

గజ్వేల్ ప్రజల చిరకాల రైల్వే కలను సాకారం చేసినందుకు ధన్యవాదాలు

'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా రైల్వే స్టేషన్‌ను సందర్శించిన బీజేపీ నాయకులు



గజ్వేల్: అక్టోబర్ 5
(ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వే స్టేషన్‌ను సాకారం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం గజ్వేల్ రైల్వే స్టేషన్‌ను సందర్శించి, ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి సురేష్,మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా గజ్వేల్ ప్రజలు ఎదురుచూస్తున్న రైల్వే సౌకర్యం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ హయాంలో అందుబాటులోకి రావడం వల్ల సంతోషం వ్యక్తం చేశారు. 2014లో మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం గజ్వేల్ మండలం కోమటిబండలో మిషన్ భగీరథ కార్యక్రమం సందర్భంగా గజ్వేల్ రైల్వే స్టేషన్‌కు వర్చువల్‌గా భూమిపూజ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం రైల్వే పనులు కొనసాగి గజ్వేల్‌లో రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడంతో ప్రజల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. గజ్వేల్ ప్రాంత ప్రజలకు రైల్వే సౌకర్యాన్ని అందించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి,ఇందుకు సహకరించిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే కొమురవెల్లి మల్లన్న పుణ్యక్షేత్రానికి భక్తుల రాకపోకలకు సౌకర్యంగా రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడం కూడా సంతోషకరమన్నారు.ప్రజలు, భక్తుల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే చర్యలకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వంజరి రాజు,దాతర్‌పల్లి సర్పంచ్ రాజు, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి,బారు అరవింద్,బీజేవైఎం నాయకులు మహేష్‌చారి,అనిల్, మండల కార్యదర్శి నరసింహారెడ్డి, నాయకులు చిప్ప నరేష్, ప్రసాద్ ,మల్లేశం,మహేందర్, మణికంఠస్వామి తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు స్థలాలపై కదలిక..

జర్నలిస్టుల స్థలాల అంశంపై సానుకూల స్పందన..కలెక్టర్ హామీ..

పటాన్‌చెరు, అక్టోబర్ 5(ప్రజా కలం) ప్రతినిధి

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న అర్హులైన జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సొంత స్థలం సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో అర్హత కలిగిన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించే అంశాన్ని సానుకూలంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నందున వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రస్తావించిన అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని జర్నలిస్టుల సమస్యలను పరిశీలిస్తామని, అర్హులైన జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు అంశంలో నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు..

ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

హైదరాబాద్ : ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ వైపు అడుగులు వేసి ఎంపీగా పోటీ చేయడంతో ముంచుకొచ్చిన ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి, తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత.. ఈ ఉపఎన్నిక బరిలో తమ పార్టీ అభ్యర్థిని దించుతామని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో, ఖైరతాబాద్ పోరు తెలంగాణ రక్షణ సేనకు తమ ఉనికిని, క్షేత్రస్థాయి ప్రభావాన్ని చాటుకునే ప్రతిష్టాత్మక పరీక్షగా మారనుంది. ఈ ఎన్నికల్లో కవిత నేతృత్వంలోని పార్టీకి ప్రధాన లక్ష్యం తక్షణమే సీటును కైవసం చేసుకోవడం కాకపోవచ్చు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల త్రిముఖ పోటీ మధ్య తమకంటూ ఒక ప్రత్యేకమైన ఓటు బ్యాంకు, సిద్ధాంతపరమైన స్థానం ఉందని నిరూపించుకోవడమే ఆమె అనలైన పొలిటికల్ ఎజెండాగా కనిపిస్తోంది. బిఆర్ఎస్ నుంచి సస్పెన్షన్, జైలు జీవితం తర్వాత "సామాజిక తెలంగాణ" నినాదంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు.. హైదరాబాద్ నడిబొడ్డున జరిగే ఈ బైపోల్ ఒక లిట్మస్ టెస్ట్ లాంటిది. ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇస్తూ ఓట్లను రాబట్టగలిగితే, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్‌ను ఒక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టే అవకాశం దక్కుతుంది. ఖైరతాబాద్ నియోజకవర్గ భౌగోళిక, సామాజిక సమీకరణాలు పరిశీలిస్తే ఇక్కడ పోటీ అత్యంత విలక్షణంగా ఉంటుంది. బస్తీల్లో ఉండే శ్రామిక వర్గాలు, కాలనీల్లోని మధ్యతరగతి ప్రజలు, హైటెక్ ఉద్యోగులు, ఐటీ ఆధారిత వ్యాపారవేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఇక్కడ నివసిస్తున్నారు. స్థానికంగా మంచి పట్టుండి, ప్రజాదరణ పొందిన బలమైన అభ్యర్థిని బరిలోకి దించగలిగితే తెలంగాణ రక్షణ సేన ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే కింగ్ మేకర్‌గా మారే ప్రభావం చూపుతుంది. ఈ ఉపఎన్నికలో కవితకు అతిపెద్ద ప్లస్



పాయింట్ మహిళా ఓటర్లు. గతంలో తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడం, మహిళా సాధికారత అంశాలపై పోరాడటం వల్ల తెలంగాణ సెంటిమెంట్‌తో పాటు మహిళల్లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఖైరతాబాద్ వంటి అర్బన్ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల శాతం అధికంగా ఉండటం వల్ల.. ధరల పెరుగుదల, ఉచిత బస్సు ప్రయాణాల అమలు తీరు, మహిళా భద్రత, స్థానిక సమస్యలపై ఆమె చేసే ప్రచారం మహిళల ఓట్లను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల సాంప్రదాయ మహిళా ఓటు బ్యాంకుకు గండికొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. దానం నాగేందర్ పార్టీ మార్పు , రాజ్యాంగబద్ధమైన వదవుల దుర్వినియోగంపై కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరొక పార్టీకి వెళ్లడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే అని ప్రజల్లోకి తీసుకెళ్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ అంతర్గత ఒప్పందాలను ఒకేసారి ఎండగట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. రాజధాని నగరంలోని విద్యావంతులు, తటస్థ ఓటర్లు ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రాధాన్యమిస్తే.. ఈ రాజకీయం కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటికీ తలనొప్పిగా మారనుంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితాల సరళిని తలకిందులు చేసే శక్తి తెలంగాణ రక్షణ సేనకు ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గెలుపు ఓటముల కంటే కూడా, తాము సాధించే ఓట్ల శాతమే భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో కవిత ఎంతవరకు ప్రభావం చూపగలరనే దానికి ప్రామాణికంగా నిలుస్తుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సైతం కవిత అభ్యర్థిత్వం , వ్యూహాలను తేలిగ్గా తీసుకోలేక, తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు కొత్త సమీకరణాలను తెరపైకి తెచ్చే పరిస్థితి ఏర్పడింది.

సమాచార హక్కు చట్టం - వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలి..

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత .

సంగారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 5 (ప్రజా కలం) : తెలంగాణ సమాచార కమిషన్ కార్యదర్శి ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం--2005పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నేటి (అక్టోబర్ 5) నుంచి 12వ తేదీ వరకు సమాచార హక్కు చట్టం - ఆర్టీఐ వారోత్సవాలు --2026 నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ సంగీత తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులతో ఆర్టీఐ వారోత్సవాల నిర్వహణపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం--2005పై సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, చట్టం ప్రకారం ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలపై చైతన్యం కల్పించడం వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలలో సంబంధిత శాఖలు, పబ్లిక్ అథారిటీస్ భాగస్వాములను చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.



ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా సమాచారాన్ని వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 9 న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు జిల్లా కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఏ పి ఐ ఓ లు , పి ఐ ఓ లు , ఫస్ట్ అప్పీలేట్ అథారిటీ అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ఆర్టీఐ వారోత్సవాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు .

విద్యుత్ కొరత లేకుండా చూస్తున్నాం

నల్గొండ : రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నల్గొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలో లాగ్‌బుక్‌లు పరిశీలించిన విషయం వాస్తవమేనని మంత్రి తెలిపారు. అప్పట్లో కొందరు ఆపరేటర్లు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరువు పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు. తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. అయినప్పటికీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19 వేల మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నామని తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సింగరేణి బొగ్గు లింకేజీ సమస్యలు, నైనీ బ్లాక్‌కు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి బొగ్గు సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి



ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి ప్రత్యేకంగా 5 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కరువు పరిస్థితుల ను చూసి ప్రతిపక్షాలు సంతోషిస్తున్నాయని విమర్శించిన ఆయన.. తమ ప్రభుత్వం రైతులు, ప్రజలను ఆదుకునేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

సికింద్రాబాద్ : అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ పట్టభద్రులకు సూచించారు. బేగంపేట్, రాంగోపాల్ పేట్ డివిజన్లలో తలసాని పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ నిచ్చారు. దేవిడిలో 50లక్షలతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ పైప్ లైన్ పనులను తలసాని నేడు ప్రారంభించారు. అనంతరం రాంగోపాల్ పేట డివిజన్ నల్లగుట్ట లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. సభ్యత్వ నమోదు పత్రాలను ఎమ్మెల్యే తలసాని కి పలువురు గ్రాడ్యుయేట్ లు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఓటు వేసిన గ్రాడ్యుయేట్ లు కూడా తప్పనిసరిగా తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇంటింటికీ వెళ్ళి గ్రాడ్యుయేట్ లను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

నాలుగు ప్యాకేజీలుగా అమరావతి

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాల చుట్టూ నిర్మించ తలపెట్టిన అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఈ భారీ ప్రాజెక్టు పనుల కోసం నాలుగు ప్యాకేజీలుగా టెండర్లను ఆహ్వానించింది. మొత్తం రూ.11,537.70 కోట్ల అంచనా వ్యయంతో సివిల్ పనులను చేపట్టనున్నారు.శుక్రవారం నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 195.13 కిలోమీటర్ల పొడవున ఈ రహదారిని నిర్మించనున్నారు. ఇందులో 189.93 కి.మీ. ఆరు వరుసల ఓఆర్ఆర్ కాగా, నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు 5.2 కి.మీ. నాలుగు వరుసల అనుసంధాన రహదారి కూడా ఉంది. నవంబర్ 18 వరకు బిడ్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించగా, 19న టెక్నికల్ బిడ్లను తెరవనున్నారు. కేంద్ర కమిటీల నుంచి తుది అనుమతులు త్వరలో రానున్నాయన్న అంచనాతో ఎన్‌హెచ్ఏఐ ముందుగానే టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టింది.ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్నారు. దీని ప్రకారం, నిర్మాణ సమయంలో కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థకు ప్రభుత్వం 40 శాతం నిధులు చెల్లిస్తుంది. మిగిలిన 60 శాతం మొత్తాన్ని కాంట్రాక్టర్ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని ప్రభుత్వం వడ్డీతో పాటు 10-15 ఏళ్లలో తిరిగి చెల్లిస్తుంది. ప్రతి ప్యాకేజీని మూడేళ్లలో పూర్తి చేయాలని టెండర్లలో పేర్కొన్నారు.ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 97 గ్రామాల మీదుగా ఈ ఓఆర్ఆర్ వెళ్తుంది. దీని నిర్మాణంలో భాగంగా కృష్ణా నదిపై రెండు భారీ వంతెనలు, మూడు సొరంగాలు, అనేక అండర్‌పాస్‌లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. విమానాశ్రయానికి అనుసంధానం మెరుగుపడి ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం త్వరగా ప్రారంభించాలి

పీఏసీఎస్ చైర్మన్‌కు వెంకిర్యాల గ్రామ నాయకుల వినతి

బీబీనగర్, అక్టోబర్ 05(ప్రజాకలం) మండలంలోని వెంకిర్యాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని గ్రామ నాయకులు కోరారు. సోమవారం బీబీనగర్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ పొట్లోళ్ల శ్యామ్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌గౌడ్‌ను శాలువాతో సన్మానించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాన్ని త్వరగా ప్రారంభించాలని కోరారు. ఈకార్యక్రమంలో వెంకిర్యాల గ్రామ నాయకులు చింతల లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ గండు బసవయ్య యాదవ్, ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల టీమ్ వర్క్‌తో మూడు ప్రాణాలకు పునర్జన్మ

భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో విజయవంతమైన సిజేరియన్

సకాలంలో స్పందించిన వైద్యులు - 108 సిబ్బందికి సామాజిక కార్యకర్త న్యాయవాది కర్నే రవి అభినందనలు

భద్రాద్రి కొత్తగూడెం : అర్ధరాత్రి వేళలో ఎదురైన అత్యవసర ప్రసవ పరిస్థితిలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, 108 సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి తల్లి, శిశువుల ప్రాణాలను కాపాడేందుకు చేసిన కృషి అభినందనీయమని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి పేర్కొన్నారు.మణుగూరు మండలం పగిడేరు గ్రామపంచాయతీ పరిధిలోని విప్పలగుంపు గ్రామానికి చెందిన బాడిషా భీమా, భర్త రమేష్ గర్భిణిగా మణుగూరు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో మొదటి శిశువు సాధారణ ప్రసవం ద్వారా జన్మించినట్లు తెలిపారు.అయితే రెండో శిశువు ప్రసవం విషయంలో పరిస్థితి క్లిష్టంగా మారడంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. సమయం వృథా చేయకుండా మెరుగైన అత్యవసర వైద్య సేవల కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించాల్సిన అవసరాన్ని గుర్తించారు.రాత్రి సుమారు 12:30 గంటల సమయంలో మణుగూరు ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి గర్భిణిని తరలించారు.

